www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI





శనివారం | 21-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 253

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి మ. 12.21 తదుపరి సప్తమి; నక్షత్రం: పుబ్బ తె.6.14 తదుపరి ఉత్తర; వర్జ్యం: మ.12.36-2.21; దుర్ముహూర్తం: ఉ.6.44-8.12; అమృతఘడియలు: రా.11.10-12.56; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 5.42

వరంగల్

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru






**ధ్యానం భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవన వారసత్వం!. వేద కాలం నుండి మనుషులలో అంతర్గత వికాసానికి, ఆత్మసాక్షాత్కారానికి ధ్యానం ఒక సాధనం. అలాంటి ధ్యానంకు ప్రపంచస్థాయి గుర్తింపునిస్తూ ఐక్యరాజ్యసమితి డిసెంబర్ 21ని ప్రత్యేకంగా "ప్రపంచ ధ్యాన దినోత్సవంగా" జరపాలని ప్రకటించడం యావత్ భారతీయ సాంస్కృతిక వారసత్వానికే గర్వకారణం!.**

ప్రస్తుతం వేర్వేరు కారణాల వల్ల మహోన్నత భారతీయ సాంస్కృతిక జీవన విలువలు ధ్వంసమై ఎన్నో అనర్థాలకు దారితీస్తున్నాయి. సమాజంలోని కొందరు పెడత్రోవ పట్టి దురలవాట్లకు, నేరాలకు పాల్పడే పరిస్థితి దాపురించింది. జీవనశైలులలో వచ్చిన మార్పులు, ప్రపంచ దేశాలలో పొడచూపుతున్న పరిణామాలు కలిసి కుటుంబ జీవన పద్ధతులను, మానవ సంబంధాలను, నైతిక జీవన విధానాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి ఎన్నో దుష్పరిణామాలకు పరిష్కారాన్ని మన జీవన విధానంలో మార్పు ద్వారా సాధించవచ్చు.

రూపాయి ఖర్చు లేకుండా రోజుకు ఒక గంట మనది కాదనుకొని యోగ, ధ్యానం, వ్యాయామాలపై దృష్టి కేంద్రీకరిస్తే వందేళ్ళ ఆనందకరమైన నిండు జీవితం మనదే అవుతుంది. ఆరోగ్యకరమైన జీవన విధానం, ఆహారపు అలవాట్ల ద్వారా మనల్ని, మన కుటుంబాన్ని, మన సమాజాన్ని ఆరోగ్యవంతంగా మలిచి, మనం అప్పుల పాలు, ఆసుపత్రుల పాలు కాకుండా కాపాడుకోవచ్చు. విద్యార్థులు, తల్లిదండ్రులు, రైతాంగం, యువత, మహిళలు, రాజకీయ నాయకులు, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను మాత్రమే కాక సరైన ఆలోచనా ధోరణులను కూడా అలవర్చుకోవడం ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, విద్యాపరమైన విజయాలను కూడా సాధించవచ్చు. అలా వ్యక్తుల ఆలోచనా ధోరణి, అలవాట్లలో మార్పు ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చు.

ఒక జాతి సంస్కృతి అంటే వేలాది ఏండ్ల నుండి ఆ జాతి సముపార్జించిన ఆచారాలు, వ్యవహారాలు, కట్టుబాట్లు, సంప్రదాయాలు, విలువలు, మానవ సంబంధాలు, భాష, సాహిత్యం, సాంకేతిక పరిజ్ఞానం అన్నీ!. శతాబ్దాల కాలం నుండి పరంపరగా వస్తున్న భారతీయ తాత్వికతను, జీవన విధానాన్ని, జనజీవన శైలులను, "సత్యం - శివం - సుందరం" వంటి ఆధ్యాత్మక, తాత్విక విలువలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రశాంత, ప్రగతి శీలక తెలంగాణ సమాజ నిర్మాణానికి ధ్యానం ఒక మార్గం. కనుక ఈ తరానికి, మన సమాజానికి ధ్యానం ఆవశ్యకతపై సరైన అవగాహన కలిగించాల్సి ఉందని, దీక్షా, పట్టుదల, సంకల్పం, లక్ష్య సాధన గల నవ సమాజ నిర్మాణానికి ధ్యానం కూడా ఒక వారధి అవుతుందని మనసా, వాచా, కర్మణా త్రికరణశుద్ధిగా నేను భావిస్తున్నాను.

**జూపల్లి కృష్ణారావు**
పర్యాటక, సాంస్కృతిక శాఖామాత్యులు



## ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం

పర్యాటక, సాంస్కృతిక శాఖ-తెలంగాణ ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

వరంగల్ ● శనివారం 21 డిసెంబరు 2024

# ఆయుషి అదరహో

ఫైనల్లో యువ భారత్



- శ్రీలంకపై గెలుపు
- బంగ్లాతో తుదిపోరు రేపు

అండర్-19 ఆసియా కప్

సింగపూర్: టోర్నీలో అప్రతిహత విజయాలతో జోరు కొనసాగిస్తున్న భారత జట్టు అండర్-19 మహిళల టీ20 ఆసియా కప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. టీనేజ్ లెఫ్టామ్ స్పిన్నర్ ఆయుషి శుక్లా (4/10) తిప్పేసిన వేళ చివరి సూపర్-4 మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్లతో శ్రీలంకను చిత్తు చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో..తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 98/9 స్కోరే చేసింది. కెప్టెన్ మనుది ననయకర (33), సముదు నిసంసల (21) మాత్రమే రాణించారు. మరో స్పిన్నర్ పరునిక సిసోడియా 2 వికెట్లు పడగొట్టింది. స్వల్ప ఛేదనను భారత్ 14.5 ఓవర్లలో 102/6 స్కోరుతో ముగించింది. త్రిష (32), కమలిని (28) సత్తా చాటారు. ఆయుషి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఆదివారం జరిగే టైటిల్ పోరులో బంగ్లాదేశ్‌తో మన అమ్మాయిలు అమీతుమీ తేల్చుకోనున్నారు.

**స్పిన్‌కు విలవిల:** టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్



చేసిన శ్రీలంక..ఆయుషి, పరునిక స్పిన్ బౌలింగ్‌కు ఉక్కిరిబిక్కిరి అయ్యింది. ఇద్దరు బ్యాటర్లే రెండంకెల స్కోరు చేశారు. శ్రీలంక ఓపెనర్లు సంజన (9), హస్నిక (2) కేవలం 12 బంతులే ఆడగలిగారు. ననయకర, నిసంసల ఐదో వికెట్‌కు చేసిన 22 పరుగులే లంక జట్టులో అత్యధిక భాగస్వామ్యం కావడం గమనార్హం. వీరిద్దరి చలువతో లంక మెరుగైన స్కోరుకు చేస్తుందనిపించింది. కానీ నిసంసల రనౌటవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది.

**సంక్షిప్త స్కోర్లు**

**శ్రీలంక:** 20 ఓవర్లలో 98/9 (మనుది 33, నిసంసల 21, ఆయుషి శుక్లా 4/10, పరునిక 2/27).
**భారత్:** 14.5 ఓవర్లలో 102/6 (త్రిష 32, కమలిని 28, మిథిల నాటౌట్ 17, ప్రబోధ 3/16, షషిణి 2/18).

**త్రిష మళ్లీ..:** స్వల్ప ఛేదనలో భారత్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ ఈశ్వరి (0) మూడో బంతికే రనౌటైంది. సనిక (4) కూడా విఫలమవడంతో భారత్ 5/2తో ఇక్కట్లలో పడింది. అయితే బంగ్లాతో గతమ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో అదరగొట్టిన తెలుగు బ్యాటర్ త్రిష, మరో ఓపెనర్ కమలినితో కలిసి పరిస్థితి చక్కదిద్దింది. ఈ జోడీ రెండో వికెట్‌కు 63రన్స్ జోడించడంతో భారత్ సులువుగా లక్ష్యాన్ని చేరింది. మరో సూపర్-4 పోరులో బంగ్లాదేశ్ 9 వికెట్లతో నేపాల్‌ను ఓడించింది. వర్షం వల్ల మ్యాచ్‌ను 11ఓవర్లకు కుదించారు. తొలుత నేపాల్ 11 ఓవర్లలో 54/8 స్కోరు చేసింది. అనంతరం బంగ్లా9.5 ఓవర్లలో 58/1 స్కోరు చేసి గెలిచింది.

## అర్జున్‌కు వీసా కష్టాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగు గ్రాండ్ మాస్టర్ ఇరిగేసి అర్జున్ వీసా సమస్యలు ఎదుర్కొంటున్నాడు. న్యూయార్క్‌లో వారం రోజుల్లో ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. అయితే, తనకు ఇప్పటి వరకు వీసా రాలేదని అర్జున్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. గతవారం యూఎస్ ఎంబసీలో తన పాస్‌పోర్టును స్టాంపింగ్ కోసం ఇవ్వగా, ఇంతవరకు తిరిగి ఇవ్వలేదని ఆ పోస్ట్‌లో పేర్కొన్నాడు. పోటీలకు సమయం సమీపిస్తున్నందున తన వీసా సమస్యను సత్వరమే పరిష్కరించాలని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, క్రీడాశాఖ మంత్రి మాండవీయలను అర్జున్ కోరాడు. ఈనెల 26 నుంచి జరిగే ఈ మెగా టోర్నీలో వరల్డ్ నెంబర్‌వన్ కార్ల్‌సన్‌తో పాటు, కరువానా, నెపోమ్నియాచి లాంటి టాప్‌స్టార్లతో అర్జున్ తలపడనున్నాడు.

### 12న బీసీసీఐ కార్యదర్శి ఎన్నిక

ముంబై: బీసీసీఐ ప్రత్యేక సాధారణ సమావేశం (ఎస్‌జీఎం) వచ్చేనెల 12న ఇక్కడ జరగనుంది. ఈ సమావేశంలో..బీసీసీఐ కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఎన్నిక నిర్వహించనున్నారు. ఈమేరకు అన్ని రాష్ట్ర సంఘాలకు నోటిఫికేషన్ పంపినట్టు బీసీసీఐ అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించారు. కార్యదర్శి జై షా ఐసీసీ చీఫ్‌గా, కోశాధికారి ఆషిష్ షెలార్ మహారాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఆ రెండు పదవులు ఖాళీ అయిన సంగతి తెలిసిందే.

## జాతీయ ఆర్చరీ విజేత ధీరజ్



జంషెడ్‌పూర్: తెలుగు కుర్రాడు ధీరజ్ బొమ్మదేవర సీనియర్ జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. శుక్రవారం ఇక్కడ జరిగిన పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో విజయవాడకు చెందిన ధీరజ్ 6-2తో దివ్యాంశ్ చౌదరి (హరియాణా)ను ఓడించి జాతీయ టైటిల్ నెగ్గాడు. మహిళల రికర్వ్ విభాగంలో వెటరన్ స్టార్ దీపికా కుమారి (జార్ఖండ్) 6-2తో అంకిత (కోల్‌కతా)పై గెలిచి జాతీయ చాంపియన్‌గా అవతరించింది.

## ముకేష్‌కు స్వర్ణం.. సందేశ్‌కు రజతం



ముకేష్



సందేశ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు షూటర్లు నేలవల్లి ముకేష్, సందేశ్ రెడ్డి పతకాలు కొల్లగొట్టారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 25 మీటర్ల పిస్టల్ జూనియర్ విభాగంలో గుంటూరు షూటర్ ముకేష్ 588 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణంతో మెరిశాడు. ఇదే వేదికగా జరిగిన పారా షూటింగ్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో హైదరాబాద్ షూటర్ సందేశ్ రెడ్డి 336 పాయింట్లు స్కోరు చేసి రజతం దక్కించుకున్నాడు.

## జహీర్..ఈ బాలిక బౌలింగ్ చూశావా?

వీడియో పోస్ట్ చేసిన సచిన్



ముంబై: రాజస్థాన్‌కు చెందిన సుశీల మీనా బౌలింగ్‌కు దిగ్గజ బ్యాటర్ సచిన్ ఫిదా అయ్యాడు. 12 ఏళ్ల ఈ ఏడమ చేతి బౌలర్..అచ్చు భారత జట్టు మాజీ పేసర్ జహీర్‌ఖాన్‌లా బౌలింగ్ చేస్తోంది. ఆ బాలిక బౌలింగ్ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసిన టెండూల్కర్ 'చూసేందుకు ఎంతో మనోహరంగా ఉంది ఆమె బౌలింగ్. సుశీల మీనా బౌలింగ్‌ను చూస్తే జహీర్‌ఖాన్ గుర్తొస్తున్నాడు. జహీర్..ఈ వీడియో నువ్వు కూడా తిలకించావా?' అని రాశాడు.

## టైటాన్స్‌ను గెలిపించిన పవన్

పుణె: కెప్టెన్ పవన్ సెహ్రావత్ చెలరేగడంతో తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 48-36తో పుణెరి పల్టన్‌పై గెలిచింది. టైటాన్స్ సారథి పవన్ సెహ్రావత్ 15 పాయింట్లు సాధించి, జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. చివరి మ్యాచ్‌లో గెలిచిన టైటాన్స్‌కు ప్లేఆఫ్స్ బెర్త్ ఇంకా ఖరారు కాలేదు. మిగతా మ్యాచ్‌ల గెలుపోటములపై టైటాన్స్ ప్లేఆఫ్స్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఇక, మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 31-28తో బెంగాల్ వారియర్స్‌పై నెగ్గి ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది.

## మెల్‌బోర్న్‌లో నీతో ఉంటా..

కోహ్లీతో అశ్విన్



చెన్నై: క్రికెటర్లుగా అశ్విన్, కోహ్లీలది 14 ఏళ్ల అనుబంధం. అందుకే నేమో రెండురోజుల కిందట అశ్విన్ హఠాత్తుగా ఆటకు వీడ్కోలు చెప్పడంతో విరాట్ ఎంతో ఉద్వేగానికి లోనయ్యాడు. 'నీతో ఆడిన సంవత్సరాలు నేను ఎంతో ఆస్వాదించా' అని ఆ సందర్భంగా కోహ్లీ ఎక్స్‌లో పేర్కొన్నాడు. ఇక..రిటైర్మెంట్ నిర్ణయం ప్రకటించిన వెంటనే అశ్విన్ స్వస్థలం చెన్నై వచ్చేసిన సంగతి తెలిసిందే. తాజాగా..శుక్రవారం విరాట్ స్పందనకు అశ్విన్ బదులిస్తూ 'మెల్‌బోర్న్‌లో నీతో ఉంటా' అని ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. అయితే ఈనెల 26 నుంచి జరిగే బాక్సింగ్ డే టెస్ట్‌కు వ్యాఖ్యాతగా అశ్విన్ అక్కడకు వెళ్లనున్నాడా.. అనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తంజేశారు. మరికొందరేమో.. 2022 టీ20 వరల్డ్ కప్‌లో మెల్‌బోర్న్‌లో పాకిస్థాన్‌పై భారత జట్టు సాధించిన అద్భుత విజయాన్ని తాజా పోస్ట్‌లో అశ్విన్ గుర్తు చేశాడంటున్నారు. ఆ మ్యాచ్‌లో 160 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ చివరి బంతికి 2 పరుగులు చేయాల్సిన దశలో అశ్విన్ క్రీజ్‌లోకి వచ్చాడు. ఆ బంతిని పాక్ స్పిన్నర్ నవాజ్ వైడ్‌గా వేశాడు. తదుపరి బంతిని తెలివిగా ఫీల్డర్ మధ్యలోకి కొట్టిన అశ్విన్ మరో పరుగు తీయడంతో భారత్ గెలుపు ఖాయమైంది. ఆ మ్యాచ్‌లో కోహ్లీ (82 నాటౌట్) అర్ధసెంచరీతో సత్తా చాటాడు.

## టీనేజర్ కొన్‌స్టాస్‌కు చోటు

భారత్‌తో చివరి రెండు టెస్టులకు ఆసీస్ జట్టు



మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్‌తో జరిగే చివరి రెండు టెస్టులకు ఆస్ట్రేలియా జట్టును ప్రకటించారు. 15 మందితో కూడిన ఈ జాబితాలో 19 ఏళ్ల టీనేజ్ సంచలనం సామ్ కొన్‌స్టాస్‌కు చోటు దక్కింది. దీంతో 71 ఏళ్ల తర్వాత ఆసీస్ టెస్టు జట్టులో బెర్త్ దక్కించుకున్న అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. 1953లో ఇయాన్ క్రెగ్ 17 ఏళ్ల వయస్సులో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడాడు. ఒకవేళ బాక్సింగ్ డే టెస్టులో ఓపెనర్‌గా అరంగేట్రం చేస్తే.. కమిన్స్ (2011లో 18 ఏళ్ల వయస్సులో) తర్వాత ఈ ఫీట్ సాధించిన ఆటగాడిగా నిలుస్తాడు. భారత్ 'ఎ'పై సామ్ అజేయంగా 73 రన్స్ చేయడంతో పాటు, పీఎం ఎలెవన్ జట్టు తరపున సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఇక తొలి రెండు టెస్టుల్లో విఫలమైన ఓపెనర్ మెక్‌స్వీనేపై వేటు పడింది. గాయపడిన పేసర్ హాజెల్‌వుడ్ స్థానంలో జే రిచర్డ్‌సన్ జట్టులోకి వచ్చాడు. కమిన్స్‌కు డిప్యూటీలుగా స్మిత్, హెడ్ వ్యవహరిస్తారు.

**ఆస్ట్రేలియా జట్టు:** కమిన్స్ (కెప్టెన్), హెడ్, ఖవాజా, స్మిత్, లబుషేన్, క్యారీ, ఎబాట్, బోలాండ్, ఇన్‌గ్లిస్, కొన్‌స్టాస్, లియోన్, మార్ష్, రిచర్డ్‌సన్, స్టార్క్, వెబ్‌స్టర్.



భారత టెస్టు జట్టు తొలిసారిగా ఆస్ట్రేలియాలో 1947/48లో పర్యటించింది. లాలా అమర్‌నాథ్ కెప్టెన్సీలో బరిలోకి దిగిన నాటి భారత జట్టు ఫొటోను శుక్రవారం మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లోని లైబ్రరీలో ప్రదర్శించారు.

## పాక్‌దే సిరీస్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ 81 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో ఇప్పటికే తొలి మ్యాచ్‌ను నెగ్గి పాక్.. మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే దక్కించుకుంది. గురువారం రాత్రి జరిగిన ఈ పోరులో ముందుగా పాక్ 49.5 ఓవర్లలో 329 రన్స్‌కు ఆలౌటైంది. రిజ్వాన్ (80), బాబర్ (73), గులామ్ (63) అర్ధసెంచరీలు సాధించారు. ఎంపాకకు నాలుగు, జాన్సెన్‌కు మూడు వికెట్లు లభించాయి. భారీ ఛేదనలో సఫారీలు 43.1 ఓవర్లలో 248 పరుగులకే కుప్పకూలారు. క్లాసెన్ (97) తృటిలో శతకం కోల్పోయాడు. షహీన్‌షాకు నాలుగు, నసీమ్ షాకు మూడు వికెట్లు దక్కాయి.

**విజయ్ హజారే వన్డే టోర్నీలో నేడు**
హైదరాబాద్ X నాగాలాండ్
ఆంధ్ర X రైల్వేస్

## తనకు తానే శత్రువు

- జట్టులో అతడున్నా లేనట్టే..
- పృథ్వీ షాపై ఎంసీఏ



ముంబై: యువ క్రికెటర్ పృథ్వీ షా ప్రస్తుతం కెరీర్‌లో అత్యంత గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో విఫలమవడంతో హజారే ట్రోఫీకి అతడిని ముంబై క్రికెట్ సంఘం (ఎంసీఏ) పక్కనబెట్టింది. ఇక ఐపీఎల్ వేలంలో అతడిని ఏ జట్టూ కొనుగోలు చేయలేదు. అయితే దీనంతటికీ పృథ్వీ స్వయంకృతాపరాధమే అని ఎంసీఏ తేల్చింది. 'పృథ్వీషాకు ఎవరూ శత్రువులు లేరు. తనకు తానే శత్రువు. ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై జట్టులో అతను ఉన్నా కూడా 10 మందితోనే ఆడామనుకోవాలి. ఎందుకంటే షా మైదానంలో ఉన్నా లేనట్టే. అతడి దగ్గరికి బంతి వచ్చినా కూడా అతికష్టంగా దాన్ని అందుకోవడం కనిపించింది. బ్యాటింగ్ సమయంలోనూ బంతిని ఆడేందుకు ఇబ్బందిపడ్డాడు. ప్రాక్టీస్ సెషన్లకు డుమ్మా కొట్టేవాడు. రాత్రుళ్లు బయట తిరిగి ఉదయం 6 గంటలకు హోటల్ చేరేవాడు. సీనియర్లు కూడా అతడి ప్రవర్తన నచ్చక ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే సెలెక్టర్లు ప్రభావితం చెందుతారనుకోవడం తప్పు' అని ఎంసీఏ అధికారి ఒకరు ఘాటుగా స్పందించాడు. హజారే ట్రోఫీకి ఎంపికవకపోవడంతో పృథ్వీ.. 'ఎన్ని పరుగులు చేసినా, సెలెక్టర్లకు నమ్మకం కలుగలేదా?' అని ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రశ్నించడం తెలిసిందే.

## బిజినెస్

# రూ.18.43 లక్షల కోట్లు హుష్ కాకి

## మార్కెట్‌పై బిగిసిన బేర్ పట్టు.. 5 సెషన్లలో 4,100 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: మార్కెట్లలో అమెరికన్ ఫెడ్ సృష్టించిన కల్లోలం ఆగలేదు. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన ప్రతికూల సంకేతాల ప్రభావంతో వరుసగా ఐదో రోజు కూడా స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలు నమోదు చేశాయి. రిస్క్ తీసుకునేందుకు విముఖంగా ఉన్న ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలు సాగించారు. దీనికి తోడు ఎఫ్‌పీఐల నిధుల తరలింపు సైతం యథేచ్ఛగా కొనసాగింది. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 1,176.46 పాయింట్లు దిగజారి 78,041.59 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 1343.46 పాయింట్ల నష్టంతో 77,874.59 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. నిఫ్టీ 364.20 పాయింట్ల నష్టంతో 23,587.50 వద్ద క్లోజైంది. రెండేళ్ల కాల పరిమితిలో ఒక వారంలో ఈక్విటీ మార్కెట్‌కు ఏర్పడిన భారీ నష్టం ఇదే. బీఎస్ఈలో లిస్టయిన షేర్లలో 2,950 షేర్లు నష్టాల్లో ముగియగా 1,045 షేర్లు మాత్రం లాభపడ్డాయి. ఐదు రోజుల వరుస నష్టాల కారణంగా సెన్సెక్స్ 4,091.53 పాయింట్లు నష్టపోగా నిఫ్టీ 1,181 పాయింట్లు నష్టపోయింది. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ సంపద రూ. 18,43,121.27 కోట్లు తుడిచి పెట్టుకుపోయి రూ.4,40,99,217.32 కోట్లకు (5.18 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

- సెన్సెక్స్‌లోని 30 షేర్లలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నెస్లె, టైటాన్ విన‌హా మిగతా 27 షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.43 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 2.11 శాతం నష్టపోయాయి.
- అన్ని రంగాల వారీ సూచీలు కూడా నష్టాల్లోనే ముగిశాయి. రియల్టీ ఇండెక్స్ భారీగా 4.07 శాతం నష్టపోయింది. పవర్ (3.55%), యంత్రపరికరాలు (3.02%), ఇండస్ట్రియల్స్ (2.67%), ఐటీ (2.51%), కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ (2.32%), సర్వీసెస్ (2.29%) నష్టపోయాయి.
- ఫెడ్ చీఫ్ వడ్డీ రేట్లపై ప్రకటించిన కఠిన వైఖరితో పాటు అమెరికా అధ్యక్షుడుగా పగ్గాలు చేపట్టబోతున్న డొనాల్డ్ ట్రంప్ తాను అనుసరించనున్న ఆర్థిక, వాణిజ్య విధానాలపై ప్రకటించిన అభిప్రాయాల ఫలితంగా డాలర్ నిరంతరం బలపడుతూ రావడం కూడా మార్కెట్‌ను కుంగదీస్తోందని విశ్లేషకులంటున్నారు. దీంతో విదేశీ ఇన్వెస్టర్లు స్థానిక మార్కెట్ నుంచి వైదొలగి డాలర్ ఆస్తుల్లో తమ సొమ్ము ఇన్వెస్ట్ చేస్తున్నారు. స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం విదేశీ ఇన్వెస్టర్లు గురువారం రూ.4224.92 కోట్ల విలువ గల షేర్లు విక్రయించారు.



### తగ్గిన ఫారెక్స్ నిల్వలు

డిసెంబరు 13వ తేదీతో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలు 198.8 కోట్ల డాలర్ల మేరకు తగ్గి 65,286.9 కోట్ల డాలర్ల వద్ద స్థిరపడ్డాయి. రూపాయి ఆటుపోట్లను తగ్గించేందుకు ఆర్‌బీఐ మార్కెట్‌లో జోక్యం చేసుకుంటుండడంతో గత కొద్ది వారాలుగా విదేశీ మారక నిల్వలు తగ్గుతూ వస్తున్నాయి. సెప్టెంబరులో ఇవి చారిత్రక గరిష్ఠ స్థాయి 70,488.5 కోట్ల డాలర్లకు చేరాయి. బంగారం నిల్వలు 112.1 కోట్ల డాలర్ల మేరకు పెరిగి 6805.6 కోట్ల డాలర్లకు చేరాయి.

### స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ రూ.40 కోట్ల సేకరణ

పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తున్న హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్.. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ విధానంలో అమన్సా ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ నుంచి రూ.40 కోట్లు ప్రీ ఐపీఓ ఫండింగ్‌గా సమీకరించింది. ఒక్కో షేరు రూ.140 ధరపై అమన్సాకు 28.57 లక్షల ఈక్విటీ షేర్లు జారీ చేసింది. ఫార్మా, కెమికల్ పరిశ్రమలకు స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ పరికరాలు తయారుచేసే స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ ఐపీఓకి అక్టోబరులో సెబీ అనుమతి లభించింది.

### గ్రాన్యూల్స్ ఇండియాలో ఫిడెలిటీ వాటా విక్రయం

గ్రాన్యూల్స్ ఇండియాలో ఫైనాన్షియల్ సేవల సంస్థ ఫిడెలిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ 1.32 శాతం వాటాను రూ.191 కోట్లకు విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ వాటాలను విక్రయించింది. తన అనుబంధ విభాగాలైన ఫిడెలిటీ ఇండియా ఫండ్, డెన్‌డాన ఇన్వెస్ట్ మారిషస్, ఫిడెలిటీ ఫండ్స్- ఇండియా ఫోకస్ ఫండ్.. గ్రాన్యూల్స్ ఇండియాలో 1.32 శాతానికి సమానమైన 32 లక్షల షేర్లను విక్రయించాయి. సగటున ఒక్కో షేరును రూ.596కి ఈ సంస్థలు విక్రయించాయి.

### హైదరాబాద్‌లో వాన్‌గార్డ్ టెక్నాలజీ కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ వాన్‌గార్డ్.. భారత్‌లో తొలి టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. వచ్చే ఏడాది చివరి నాటికి ఈ సెంటర్ అందుబాటులోకి వస్తుందని తెలిపింది. అయితే ఈ కేంద్రానికి సంబంధించిన పెట్టుబడులు, ఎంతమంది ఉద్యోగులను నియమించుకుంటుందనే విషయాలను మాత్రం వాన్‌గార్డ్ వెల్లడించలేదు. వాన్‌గార్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డివిజన్ అధికారిగా ఉన్న వెంకటేష్ నటరాజన్ మాత్రం హైదరాబాద్ కేంద్రం అధిపతిగా వ్యవహరించనున్నారని కంపెనీ తెలిపింది. 1975లో కార్యకలాపాలు ప్రారంభించిన వాన్‌గార్డ్ ప్రపంచవ్యాప్తంగా 5 కోట్లకు పైగా క్లయింట్లకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్, సలహా సేవలు అందిస్తోంది.

### ఎంటార్ టెక్‌కు రూ.226 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): క్లీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ విభాగాల్లో రూ.226 కోట్ల విలువైన ఆర్డర్లను అందుకున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఎంటార్ టెక్నాలజీస్ వెల్లడించింది. క్లీన్ ఎనర్జీ విభాగంలో బ్లూమ్ ఎనర్జీ నుంచి రూ.191 కోట్ల విలువైన ఆర్డర్లను దక్కించుకోగా రఫేల్, ఐఎంఐ సిస్టమ్స్, ఐఏఐ సహా ఏరోస్పేస్ రంగంలోని పేరొందిన కంపెనీల నుంచి రూ.35 కోట్ల విలువైన ఆర్డర్లను అందుకున్నట్లు తెలిపింది. ఏడాది కాలంలో ఈ ఆర్డర్లను పూర్తి చేయాల్సి ఉంటుంది.

### గూగుల్‌లో మరిన్ని ఉద్యోగాల కోత

న్యూయార్క్: అమెరికా టెక్ కంపెనీల్లో కొలువుల కోత కొనసాగుతోంది. అంతర్జాతీయ సెర్చ్ ఇంజన్ దిగ్గజం 'గూగుల్' తన ఉన్నతోద్యోగుల్లో 10% మందిని ఇంటికి పంపిస్తోంది. వీరంతా మేనేజర్లు, డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ల స్థాయిలో ఉన్న ఉన్నతోద్యోగులని సమాచారం. గూగుల్ కంపెనీ ఉద్యోగాల్లో కోత పెట్టడం ఈ సంవత్సరం ఇది మూడోసారి. ఈ ఏడాది జనవరి, జూన్‌లోనూ కంపెనీ చాలామందిని తొలగించింది. ఓపెన్ ఏఐ నుంచి ఎదురవుతున్న పోటీని దృష్టిలో ఉంచుకుని గూగుల్ ఈ చర్య తీసుకున్నట్టు భావిస్తున్నారు.


- దక్షిణాదిలో రిలయన్స్ రిటైల్ తన ఫ్యాషన్ బ్రాండ్ 'యూస్టా' కార్యకలాపాలను శరవేగంగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని నాగోల్‌లో కొత్త స్టోర్‌ను ప్రారంభించింది. రానున్న రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని స్టోర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. కంపెనీ ఇప్పటికే మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్‌లలో పలు స్టోర్లను నిర్వహిస్తోంది.
- కోటక్ మహీంద్రా బ్యాంక్.. కోటక్ బిజ్‌ల్యాబ్స్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. అప్పుడే ప్రారంభించిన స్టార్టప్స్ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు తోడ్పాటునందించటంతో పాటు వ్యాపారాలను నిలకడగా విస్తరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడనుంది. ఇందుకోసం కోటక్ మహీంద్రా బ్యాంక్.. ఐఐఎంఏ వెంచర్స్, టీ-హబ్ వంటి ఇంక్యుబేటర్స్‌తో జట్టు కట్టింది.

### వాక్‌మేట్ ప్రచారకర్తగా సంజు శ్యాంసన్



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): పాదరక్షల తయారీ సంస్థ వాక్‌మేట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్.. అంతర్జాతీయ క్రికెటర్ సంజు శ్యాంసన్‌ను ప్రచారకర్తగా నియమించుకుంది. ఒకప్పుడు దేశీయ కంపెనీగా ఉన్న వాక్‌మేట్ ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లోకి తన కార్యకలాపాలను విస్తరించిందని సంస్థ డైరెక్టర్ రోషన్ బాస్టియన్ వెల్లడించారు. సంజు శ్యాంసన్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకోవటంతో వాక్‌మేట్ వినియోగదారులకు మరింత చేరువ కానుందని ఆయన పేర్కొన్నారు. పాదాలకు స్వాంతన చేకూర్చే విధంగా కంపెనీ ఎర్గోనామిక్ ఇన్సోల్ టెక్నాలజీతో కూడిన పాదరక్షలను తీసుకువచ్చిందని రోషన్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అనువైన పాదరక్షలను తీసుకురావటంలో వాక్‌మేట్ కీలకంగా ఉందన్నారు.

### బజాజ్ చేతక్ ఈ-స్కూటర్ కొత్త వెర్షన్




న్యూఢిల్లీ: చేతక్ బ్రాండ్ విద్యుత్ స్కూటర్‌లో "35 సిరీస్"ను బజాజ్ ఆటో శుక్రవారం విడుదల చేసింది. ఇది మూడు వేరియెంట్లలో అందుబాటులో ఉంటుంది. వీటిలో 3501, 3502 వేరియెంట్ల ధర (బెంగళూరు ఎక్స్‌షోరూమ్) రూ.1.27 లక్షలు, 1.20 లక్షలు ఉంటుంది. మూడో వెర్షన్ 350 వేరియెంట్ ధర తదుపరి ప్రకటించనున్నట్టు కంపెనీ వెల్లడించింది. వీటిలో 3501 డెలివరీ డిసెంబరు చివరిలోను, 3502 డెలివరీ జనవరిలోను ప్రారంభమవుతుందని తెలిపింది.

### హోండా కార్ల ధర పెంపు

న్యూఢిల్లీ: కంపెనీకి చెందిన వివిధ కార్ల ధరలు 2 శాతం వరకు పెంచనున్నట్టు హోండా కార్స్ ఇండియా ప్రకటించింది. జనవరి నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. పెరిగిన ముడి సరుకు ధరల ప్రభావం తగ్గించుకునేందుకు ధరల పెంపు తప్పలేదని పేర్కొంది. ఈ కంపెనీ అమేజ్, సిటీ, ఎలివేట్ కార్లను మార్కెట్లో విక్రయిస్తోంది.

### భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో మారుతి ఎలక్ట్రిక్ విటారా ఆవిష్కరణ



న్యూఢిల్లీ: కంపెనీకి చెందిన తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈ-విటారాను ప్రవేశపెట్టడంతో పాటు సమాంతరంగా చార్జింగ్ స్టేషన్లు, హోమ్ చార్జింగ్ సొల్యూషన్లు అందుబాటులోకి తెస్తామని దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ప్రకటించింది. త్వరలో ఢిల్లీలో జరగబోయే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని ఆవిష్కరించనున్నట్టు కంపెనీ తెలిపింది. ఇది ప్రపంచ మార్కెట్ల కోసం భారత్‌లో తయారైన గ్లోబల్ మోడల్ అని పేర్కొంది. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహించాలంటే కస్టమర్లకు బ్యాటరీ విద్యుత్ వాహన యాజమాన్యాన్ని సరళం చేయాలన్నది తమ అభిప్రాయమని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ చెప్పారు. సరైన చార్జింగ్ మౌలిక వసతులు లేకపోవడమే ఈవీ వినియోగానికి పెద్ద అవరోధమని ఆయన అన్నారు. అధిక శాతం కస్టమర్లకు ఈవీలు అందుబాటులో, సౌకర్యవంతంగా ఉండేలా చూడాలన్నది తమ ఆలోచన అని చెప్పారు.

### ఎస్ఎంఈల లిస్టింగ్ మరింత కఠినం

న్యూఢిల్లీ: చిన్న, మధ్య తరహా కంపెనీల (ఎస్ఎంఈ) షేర్ల లిస్టింగ్‌ను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) మరింత కఠినం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వచ్చే ఎస్ఎంఈ కంపెనీ తన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించే నాటికి తప్పనిసరిగా గత మూడేళ్లలో వరుసగా రెండేళ్ల పాటు కనీసం రూ.కోటి స్థూల లాభాలు ఆర్జిస్తూ ఉండాలి. అలాగే ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ప్రమోటర్లు, లేదా ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు విక్రయించే షేర్లు.. మొత్తం ఇష్యూలో 20 శాతం మించకూడదు. వీటికి తోడు ప్రమోటర్లు లేదా వారి గ్రూప్ కంపెనీలు లేదా వారికి సంబంధించిన సంస్థల రుణాలు చెల్లించేందుకు జారీ చేసే ఎస్ఎంఈల ఐపీఓలను అనుమతించరు. సెబీ ఈ ప్రతిపాదనలకు సూత్రప్రాయ ఆమోద ముద్ర వేసిన మరుసటి రోజే ఎన్ఎస్ఈ, వాటి అమలుకు చర్యలు తీసుకోవడం విశేషం. ఈ నెల 19 నుంచే ఈ కొత్త లిస్టింగ్ నిబంధనలు అమల్లోకి వచ్చినట్టు ఎన్ఎస్ఈ తెలిపింది. రిటైల్ మదుపరుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకున్నట్టు ఎన్ఎస్ఈ తెలిపింది.

- ఇంటర్నేషనల్ జెమ్మాలాజికల్ ఇన్‌స్టిట్యూట్ షేర్లు లిస్టింగ్ రోజున 13% లాభపడ్డాయి. శుక్రవారం ఇష్యూ ధర రూ.417పై బీఎస్ఈలో 21% లాభంతో రూ.504.85 వద్ద లిస్టింగైన ఈ షేరు ఇంట్రాడేలో రూ.525 స్థాయిని తాకి చివరకు 12.74% లాభంతో రూ.470.15వద్ద ముగిసింది.

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 77,400 ▲ | 70,400 ▲ | 98,000 ▼ |
| విజయవాడ | 78,000 ▼ | 71,500 ▼ | 90,000 ▼ |
| విశాఖపట్నం | 75,940 ▼ | 69,610 ▼ | 86,770 ▼ |
| రాజమండ్రి | 76,800 ▼ | 70,400 ▼ | 88,200 ▼ |
| ప్రొద్దుటూరు | 78,150 ▼ | 72,410 ▼ | 88,800 ▲ |
| ముంబై | 75,377 ▼ | 69,045 ▼ | 85,133 ▼ |

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

| 21వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 570 | విజయవాడ | 600 |
| వరంగల్ | 572 | గోదావరి | 600 |
| చిత్తూరు | 603 | విశాఖపట్నం | 600 |
| | | డజను గుడ్లు రూ. 84 | |

**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 91 | విజయవాడ | 99 |
| వరంగల్ | 91 | గుంటూరు | 102 |
| కరీంనగర్ | 91 | ఒంగోలు | 102 |
| మహబూబ్‌నగర్ | 91 | చిత్తూరు | 85 |
| కర్నూలు | 91 | నెల్లూరు | 85 |
| విశాఖపట్నం | 108 | అనంతపురం | 85 |
| గోదావరి | 99 | | |

www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 21-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 263 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్


## పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్ వెనక్కి

నీటి కేటాయింపులపైనే ప్రధాన అభ్యంతరం

కేంద్ర జలవనరుల సంఘం సంచలన నిర్ణయం

బ్రిజేష్ ట్రిబ్యునల్ 'కృష్ణా'లో వాటాను తేల్చేదాకా

ఆ 45 టీఎంసీలపై ఎవరికీ హక్కు లేదని వెల్లడి

కాళేశ్వరం అదనపు టీఎంసీ, వార్ధా డీపీఆర్‌లూ వెనక్కి

ఈ నిర్ణయంతో తుమ్మిడిహెట్టికి మార్గం సుగమం!



8

## తండ్రీకొడుకులు

# నేరగాళ్లు



### కేసీఆర్, కేటీఆర్‌ను శిక్షించాలంటే దేశ చట్టాలన్నీ చదవాలి

ధరణితో వేలాది ఎకరాలు బదిలీ చేశారు

రైతుల భూముల సమాచారాన్ని విదేశీయుల చేతుల్లో పెట్టారు.. నేరగాళ్లకు అమ్ముకున్నారు

కిషన్‌రెడ్డి ఊర్లో భూదాన్ భూములకూ పట్టా

ధరణి అంతా కేటీఆర్ మిత్రుడు శ్రీధర్‌రాజుకే

లొసుగులు తెలిశాయనే సభ నుంచి పరారీ

ఫార్ములా-ఈ స్కాం 600 కోట్లు.. త్వరలో చెప్తా

సభలో అరవకుంటే హరీశ్‌కు ఇంట్లో దెబ్బలు

అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

**'ఫార్ములా-ఈ'పై అసెంబ్లీలో రగడ**

చర్చ జరగాల్సిందేనని పట్టుబట్టిన విపక్షం

స్పీకర్ వైపుగా కాగితాలు, పుస్తకాలు విసిరివేత

విపక్షం దిశగా చెప్పు చూపిన ఎమ్మెల్యే శంకర్

చూసుకుందాం అంటూ సవాళ్లు, ప్రతిసవాళ్లు

రెండుసార్లు సభ వాయిదా.. బీఆర్ఎస్ వాకౌట్

గందరగోళం మధ్యే భూ భారతి బిల్లు ఆమోదం

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత కేసీఆర్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది ప్రజల భూ సమస్యలు తీర్చడం కోసం కాదని, వేలాది ఎకరాలను కబ్జా చేసేందుకని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ధరణి పేరుతో కేసీఆర్, కేటీఆర్ రాష్ట్రంలోని రైతుల సమాచారాన్నంతా విదేశీయులకు అమ్ముకున్నారని తెలిపారు. ఒడిసా ప్రభుత్వంలో క్రిమినల్ కేసులు నమోదై, జైలు జీవితం గడిపిన ఆర్థిక నేరగాళ్లకు ధరణి బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. దీంతో ఎవరి భూమినైనా ఎవరి పేరుపైనైనా బదలాయించే అధికారం వారికి లభించిందని అన్నారు. ఇందులో కేటీఆర్ మిత్రుడు గాదె శ్రీధర్‌రాజుదే కీలకపాత్ర అని చెప్పారు. తండ్రీకొడుకులు నేరగాళ్లని, వారు చేసిన నేరాలకు శిక్షించాలంటే.. దేశంలో ఉన్న చట్టాలన్నీ అధ్యయనం చేయాలని అన్నారు. శుక్రవారం శాసనసభలో భూ భారతి బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత ధరణి గురించి ముఖ్యమంత్రి సుదీర్ఘంగా మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ల పాత్ర గురించి వివరించారు. "తన మేధస్సునంతా రంగరించి ఎంతో శ్రమించి ధరణిని ప్రవేశపెట్టానని 80 వేల పుస్తకాలు చదివిన మేధావి, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అనేవారు. ఆయన మాటలు, ఆత్మవిశ్వాసం చూసి ఎంపీగా ఉన్నప్పుడు నాక్కూడా నిజమేనేమో అనిపించింది. భూ సమస్యలను పరిష్కరించేందుకు కొత్త విధానం ఉపకరిస్తుందేమో అనిపించింది. అధికారంలోకి వచ్చాక ధరణిని అధ్యయనం చేస్తుంటే అసలు లోగుట్టంతా బయటపడింది" అని రేవంత్ అన్నారు. ధరణి పోర్టల్ కేసీఆర్ సొంతంగా

మిగతా 11వ పేజీలో...

## కాపలా కుక్కలు కాదు.. వేటకుక్కలు!

గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆస్తులను యథేచ్ఛగా కొల్లగొట్టారు

ధరణితోపాటు ఆర్థిక అవకతవకలపై ఆడిట్

భూ భారతి చట్టం.. ప్రజల నిజమైన చుట్టం

విస్తృత చర్చలతో తెచ్చాం: మంత్రి పొంగులేటి

రైతు భరోసాపై నేడు శాసనసభలో చర్చ

పథకంపై సీఎం ప్రకటన: మంత్రి కోమటిరెడ్డి

**శాసనమండలిలో వాయిదాల పర్వం**

కేటీఆర్‌పై కేసు ఎత్తేయాలని బీఆర్ఎస్ పట్టు

వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వ తీరుపై ధ్వజం

11

## 30 వరకు కేటీఆర్‌ను

# అరెస్ట్ చేయొద్దు

ఫార్ములా-ఈ రేసు కేసులో హైకోర్టు ఆదేశం

క్వాష్ పిటిషన్‌పై విచారణ 27కు వాయిదా

జరగని ఒప్పందానికి ముందే చెల్లింపులా?

గవర్నర్ అనుమతి, దర్యాప్తు తర్వాతే ఎఫ్ఐఆర్

కేటీఆర్ పాత్ర ఏంటన్నది దర్యాప్తులో తెలుతుంది

విదేశీ సంస్థకు చెల్లింపుల్లో తీవ్రమైన ఉల్లంఘనలు

రేస్‌లో లాభాలొస్తే స్పాన్సర్ వెళ్లిపోతారా..?: ఏజీ

రాజకీయ, వ్యక్తిగత కుట్రతోనే కేటీఆర్‌పై కేసు

హైదరాబాద్ ఖ్యాతిని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు

ఫార్ములా-ఈ రేస్‌తో రూ.110 కోట్ల లాభం

14 నెలల కిందటి అంశంపై ఇప్పుడు కేసా?

రేస్ రద్దవకుండా నాటి సర్కారే ముందుకొచ్చింది

అరెస్ట్ సహా తదుపరి ప్రొసీడింగ్స్‌పై స్టే ఇవ్వండి

కేటీఆర్ తరఫున సుప్రీం న్యాయవాది సుందరం



హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో ఏ1గా ఉన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. కేటీఆర్‌ను ఈ నెల 30 వరకు అరెస్ట్ చేయరాదంది. కేసును యథావిధిగా దర్యాప్తు చేసుకోవచ్చంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కౌంటర్ దాఖలు చేయాలంటూ ఏసీబీకి, మునిసిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిశోర్‌కు నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 27కు

మిగతా 10వ పేజీలో...



## అప్పుల నుంచి దృష్టి మళ్లించేందుకే!

ఫార్ములా ఈ-కార్ రేసుపై కేసు అందుకే

సీఎం రేవంత్.. సర్కస్ నడుపుతున్నట్లుంది

రూపాయి కూడా దొరకని కేసు ఏసీబీనా?

ఓఆర్ఆర్ టెండర్ నిధులు.. రుణమాఫీకిచ్చాం

గోల్‌మాల్ అనిపిస్తే రద్దు చేయండి: కేటీఆర్

10

## కేటీఆర్‌పై ఈడీ కేసు

ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈసీఐఆర్.. కేటీఆర్ ఏ1

ఒకట్రెండు రోజుల్లో నోటీసు

కోర్టులో క్వాష్ పిటిషన్!

**నేడో రేపో ఏసీబీ విచారణ!**

కేటీఆర్‌కు నోటీసులు?

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

## కేజ్రీవాల్ కదనోత్సాహం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ గురించి కేంద్ర ఎన్నికల సంఘం సమావేశమవుతున్నదనీ, ఎన్నికల షెడ్యూల్ నిర్ణయించుకోవడం కూడా వెనువెంటనే జరుగుతుందని వార్తలు వస్తున్నాయి. ఎలాగూ ఫిబ్రవరిలోగా ఎన్నికలు జరుగుతాయి కనుక, పార్టీలన్నీ ఎంతో ముందుగానే యుద్ధం మొదలెట్టాయి. ఢిల్లీ పీఠాన్ని ఈ మారైనా వశం చేసుకోవాలని పట్టుదలతో ఉన్న భారతీయ జనతాపార్టీ 17మంది సీనియర్ నాయకులతో ఎన్నికల కమిటీని ప్రకటించింది. పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడి నేతృత్వంలో, ఢిల్లీ నుంచి ఎన్నికైన ఏడుగురు బీజేపీ ఎంపీలతోపాటు కొందరు పార్టీ పెద్దలు కూడా ఈ జాబితాలో ఉన్నారు. డెబ్బైస్థానాలున్న అసెంబ్లీకి పార్టీ తరఫు నుంచి పోటీపడబోతున్న అభ్యర్థుల జాబితాలకు అధిష్ఠానం మెరుగులు దిద్దుతోందని, ఈ ఏడాది చివరివారంలో అవి వెలుగుచూస్తాయని అంటున్నారు. రెండు పర్యాయాలు ఢిల్లీని గెలుచుకొని, ముచ్చటగా మూడోమారు అధికారంలో కొనసాగడానికి ప్రయత్నిస్తున్న ఆమ్ ఆద్మీపార్టీ నాలుగురోజుల క్రితం నాలుగో జాబితాతో అభ్యర్థుల పేర్లన్నీ ఖరారు చేసిన విషయం తెలిసిందే. అరవింద్ కేజ్రీవాల్ ఎవరిని నిలబెట్టినా, ప్రజలు ఈ మారు తమనే అధికారంలో కూచోబెడతారని బీజేపీ నమ్మకం. ఆఖరు నిముషంలో అభ్యర్థుల పేర్లుమార్చే కుట్రకు కేజ్రీవాల్ పాల్పడవచ్చునన్న అనుమానం కూడా ఉన్నందున అభ్యర్థుల ఖరారు విషయంలో బీజేపీ కాస్తంత జాగ్రత్త పడుతోంది.


అభ్యర్థుల జాబితాల విడుదలలో ఆప్ మాంచి దూకుడుగా వ్యవహరించింది. అయితే, ఈ నాలుగువిడతల జాబితాల్లో పదహారుమంది సిట్టింగులకు సీట్లు పోయాయి. పదకొండుమందితో కూడిన తొలిజాబితాలోనే ముగ్గురు బీజేపీ నుంచి, మరో ముగ్గురు కాంగ్రెస్ నుంచి వచ్చినవారున్నారు. రెండో జాబితాలో చాలా కొత్తమొఖాలు చేరాయి. ఒకపక్క, బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి నాలుగురోజుల క్రితం వచ్చినవారిని కూడా జాబితాల్లో చేర్చేస్తూ మరోపక్క తమది ఉన్నతమైన, భిన్నమైన పార్టీ అని కేజ్రీవాల్ ఎలా చెప్పుకోగలరని విమర్శకుల ప్రశ్న. డెబ్బయ్‌మందిలో ఓ పదిమంది బయటనుంచి వచ్చినవారు ఉన్నంతమాత్రాన విలువలు కోల్పోయినట్టేనా అని ఆప్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. అన్నా హజారే ఉద్యమంనుంచి పుట్టినందువల్ల కాబోలు, కేజ్రీవాల్ పార్టీకి అప్పట్లో ఏవో విలువలుండేవనీ, ఇప్పుడవి తరిగిపోతున్నాయని కొందరికి బాధ. ఆప్ ఈ మారు తీవ్ర గందరగోళంలో ఉన్నదన్న విమర్శలు అటుంచితే, ఈ మారు అధికారం అంత సులభం కాదన్న అనుమానం దానికి బాగా ఉన్నట్టు కనిపిస్తోంది.

ఆర్నెల్ల క్రితం ఒక్కటిగా కనిపించిన ఇండియాబ్లాక్ ఇప్పుడంత సంఘటితంగా లేదన్న విషయం తెలిసిందే. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్ వేరుపడటమే కాక, పరస్పరం కలయబడుతున్నాయి. కేజ్రీవాల్ పోటీచేస్తున్న న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానంనుంచి షీలాదీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్‌ను కాంగ్రెస్ పార్టీ నిలబెడుతోంది. కాంగ్రెస్‌తో పొత్తులేదని కేజ్రీవాల్ తేల్చేయడంతో ఆ పార్టీ మీద ఆప్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. గత పదేళ్ళు ఎవరి సాయం అక్కరలేకుండా, సొంతబలంతో చక్కగా రెండు విడతలు పాలించుకున్నాక, ఈ మారు మాత్రం పొత్తులెందుకని కేజ్రీవాల్ అనుకొని ఉంటారు. పైగా, ఆర్నెల్లనాటి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకున్నందువల్ల ఆప్‌కు దక్కిన ప్రయోజనమేమీ లేకపోయింది. దేశ రాజధానిలో ఉన్న ఏడు లోక్‌సభ స్థానాలనూ యాభైఐదుశాతం ఓట్లతో బీజేపీ ఎగరేసుకుపోయింది. ఈ నేపథ్యంలో ఈ మారు కాంగ్రెస్‌తో చెలిమి తనకు అపకారమే తప్ప ఉపకారం కాదని ఆప్ అనుకొని ఉంటుంది. పైగా, బీజేపీ మతరాజకీయాలపట్ల మెతకగా ఉంటున్న ఆప్‌కు కాంగ్రెస్‌తో ప్రత్యక్ష పొత్తు కొన్ని స్థానాల్లో నష్టం చేయవచ్చు. హిందూ ఓటర్ల మనసు గెలుచుకొనే రీతిలో ఆప్ అతిజాగ్రత్తగా వ్యవహరిస్తూ కష్టపడి కూడబెట్టుకున్న ఓటు బ్యాంకును కాంగ్రెస్‌తో పొత్తు కారణంగా బీజేపీకి కోల్పోయే ప్రమాదం ఉన్నది. పైగా, ఆప్–కాంగ్రెస్ మధ్య ఎప్పుడూ దూరమే తప్ప సయోధ్య అరుదు. ఢిల్లీలో తనకు ఇంకాబలం ఉన్నదని నమ్ముతున్న కాంగ్రెస్ కూడా పొత్తులేకపోవడమే మంచిదని అనుకుంటోంది. సార్వత్రిక ఎన్నికల్లో అద్భుతాలు చేసి, అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలబడుతున్న చరిత్రగల బీజేపీ మాత్రం ఈ మారు లిక్కర్ కేసు, కేజ్రీవాల్ అరెస్టు ఇత్యాది పరిణామాలతో ఆప్ పూర్తిగా ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిందనీ, ఢిల్లీని వశం చేసుకోవడం ఖాయమని నమ్ముతోంది.

## చెరకు రాయితీలకు మంగళం!

రైతాంగ ప్రయోజనాలను హరించే విధంగా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించకపోవటం; విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెంచటం; ఎరువుల ధరల నిర్ణయ అధికారం ఆ కంపెనీలకే ఇవ్వటం; పోషకాలను బట్టి ఎరువుల సబ్సిడీ ఇవ్వటం; ధాన్య సేకరణ నుంచి ఎఫ్‌సీఐని తప్పించటం; వ్యవసాయ రంగంలోకి బహుళజాతి సంస్థలకు అవకాశం కల్పించటం; ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో భూముల సర్వే చేయించి కార్పొరేట్లకు భూములు కట్టబెట్టటం; రైతుల మోటార్లకు కరెంట్ మీటర్లు బిగించమని రాష్ట్రాలకు చెప్పటం లాంటి చర్యలు ఇప్పటికే అమలు చేసింది. తాజాగా చెరకు రైతులకు ప్రయోజనంగా ఉన్నవాటిని కూడా ఉపసంహరిస్తూ ఆర్డర్ జారీ చేసింది.

మోదీ ప్రభుత్వంలోని వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖ 1966 షుగర్ (నియంత్రణ) ఆర్డర్, 2018 నాటి చక్కెర నియంత్రణ ఆర్డర్‌ను కలిపి... ది షుగర్ (నియంత్రణ) ఆర్డర్–2024 ముసాయిదాను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఉత్పత్తి ప్రక్రియలో సాంకేతిక పురోగతి, పరిశ్రమలో మార్పులను పేర్కొంటూ ఈ ముసాయిదా విడుదల చేసినట్లు చెప్పింది. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందటానికి పంచదార రికవరీ రేటు 8.5శాతం నుంచి 10శాతానికి కొత్త ముసాయిదాలో పెంచింది. భారతదేశంలో రికవరీ రేట్ రీడింగ్‌ను సక్రమంగా తెలిపే మిషన్లు లేని కారణంతో పాటు, రికవరీని పెంచే నాణ్యమైన విత్తనం అందకపోవటం వల్ల కొత్త ముసాయిదాలో పేర్కొన్న 10శాతం రికవరీ రేటు రాని పరిస్థితుల్లో రైతులు మద్దతు ధర పొందలేరు. దేశంలో పంచదార రికవరీ 9శాతం మించి ఎప్పుడు రాలేదు. 2024 నవంబర్ మొదటి వారంలో 8.82శాతం మాత్రమే ఉంది. బ్రెజిల్ లాంటి కొన్ని దేశాల్లో మాత్రమే 11 నుంచి 14శాతం పైగా పంచదార రికవరీ వస్తుంది.



చక్కెర మిల్లులు బ్యాంకుల్లో తనఖా పెట్టిన పంచదార అమ్ముకోవటానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరని కొత్త ముసాయిదాలో పేర్కొన్నారు. ఫలితంగా చెరకు కొనుగోలు చేసిన 14 రోజులలోపు మిల్లులు డబ్బులు చెల్లించాలన్న నిబంధన నిరుపయోగమైంది. రైతులకు డబ్బులు ఎప్పుడు చెల్లించాలన్న అధికారం మిల్లులకు దక్కింది. చెరకు విక్రయ డబ్బులు పొందటానికి మిల్లర్ల దయపై రైతులు ఆధారపడాల్సి వస్తుంది.

దేశంలో లక్షలాది రైతు కుటుంబాలకు జీవనోపాధిగా ఉండి, ఎందరికో ఉపాధి కల్పిస్తూ, పెద్ద మొత్తంలో విదేశీ మారకద్రవ్యాన్ని దేశానికి అందిస్తున్న చెరకు రైతాంగం ఎడల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చెరకు సేద్యం నేడు తీవ్ర సంక్షోభంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధర చెరకు రైతులకు ఏ మాత్రం మేలు చేయలేదు. ఎకరాకు అన్ని రకాల సేద్యపు ఖర్చు లక్ష దాకా ఉంది. కౌలు రైతుకు అదనంగా మరో 20 వేలు ఖర్చవుతుంది. దిగుబడి ఎకరాకు 30 టన్నులు. ప్రభుత్వ చెప్పే క్వింటాల్ చెరకు ఉత్పత్తి ఖర్చు 157 రూపాయలు. వాస్తవ ఖర్చు 305 రూపాయలు. కేంద్రం ప్రకటించిన క్వింటాల్ మద్దతు ధర 350 రూపాయలు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వాస్తవ ఖర్చుపై 50శాతం పెంచితే రూ.450 ప్రకటించాలి. 10శాతం పంచదార రికవరీ వచ్చే చెరకుకి మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుంది. అంతకన్నా తక్కువ రికవరీ వస్తే తగ్గిన దాని ప్రకారం మద్దతు ధరలో కోత పడుతుంది.

మద్దతు ధర ప్రకారం 30 క్వింటాళ్లు వచ్చిన రైతుకు లక్షా ఐదు వేల ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం సొంత భూమి రైతులకు ఖర్చులకు సరిపోవటం లేదా నామమాత్రపు మిగులు ఉంటుంది. కౌలు రైతులకు పెట్టుబడి కూడా రాదు. టన్ను చెరకు ద్వారా 280 కిలోల పంచదార లభిస్తుంది. కేజీ రూ. 30 చొప్పున 8,680 రూపాయలు వస్తుంది. మద్దతు ధర ప్రకారం టన్ను చెరకు ద్వారా రైతుకు లభించేది 3,500 రూపాయలు. మిల్లు యజమానులకు మిగులుతున్నది 5,180 రూపాయలు. ఎకరం చెరకు పైన మిల్లు యజమాని 1,60,580 రూపాయలు మిగులు పొందుతాడు. ఫ్యాక్టరీ ఖర్చుల కింద 50 వేలు తీసేసినా, లక్షకు పైగా మిగులుతుంది. చెరకు సేద్యం నష్టదాయకంగా మారటంతో ఆ రైతుల్లో విముఖత ఏర్పడి, లక్షలాది ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది. ఫలితంగా 2022లో పంచదార ఉత్పత్తి 328.7 లక్షల టన్నులు ఉండగా, 2023 నాటికి 311 లక్షల టన్నులకు తగ్గింది. సేద్యాన్ని నష్టదాయకంగా మార్చి, రైతాంగం సాగు నుండి తప్పుకునేలా చేసి, చెరకు సాగును కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి, పంచదారను విదేశాల నుంచి మోదీ ప్రభుత్వం దిగుమతి చేసుకోనున్నది. ఇప్పటికే మూడు లక్షల టన్నుల చక్కెర దేశంలోకి దిగుమతి అయ్యింది.

ఈ విధానాలకు వ్యతిరేకంగా యావన్మంది చెరకు రైతులు ఉద్యమించాలి. కొత్త షుగర్ (నియంత్రణ) ఆర్డర్ ముసాయిదాను ఉపసంహరించాలని, టన్ను చెరకుకు 4,775 రూపాయల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేయాలి.

● **బొల్లిముంత సాంబశివరావు**
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రైతు కూలీ సంఘం (ఆం.ప్ర)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

# రాజ్యాంగ స్ఫూర్తికి అవరోధమెవరు?

ఒక జాతి జీవనంలో 75 ఏళ్ల రాజ్యాంగ బద్ధ ప్రస్థానం పూర్తవడం నిస్సందేహంగా చరిత్రాత్మకమైన సంఘటన. కనుకనే నవంబర్ 26, 2024న, భారత రాజ్యాంగ 75వ వార్షికోత్సవాన్ని మనం ఘనంగా నిర్వహించుకున్నాం. పార్లమెంటు ఉభయ సభలూ దైనందిన వ్యవహారాలను పక్కన పెట్టి రెండేసి రోజులు చొప్పున భారత రాజ్యాంగ ప్రస్థానంలో వెలుగునీడలను ప్రత్యేకంగా చర్చించాయి. ఉభయ సభలలోను పలువురు సభ్యులు ఉదాత్త ప్రసంగాలు చేశారు; కొంతమంది విమర్శలు, దూషణలతో మాట్లాడారు. రాజ్యాంగ సభలో ఆగస్టు 14–15, 1947 అర్ధరాత్రి జవహర్ లాల్ నెహ్రూ వెలువరించిన 'భవిష్యత్తుతో భేటీ', నవంబర్ 25, 1949న బాబాసాహెబ్ అంబేడ్కర్ వెలువరించిన 'ప్రజల చేత ప్రభుత్వం'ను పోలిన స్ఫూర్తిదాయక ప్రసంగాలను ఈ చర్చలో ఎవరూ చేయలేదు.



■ **పి. చిదంబరం**

**'పళని' పలుకు**

75 సంవత్సరాల క్రితం రాజ్యాంగ సభలో జరిగిన చర్చలు, సమాలోచనల వెనుక భారత జాతీయ కాంగ్రెస్ ప్రధాన ప్రేరణ శక్తిగా ఉన్నది. జాతి భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలనే విషయమై విశాల దృక్పథం, దూరదృష్టితో ప్రతిపాదనలు చేసి, వాటిపై భిన్నాభిప్రాయాలు కలవారు అందరూ చర్చలో పాల్గొనేలా ప్రేరేపించి అంతిమంగా ఏకాభిప్రాయ సాధనతో నిర్ణయాలు తీసుకుని రాజ్యాంగ రూపకల్పనలో కాంగ్రెస్ చరిత్రాత్మక కీలక పాత్ర వహించింది. రాజ్యాంగ సభకు కాంగ్రెస్ 'ఒక క్రమ విధానాన్ని, క్రమశిక్షణను తీసుకువచ్చింది' అని డాక్టర్ అంబేడ్కర్ ప్రశంసించారు. మరి ఈనాడు కాంగ్రెస్ పరిస్థితి ఏమిటి? లోక్‌సభలోను, రాజ్యసభలోను ప్రతిపక్షంగా ఉన్నది. ఎంత మార్పు! ఈ మార్పు బాధాకరమైనది, అయితే వెనక్కు మళ్లించలేనిది ఎంత మాత్రం కాదు.

కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయ శక్తులు అయిన భారతీయ జనతా పార్టీ, ఇతర మితవాద పక్షాలు భారత రాజ్యాంగంతో కాంగ్రెస్ సంబంధాన్ని పూర్తిగా ఒక ప్రతికూల దృక్పథంతో చూస్తున్నాయి. జూన్ 1975, మార్చి 1977 మధ్య అమలులో ఉన్న అత్యవసర పరిస్థితి, ఆ చీకటి రోజుల్లో దేశ పౌరులకు ప్రాథమిక హక్కులను నిరాకరించిన ఒక దురదృష్టకర చరిత్రకు మాత్రమే ఆ సంబంధాన్ని పరిమితం చేస్తున్నాయి. నిజమే, 139 ఏళ్ల భారత జాతీయ కాంగ్రెస్ చరిత్రలో అదొక అసహ్యకరమైన అధ్యాయం. నిస్సందేహంగా నిందార్హమైనది. అయితే ఆ దురదృష్టకర పరిణామాల విషయమై దేశ ప్రజలకు ఇందిరా గాంధీ మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పారు. అత్యవసర పరిస్థితిని విధించడం ఇంకెన్నడూ జరగబోదని వాగ్దానం చేశారు. ప్రజలు ఆమె క్షమాపణలను అంగీకరించారు. 1980లో అత్యధిక స్థానాలతో కాంగ్రెస్‌ను గెలిపించి ఆమెకు మళ్లీ అధికారాన్ని అప్పగించారు.

అత్యవసర పరిస్థితి విధింపు మినహా రాజ్యాంగంతో కాంగ్రెస్‌కు మరేమీ సంబంధం లేదా? రాజ్యాంగ నిర్మాణంలోనూ, దానిని అమలుపరచడంలోనూ కాంగ్రెస్ పార్టీ మహోదాత్త పాత్రను ఎలా విస్మరించగలం? బీజేపీ ఉపేక్షించినా చరిత్ర మరచిపోతుందా? రాజ్యాంగంతో కాంగ్రెస్ సహవాసం ఒక స్ఫూర్తిదాయక గాథ. అరుదుగా మాత్రమే దానిని గుర్తు చేసుకోవడం, చెప్పడం జరుగుతోంది. రాజ్యాంగానికి సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు అధికరణ 368 ద్వారా సమకూరింది. ఏ దేశ రాజ్యాంగానికి అయినా తప్పనిసరిగా ఉండే అధికారమిది. ఎందుకంటే ఏ జాతి జీవనమూ నిల్వ నీరుగా ఉండదు. సుఖదుఃఖాలతో జాతి ప్రస్థానం సాగుతుంటుంది. ఈ సాగుతున్న యాత్రలో అపాయాలు ఎదురవుతాయి, అవకాశాలూ లభిస్తాయి. అధికార వ్యవస్థలో ప్రధాన భాగమైన న్యాయవ్యవస్థ మారుతున్న పరిస్థితులు, సందర్భాలకు అనుగుణంగా రాజ్యాంగ నిబంధనలకు వివరణలు ఇస్తుంది, భాష్యాలు చెబుతుంది. ఈ న్యాయ వివరణలు, భాష్యాలు తుది మాటగా ఉండవు, ఉండబోవు. కాలానికి అనుగుణంగా ఉండే రాజ్యాంగమే సజీవమైన సంవిధానం. మారుతున్న జాతి జీవనానికి అనుకూలంగా ఆ మౌలిక శాసనాన్ని మార్చుకోవల్సి ఉంటుంది. కాలానుగుణ మార్పులకు అనుగుణంగా ప్రతిస్పందించగలగడమనేది ఒక సరైన రాజ్యాంగానికి తార్కాణం. మరింత స్పష్టంగా చెప్పాలంటే రాజ్యాంగం సదా సమకాలీనంగా ఉండాలి. మన రాజ్యాంగం అటువంటి విశిష్ట సంవిధానం. పార్లమెంటులో రాజ్యాంగంపై జరిగిన చర్చలో నేనూ పాల్గొని ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజ్యాంగానికి తీసుకువచ్చిన సవరణల గురించి విపులంగా తప్పక ప్రస్తావించి ఉండేవాణ్ణి. ఎందుకంటే ఆ సవరణలు మన రాజ్యాంగాన్ని మరింతగా శక్తిమంతం చేశాయి. రాజ్యాంగ మున్నుడిలోని మహోదాత్త ఆదర్శాలు దేశ ప్రజల జీవితాలలో ప్రతిఫలించేందుకు ఆ సవరణలు విశేషంగా దోహదం చేశాయి. ముఖ్యంగా న్యాయం (సామాజిక, ఆర్థిక, రాజకీయ), సమానత్వం (అంతస్తు, అవకాశం) ప్రతి ఒక్కరికీ సమకూర్చడమే లక్ష్యంగా ఆ సవరణలు జరిగాయి.

రాజ్యాంగ (ప్రథమ సవరణ) చట్టం, 1951 స్వతంత్ర భారత దేశ మొట్టమొదటి ముఖ్య శాసనం. సామాజికంగా, విద్యా వ్యాసంగాలలో వెనుకబడిన వర్గాలవారు లేదా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల (దళితులు, గిరిజనులు) అభ్యున్నతికి ఉద్దేశించిన రిజర్వేషన్లకు ఆ చట్టం రాజ్యాంగ పరిరక్షణను కల్పించింది. ఆ ప్రథమ రాజ్యాంగ సవరణే లేని పక్షంలో అసలు ఎలాంటి రిజర్వేషన్ల వ్యవస్థనూ ఏర్పాటు చేయడం సాధ్యమయ్యేది కాదు. ఈ మొదటి సవరణ ద్వారా రాజ్యాంగంలో అధికరణ 31ఎ, అధికరణ 31బి ని చేర్చడం జరిగింది. తద్వారా దోపిడీ, అణచివేతలకు నెలవైన భూస్వామ్య జమిందారీ వ్యవస్థ రద్దుకు మార్గం సుగమమైంది. లక్షలాది రైతు, రైతు కూలీ కుటుంబాలు తమ దైన్య పరిస్థితుల నుంచి విముక్తమయ్యారు. భూసంస్కరణలకు, మిగులు భూముల పంపిణీకి కూడా రాజ్యాంగ మొదటి సవరణ విశేషంగా సహకరించింది. వ్యాపార వాణిజ్యాలు, పరిశ్రమలు, సేవల రంగాలలో ప్రభుత్వ రంగ సంస్థల వ్యవస్థాపనకు కూడా చట్టపరమైన పునాదులను ఈ మొదటి సవరణే నిర్మించింది.




**పార్లమెంటు ఉభయ సభల్లో రాజ్యాంగంపై చర్చ పాలక, ప్రతిపక్షాల పరస్పర ప్రత్యారోపణల మయంగా జరిగింది. భారత గణతంత్ర రాజ్య 75 సంవత్సరాల రాజ్యాంగబద్ధ ప్రస్థానంలో ఏకైక పథ భ్రష్టత (అత్యవసర పరిస్థితి విధింపు) కేంద్రంగా వాదోపవాదాలు సాగాయి. మరి బీజేపీ సంకల్పించిన ఒకే దేశం ఒకే ఎన్నిక సహా వివిధ మార్పులు ఆ ఏకైక పథ భ్రష్టత కంటే మన ప్రజాస్వామ్యానికి, సమాఖ్య పాలనా విధానానికి మరింత ఎక్కువగా హానిచేసేవే కావూ?**

రాజ్యాంగ (42వ సవరణ) చట్టం–1976 రాజ్యాంగంలో అనేక మార్పులు చేసింది. అందుకే ఆ మార్పులను, వాటికి కారణమైన కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించడం జరుగుతోంది. అయితే అదే చట్టం ద్వారా రాజ్యాంగంలో జరిగిన రెండు మార్పులను భావి తరాలు తప్పక గుర్తుంచుకుంటాయనే వాస్తవాన్ని చాలా తక్కువమంది మాత్రమే ప్రస్తావిస్తున్నారు. వాటిలో ఒకటి రాజ్యాంగంలో అధికరణ 39ఎ చేర్పు. ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం జరిగేందుకు ప్రభుత్వమే 'ఉచిత న్యాయ సహాయం'ను సమకూర్చాలని ఆ మార్పు నిర్దేశించింది. మరొక మార్పు అధికరణ 48ఎ చేర్పు. ప్రభుత్వమే 'పర్యావరణాన్ని పరిరక్షించి, మెరుగుపరచాలని, అడవులు, వన్య ప్రాణులను సంరక్షించాలని' ఈ కొత్త అధికరణ నిర్దేశించింది.

రాజ్యాంగ (52వ సవరణ) చట్టం–1985 రాజ్యాంగంలో 10వ షెడ్యూలును ప్రవేశపెట్టింది. దేశ రాజకీయాలకు చీడగా పరిణమించిన ఆయారామ్, గయారామ్ బెడద అంటే పార్టీ ఫిరాయింపుల సమస్యను తుదముట్టించేందుకు ఈ సవరణ చట్టం ప్రప్రథమంగా ప్రయత్నించింది. శోచనీయమైన విషయమేమిటంటే అది చట్ట సభలకు ఎన్నికైన సభ్యుల జిత్తులమారితనం, వారికి సభాపతుల (స్పీకర్ల) నుంచి రహస్య ప్రోత్సాహం, ఈ పరిణామాలపై న్యాయస్థానాల అయోమయ తీర్పులు ఇత్యాది వైపరీత్యాలను ఆ చట్ట నిర్మాతలు ఊహించలేకపోయారు. పదవ షెడ్యూలును సవరించిప్పుడే ఆ షెడ్యూలు లక్ష్యం నెరవేరుతుందని నిక్కచ్చిగా చెప్పక తప్పదు.

చాలా విస్తృత పర్యవసానాలకు దారితీసి, విశేష ప్రభావాన్ని చూపిన సవరణలు: రాజ్యాంగ (73వ సవరణ) చట్టం–1992, రాజ్యాంగ (74వ సవరణ) చట్టం–1992. ఇవి స్థానిక స్వపరిపాలనా సంస్థలు అయిన పంచాయత్‌లు, పురపాలక సంఘాలను రాజ్యాంగబద్ధ సంస్థలుగా చేయడం ద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని మరింత పటిష్ఠమూ, ప్రగాఢమూ చేశాయి. ఈ చట్టాల ఫలితంగా మహిళలు, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన లక్షలాది మందిని రాజకీయ ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చాయి. మహిళలు, దళితులు, ఆదివాసీలకు తమ ప్రజాస్వామ్య అధికారాలను వినియోగించే సాధికారతను అవి కల్పించాయి. పాలనాధికారాలను ఇంతగా క్రిందిస్థాయి పాలనా సంస్థలకు బదిలీ చేయడం, రాజకీయ అధికారాలు, అవకాశాలను విస్తృతంగా పునఃపంపిణీ చేయడం చరిత్రలో ఇంతకు ముందెన్నడూ జరగలేదు.

పార్లమెంటు ఉభయ సభల్లో రాజ్యాంగంపై చర్చ, దురదృష్టవశాత్తు పాలక, ప్రతిపక్షాల పరస్పర ప్రత్యారోపణల మయంగా జరిగింది. భారత గణతంత్ర రాజ్య 75 సంవత్సరాల రాజ్యాంగ బద్ధ ప్రస్థానంలో ఏకైక పథ భ్రష్టత (అత్యవసర పరిస్థితి విధింపు) కేంద్రంగా వాదోపవాదాలు సాగాయి. అవేవీ ఉదాత్తమైనవి కావు. మరి బీజేపీ సంకల్పించిన ఒకే దేశం ఒకే ఎన్నిక సహా వివిధ మార్పులు ఆ ఏకైక పథ భ్రష్టత కంటే మన ప్రజాస్వామ్యానికి, సమాఖ్య పాలనా విధానానికి మరింత ఎక్కువగా హానిచేసేవే కావూ? అయినప్పటికీ మన రాజ్యాంగం వెన్ను దృఢమైనదని, ఆ మహోన్నత సంవిధాన ప్రగతిశీల స్ఫూర్తి అంతిమంగా అజేయంగా వెలుగొందుతుందని నేను నిండుగా విశ్వసిస్తున్నాను.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

## పేదోళ్ళ ప్లీడర్ శంకరన్న

శ్రీకాకుళం నుండి సిరిసిల్ల దాకా తెలుగునేలపై వెల్లువెత్తిన విప్లవోద్యమాల్లోని ప్రజాస్వామికాంశాలను గుర్తించి సమర్థించిన వాళ్లలో జస్టిస్ కృష్ణయ్యర్ నుండి డిసెంబర్ 1, 2024న అసువులు బాసిన చల్లా శంకర్ వరకు ఎందరో న్యాయకోవిదులు ఉన్నారు. రాజ్యాంగ హక్కుల అమలుపైన ఉన్నత న్యాయస్థానాల్లో పోరాడుతూ పేరెన్నికగన్న ఎంతోమంది న్యాయవాదుల కన్నా, ఆ రాజ్యాంగ హక్కుల అమలు తీరును ప్రశ్నిస్తూ, అనునిత్యం రాజ్యం బెదిరింపులను తట్టుకుంటూ విచారణ కోర్టుల్లో పనిచేయడం కత్తి పైన సాము లాంటిదే. ఈ కృషిలో ఉద్యమ ప్రత్యక్ష కేంద్రమైన ఖమ్మం పట్టణంలో ఉంటూ ఒక పాత లూనాపై తిరుగుతూ ప్రజలపైన మోపిన అక్రమ కేసులను న్యాయపరంగా సవాల్ చేస్తూ, చివరకు తానే అక్రమ కేసులను ఎదుర్కొంటూ నిలబడాల్సి రావడం మామూలు విషయం కాదు. 1974లోనే తొలితరం పీడీఎస్‌యూ విద్యార్థిగా ప్రారంభమై, అత్యవసర పరిస్థితి నిర్బంధంలోనూ, తదనంతరం ప్రజాస్వామిక విప్లవ విజృంభణలోనూ, గోదావరి లోయ విప్లవోద్యమంతో పెనవేసుకుని జనశక్తి విప్లవ రాజకీయాల వకల్తాదారుగా, కోర్టుల్లో ప్రజా కార్యకర్తల న్యాయ సహాయకుడిగా పనిచేసిన కొద్దిమంది వ్యక్తుల్లో చల్లా శంకర్ ఒకరు. ప్రజా న్యాయవాదులుగా, ప్రజాస్వామిక హక్కుల కార్యకర్తలుగా పేరుగాంచిన బొజ్జతారకం, బాలగోపాల్, పొల్సాని విఠల్‌రావు, కన్నాబిరన్, పత్తిపాటి వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి లాంటి ఎందరో అమర న్యాయవాదులకు చల్లా శంకర్ ఏ మాత్రం తక్కువ కాదు.



చల్లా శంకర్ తండ్రి చల్లా వెంకటయ్య బట్టలు కుట్టి బతికే వృత్తి చేస్తూనే తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధుడు. తల్లి రాజమ్మ ఇల్లాలుగా ఐదుగురు పిల్లల్ని పెంచి, ఇంటికి వచ్చిన ఉద్యమకారులకు విసుగులేకుండా భోజనాలు పెట్టే ప్రేమాస్పదురాలు. 1969 ఏప్రిల్ 16న చంద్ర పుల్లారెడ్డి నాయకత్వాన సాగిన పగిడేరు ప్రతిఘటనతో ఖమ్మం జిల్లాలో పురుడుబోసుకున్న విప్లవోద్యమం శంకరన్నను పీడీఎస్‌యూ కార్యకర్తగా, హేతువాదిగా, ప్రజాన్యాయవాదిగా, హక్కుల కార్యకర్తగా తీర్చిదిద్దాయి. వారసత్వంగా వచ్చిన 70 గజాల ఇల్లును అటు న్యాయవాద వృత్తికి, ఇటు ప్రజా సంఘాల విప్లవ కార్యక్రమాలకు కేంద్రంగా మార్చినాడు. తను హక్కుల కార్యకర్తగా అడవి, ఊరు, పట్టణం అనే తేడా లేకుండా కలియతిరిగినాడు. న్యాయవాద విద్యనభ్యసించి తొలి అమరుడిగా ప్రసిద్ధిగాంచిన బత్తుల వెంకటేశ్వరరావును ఆదర్శంగా తీసుకున్నాడు. అమరుడు కొండన్న నుండి పగిడేరు లక్ష్మక్క దాకా ఎందరినో కలిశాడు. కొండపల్లి సీతారామయ్య, కూర రాజన్నల నుండి చిన్న రాజన్న దాకా ఎందరికో న్యాయ సేవలందించినాడు. ఈ కార్యకలాపాల్లో రూపుదిద్దుకున్న ఆయన వ్యక్తిత్వానికి కుటుంబం ద్వారా అందిన మానవతా పరిణామాలు అదనపు సొగసుగా ఉన్నాయి. కామ్రేడ్స్ రంగవల్లి, భరత్‌ల అమరత్వం తర్వాత పలు జాగ్రత్తలు తీసుకుని నేను ఒకసారి స్వయంగా ఆయన ఇంటికి పోవాల్సి వచ్చినా ఏ మాత్రం తొణికిసలాడ లేదు. ఈ ధైర్యం కూడా ఆయనను నిత్యం వెన్నంటి నడిపించి అతన్ని గోదావరిలోయ విప్లవోద్యమానికి దృఢమైన వకాల్తాదారుగా నిలబెట్టింది.

1978 అక్టోబర్ 20న సిరిసిల్ల, జగిత్యాల తాలూకాలు కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించిన తర్వాత, రైతాంగ ఉద్యమాలకు సంఘీభావం కూడగట్టే క్రమంలోనే 1983 వరకు, అంటే ఐదేళ్ల కాలంలో దళనుల సార్లు అరెస్టు కావడం, అనేక కేసులు, వారాల తరబడి చిత్రహింసలెదుర్కోవడం సర్వసాధారణాంశంగా ఉండేది. ఈ క్రమంలో 1977లో కన్నాబిరాన్ నాయకత్వాన నిమ్మపల్లికి నిజనిర్ధారణ బృందం తీసుకెళ్లడం, 1978 తర్వాత బాలగోపాల్, కోదండరాంలను ఆర్థికసామాజిక పరిశీలన కోసం సిరిసిల్ల గ్రామాల్లో జరిపిన, పరిశోధనలకు సహకరించడం, గున్నాల్ మిర్దాల్ పర్యటన, 1982లో ప్రారంభమైన ఎన్‌కౌంటర్ హత్యల నిర్ధారణలో జార్జి ఫెర్నాండెజ్ బృందం వెంట సాగడం లాంటివి నా అనుభవంలో ఉన్నాయి. గోదావరి లోయకు గుండెకాయ లాంటి ఖమ్మంలో అతని నిత్య కార్యాచరణ, అనుభవాలు ఏమిటో రికార్డు చేయవల్సి ఉండెను. అవి భవిష్యత్తు తరాలకు అందడం అవసరం. ఒక తరం అంతరిస్తున్న కాలంలో కామ్రేడ్ చల్లా శంకర్ స్మృతిలో ఒక పుస్తకం తీసుకురావాలని చొరవ చూపిన వారందరూ అభినందనీయులు. డిసెంబర్ 22న తలపెట్టిన "పేదోళ్ళ ప్లీడర్ శంకరన్న" స్మృతులు అజరామరం కావాలి, ఆయన సంస్మరణ సభ విజయవంతం కావాలి.

◆ **అమర్** (జనశక్తి)

*(డిసెంబర్ 22న ఖమ్మం పట్టణంలోని వేదిక ఫంక్షన్‌హాల్‌లో చల్లా శంకర్ సంస్మరణ సభ)*

## దేశభక్తే ఆయన ఆధ్యాత్మికత

త్యాగం చేయమని బోధించేముందు తాను త్యాగం చేసి ఎందరు చూపించగలరు? దైవభక్తి కంటే దేశ భక్తి గొప్పది అని ఒక సనాతన సంప్రదాయ కుటుంబంలో పుట్టి ఎందరు చెప్పగలరు? ఇవ్వడమే తప్ప ఆశించడం తెలియని ప్రకృతిలా జీవించాలని బోధించేవారే తప్ప జీవితంలో ఆచరించేవారెందరు? ఇటువంటి లక్షణాలున్న వ్యక్తి మన మధ్య జీవించారు. వారే 'హాల్ ఆఫ్ టైమ్స్' గ్రంథాలయాన్ని భీమిలిలో ఏర్పాటు చేసిన శివానందమూర్తి. కొందరు ఆయనలో ఆధ్యాత్మిక గురువును చూస్తే మరికొందరు గొప్ప దేశభక్తుణ్ణి చూసారు.

1928 డిసెంబర్ 21న రాజమండ్రిలో సర్వమంగళా దేవి, వీర బసవరాజు దంపతులకు జన్మించిన ఏకైక సంతానం శివానంద మూర్తి. ఉర్లాం సంస్థానానికి ఏకైక వారసులు, జమిందారీ పద్ధతిలో పెరిగినవారు. డిగ్రీ పూర్తి కాగానే తాను ఒంటరిగా లోకంలోకి వెళ్లి జీవించాలనుకుంటున్నానని ఆయన తల్లిదండ్రులకు చెప్పారు. జమీన్‌కి నువ్వే వారసుడివి, నువ్వెళ్ళిపోతే ఎలా అని తండ్రి అభ్యంతరం చెప్పినా, ఆస్తిలో నీకు హక్కు ఉండదని హెచ్చరించినా శివానందమూర్తి నిర్ణయంలో మార్పు రాలేదు. పోలీస్ డిపార్టుమెంటులో క్లర్క్‌గా ఉద్యోగం సంపాదించారు, వరంగల్ చేరారు. ఆ తరువాత పెద్దలకు నచ్చిన అమ్మాయినే పెండ్లి చేసుకొని చిన్న గదిలో కాపురం పెట్టారు. కార్మికులంతా ఉండే ఆ కాలనీ వీధి కొళాయి దగ్గర బకెట్లో నీళ్లు పట్టుకొని ఇంటికి మోసుకెళ్లే శివానందమూర్తిని చూసి ఈయనేనా ఉర్లాం జమీందార్ వారసులు అని చుట్టుపక్కలవారు ఆశ్చర్యపోయేవారు. కాలికి చెప్పులు లేకుండా దేశం మొత్తం పాదయాత్ర చేసినవారు శివానంద మూర్తి.



తనకున్న దానిలోనే పొరుగువారికి సహాయం చేయడం, వారి కష్టాల్లో పాలుపంచుకోవడం శివానంద మూర్తికి అలవాటు. హోమియో వైద్యంతో ఉచిత సేవలు అందించి అందరికీ స్వస్థత చేకూర్చేవారు. తెలిసిన జ్యోతిషవిద్యతో ముహూర్తాలు పెట్టేవారు. వారి సతీమణి గంగాదేవి ఎవరైనా ప్రసవం అయితే వారికి సపర్యలు చేసేవారు. అలా వరంగల్లులో వారున్న ప్రాంతంలోనే కాక దూరప్రాంతాలకు కూడా వారి సేవలు విస్తరించాయి. చివరకు సమీపంలోని గ్రామాల వారు తమ ఆవులు కనిపించకపోతే ఆయనను సంప్రదించేవారు, వారు చెప్పినట్టు చేస్తే అవి దొరికేవి. ఒక పక్క ఉద్యోగం చేస్తూ మరోపక్క సమాజసేవలో నిమగ్నమయ్యారు ఆయన. లుంగీ కట్టుకొని తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణం చేయడం దగ్గర్నుంచి బృందాలను హిమాలయాలకు, ఇతర చారిత్రక ప్రదేశాలకు తీసుకెళ్లి వాటి విశిష్టత వివరించడం వరకూ ఆయన కార్యాచరణ ఎందరికో దిశానిర్దేశం చేసింది.

శివానందమూర్తిలో బహుముఖ వ్యక్తిత్వాలను దర్శించినవారున్నారు. దైవభక్తులు ఆయనను సద్గురు అని సంబోధించారు. ఆయన మాత్రం దైవభక్తులకు ఎటువంటి పుణ్యం సంప్రాప్తమవుతుందో, దేశభక్తులకూ అటువంటి పుణ్యమే దొరుకుతుందని చెప్పేవారు. దేశ భక్తి లేని దైవభక్తి వ్యర్థమనీ, భారతదేశం బాగుంటే ప్రపంచం బాగుంటుందనేవారు. తమను ఆశ్రయించిన కుటుంబాలలో పిల్లలకు 'మీరు చదువుకోండి. విదేశాలకు వెళ్లారా వెళ్ళండి. సంపాదించండి, సుఖంగా ఉండండి. ఒక్కటే కండిషన్. ఏది చేసినా ధర్మం తప్పకండి. శక్తి ఉండగానే మీవంతు సేవలు దేశానికి అందించేందుకు సిద్ధంకండి' అని చెప్పేవారు. అంతే తప్ప మూఢభక్తిని ఎన్నడూ ప్రోత్సహించలేదు.


శివానందమూర్తి పుస్తక ప్రియులు. ఎక్కడకు వెళ్లినా పుస్తకాలు కొనకుండా, అక్కడి గ్రంథాలయాలను సందర్శించకుండా వచ్చేవారు కాదు. అలా ఎవరి దగ్గరా లేని అరుదైన గ్రంథాలను సేకరించారు. నిరంతరం చదవటమే. వారు చదివిన పుస్తకాలే పెద్ద గ్రంథాలయంగా ఏర్పాటైంది. భీమిలి ఆనందవనంలో ఎందరో పరిశోధకులకు ఆ గ్రంథాలయం ఉపయోగపడుతున్నది. వారు ఇంటర్మీడియట్ చదువుతున్నపుడు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ లెక్చరర్. వారిరువురిదీ వయోభేదం లేని స్నేహం. శివానందమూర్తి చదివింది బిఎస్‌సి మాత్రమే. కానీ సంగీతం, సాహిత్యం, ఖగోళం, వైద్యం, జ్యోతిషం, ఆంగ్లసాహిత్యం... ఇలా ఏ సబ్జెక్టు గురించి అయినా సమగ్రంగా మాట్లాడే వారు. శివానందమూర్తి అంతేవాసి (జర్మనీలో చదువుకున్న తమిళుడు) ప్రొఫెసర్ రాఘవేంద్రన్. ఆయనతో ఇంగ్లీష్ సాహిత్యం గురించి మాట్లాడుతుంటే ఒక మనిషికి ఇన్ని అంశాలలో పట్టు ఎలా సాధ్యం? అని ఆశ్చర్యచకితులయ్యేవారు. ఈ ప్రశ్నే వారితో 'శివానంద యోగం' అనే పుస్తకాన్ని ఆంగ్లంలో రాయించింది. శివానందమూర్తి ప్రసంగాలు గ్రంథాలుగా వెలువడుతున్నాయి. అందులో భారతీయత పేరుతో నాలుగు భాగాలు వచ్చాయి. మన దేశం గురించి చాల ప్రశ్నలకు సమాధానాలు ఆ ప్రసంగాలలో లభిస్తాయి. 2015 జూన్ 11న దేహత్యాగం చేసినా శివానందమూర్తి ఆరంభించిన సేవలు రెండు తెలుగు రాష్ట్రాలలోనూ కొనసాగుతూనే ఉన్నాయి.

○ **నట్టి శ్రీనివాసరావు**

## మరో విజయం 'మంత్రులతో ముఖాముఖి'!


ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలే అత్యంత కీలకమైనవి, పార్టీ విధివిధానాలు, వారి సమర్థత, పనితీరు వంటి వాటి ఆధారంగానే ప్రజలు వారిపై విశ్వాసం ఉంచుతారు, గెలిపించి ప్రజా ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుంటారు. ప్రభుత్వాల ఏర్పాటు అనంతరం సైతం క్షేత్రస్థాయిలో ప్రజావసరాలు, ఇబ్బందులు ఎప్పటికప్పుడు అధికార వ్యవస్థతో సమానంగా అధికార పార్టీ కార్యకర్తలు సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి, అప్పుడే ఆ ప్రభుత్వం ప్రజాపాలనను అందించగలుగుతుంది. ఈ దిశగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఓ విప్లవాత్మకమైన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది.

ఏకకాలంలో రూ. రెండు లక్షల రైతు రుణమాఫీ సహా, ఆరుగ్యారంటీల అమలుతో పాటు ఇచ్చిన ప్రతీ వాగ్దానాన్ని నెరవేర్చేదిశగా కృషి చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ. ఇదే సమయంలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి అధికార యంత్రాంగంతో పాటు పార్టీ శ్రేణులనూ రంగంలోకి దించింది. ప్రజాస్పందన, కష్టనష్టాలను తెలుసుకోవడానికి పార్టీ కేంద్ర కార్యాలయంలో వారానికి ఒకరోజు నిర్వహిస్తున్న 'మంత్రులతో ముఖాముఖి' ఓ వినూత్న కార్యక్రమం. కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటుందనే పేరు కాంగ్రెస్ పార్టీకి ఉంది. అట్టడుగు స్థాయి నుండి పార్టీలో పనిచేసి, పీసీసీ అధ్యక్షుడుగా పగ్గాలు చేపట్టిన మహేశ్ కుమార్ గౌడ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించే మంత్రులను పార్టీ ఆఫీసుకు పిలిపించి వారితో నేరుగా ఈ ముఖాముఖి ఏర్పాటు చేయించారు. పార్టీ కార్యకర్తలు, సామాన్య ప్రజలు మంత్రులను కలిసి తమ సమస్యలను విన్నవించుకొని వాటికి సత్వర పరిష్కారాలను పొందుతున్నారు.




ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండే ప్రభుత్వపరంగా గతంలో ఇనుప కంచెలతో లోపలికి పోవడానికే వీలులేని అధికార దర్పాన్ని కంచెలు బద్దలుగొట్టింది. అంతేకాకుండా ఏ స్థలమైతే సామాన్యులకు ప్రవేశం లేకుండా నిషేధింపబడిందో ఆ ప్రజాభవన్‌లోనే సామాన్యుల గోడు వినడానికి ప్రతీ మంగళవారం, శుక్రవారం ప్రజావాణి అనే కార్యక్రమం జరుగుతోంది. కాబినెట్ ర్యాంకుగల చిన్నారెడ్డికి ఈ బాధ్యతను అప్పజెప్పడమే కాకుండా ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారిని నియమించి ప్రజా విన్నపాలను సత్వరంగా పరిష్కరిస్తోంది. అదే ఒరవడిలో ప్రభుత్వ కార్యక్రమాలతో నిత్యం బిజీగా ఉండే మంత్రుల సమయాలను సామాన్య కార్యకర్తకు సైతం అందించాలనే సత్సంకల్పంతో ప్రతీ బుధవారం హైదరాబాద్ గాంధీభవన్ వేదికగా మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాలను నిర్వహిస్తుంది. తమ ప్రాంతం అభివృద్ధి కోసం ప్రభుత్వపరంగా, అటు తమ పార్టీ పటిష్ఠత కోసం కాంగ్రెస్ పక్షాన ఏం చేయాలి, ఏం కావాలి అనే విషయాలను అత్యున్నత శ్రేణి నేతలకు చెప్పుకొనే అవకాశం దీనిద్వారా కలుగుతోంది. మూడునెలలుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమాలు సామాన్య ప్రజలకు ఎంతో మేలు చేకూర్చాయి. మంత్రి దామోదర రాజనర్సింహతో మొదలైన ముఖాముఖి కార్యక్రమంలో ఇప్పటివరకూ మంత్రులందరూ హాజరై సమస్యలను సావధానంగా విన్నారు, వింటున్నారు. సత్వర పరిష్కారాలకై ఉన్నతాధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేస్తున్నారు. దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నారు. సరాసరిన ప్రతీ ముఖాముఖిలో రెండు వందల చొప్పున వందలాది అర్జీలను మంత్రులు ఇప్పటి వరకూ స్వీకరించారు. వీటిలో సింహభాగం పరిష్కారం పొందాయి. ప్రజల నుంచి వచ్చే ప్రతీ అర్జీని ఆన్‌లైన్ చేయడంతో పాటు పరిష్కారం కోసం వివిధ దశల్లో ఉన్నవాటిని ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగంతో ఫాలో అప్ చేసుకుంటూ ఫిర్యాదుదారులకు ప్రత్యేకంగా వాటి స్టేటస్‌ను సైతం కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం తెలియజేస్తున్నది. అర్జీదారులు మంత్రులను కలువడానికి సైతం నిర్దిష్ట విధానాలను అమలు చేస్తున్నది. ముందుగా సమూహాలుగా వచ్చిన అసోసియేషన్లు, యూనియన్లు, సంఘాలకు, తదనంతరం వ్యక్తిగతంగా వచ్చినవారికి అవకాశం కల్పిస్తున్నది. 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీని, నాయకత్వాన్ని అభినందించాలి. ఎక్కడెక్కడో దూర ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజల కోసం తమ విలువైన సమయాన్ని కేటాయించి, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న రేవంత్‌రెడ్డి మంత్రి వర్గాన్ని ప్రశంసించాలి.

■ **బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి**
సీఈవో, టి–సాట్ నెట్‌వర్క్



# 'భూభారతి'కి సర్వే సంకటం!



- ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా సర్వేయర్ల కొరత
- కొత్త రెవెన్యూ చట్టంలో వారే కీలకం
- 78 మందికి 40 మందే విధులు
- ఏడీ కార్యాలయాల్లోనూ అదే పరిస్థితి
- ఉండాల్సింది 83మంది.. ఉన్నది 44మంది
- అరకొరగానే డిప్యూటీ సర్వేయర్లు.. డిప్యూటేషన్‌పై కొందరు ఇతర ప్రాంతాలకు
- కార్యాలయాల్లో కుప్పలు తెప్పలుగా సర్వే దరఖాస్తులు

**రిజిస్ట్రేషన్‌కు ముందే భూమి లెక్కలు, వివరాలు నిర్ధారించాలని నిబంధన**

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ప్రభుత్వం రెవెన్యూశాఖలో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతికి సర్వేయర్ల కొరత సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ధరణిలో అనేక మార్పులు చేసి ప్రభుత్వం భూభారతిని అమల్లోకి తెస్తోంది. అయితే ఈ విధానంలో భూమి క్రయవిక్రయాలు జరిపే ముందు తప్పనిసరిగా భూసర్వే చేయాల్సి ఉంటుందని ప్రకటించింది. సర్వే పూర్తి చేస్తేనే రిజిస్ట్రేషన్ చేసేలా నిబంధనను తీసుకురాగా.. భూములను సర్వే చేసే సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు కార్యాలయాల్లోనూ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ కార్యాలయాల్లో కుప్పలు తెప్పలుగా భూసర్వే కోసం వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో మూలుగుతున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూభారతితో భూ క్రయవిక్రయాలకు సర్వేయర్ల కొరత మరింత సమస్యగా మారనుంది.

### కొత్త విధానానికి వారే కీలకం...

ప్రభుత్వం రెవెన్యూ చట్టంలో అనేక మార్పులు తీసుకొచ్చింది. ధరణి స్థానంలో భూభారతి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. అనేక మార్పుల్లో అత్యంత కీలకమైంది భూ క్రయవి క్రయాలకు ముందే సర్వే నిర్వహించటం. కొత్త రెవెన్యూ చట్టం ప్రకారం ప్రతీ భూమికి భూఆధార్ నెంబర్ ఇస్తున్నారు. దీంతో భూమి అమ్మే ముందు సదరు భూమిని సర్వే చేయించాలి. రికార్డు ప్రకారం భూఆధార్‌లో పేర్కొన్న విధంగా భూమి కొలతలు ఉన్నట్టు నిర్ధారిస్తూ సర్వేయర్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. దీని ఆధారంగానే సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేస్తారు. భూముల క్రయవిక్రయాల్లో అవకతవకలు లేకుండా, పారదర్శకంగా భూములు అమ్మకాలు, కొనుగోళ్ల సాగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అయితే ఈ వి ధానం బాగున్నా అమల్లోనే అసలు కష్టాలు మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయాలతో పాటు జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు కార్యాలయాల్లో కూడా సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు, ఇతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో భూభారతిలో భూ క్రయవిక్రయాలపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశాలున్నాయనే ఆందోళన కనిపిస్తోంది.

### సర్వేకు నిరీక్షించాల్సిందే...

భూములు సర్వేకు సర్వేయర్ల కొరతతో రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకొంది. మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తగా సర్వేయర్ల నియామకాలు చేపట్టలేదు. ప్రతీ మండల రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్లు, సీనియర్ సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు, చైన్‌మెన్లు, ఇన్‌స్పెక్టర్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉంది. గతంలో భూములను కొలిచేందుకు ప్రత్యేకంగా సర్వేయర్ల వ్యవస్థ ఉండేది. వారు పదవీవి రమణ తరువాత కొత్తగా ఎవరినీ తీసుకోలేదు. దీంతో అన్ని మండలాల్లో సర్వేయర్ల కొరత వేధిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 78మండలాలు ఉండగా, కేవలం 40మంది సర్వేయర్లు మాత్రమే ఉన్నారు. ప్రధానంగా ఏజెన్సీ జిల్లాల్లో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. భూపాలపల్లి జిల్లాలో మొత్తం 12మంది సర్వేయర్లు ఉండాల్సి ఉండగా, కేవలం ముగ్గురు మాత్రమే ఉండగా, ఐదుగురు డిప్యూటీ సర్వేయర్లు ఉన్నారు. ములుగు జిల్లాలో 9మంది సర్వేయర్లు ఉండాల్సి ఉండగా, కేవలం ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు డిప్యూటీలు ఉన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 18మంది సర్వేయర్లు ఉండాల్సి ఉండగా, కేవలం ఏడుగురు మాత్రమే పని చేస్తున్నారు. డిప్యూటీ సర్వేయర్లు కేవలం ముగ్గురే పని చేస్తున్నారు. హనుమకొండ జిల్లాలో ఇద్దరు సర్వేయర్లు అదనపు బాధ్యతలతో పొరుగు మండలాల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది. వరంగల్ జిల్లాలో ముగ్గురు సర్వేయర్ల కొరత ఉంది. 13మందికి గాను కేవలం ఇద్దరు డిప్యూటీ సర్వేయర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 676 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సర్వేయర్ల కొరతతో దరఖాస్తులతో రెవెన్యూ కార్యాలయాల చుట్టు బాధిత రైతులు చక్కర్లు కొడుతున్నారు. అత్యధికంగా ములుగు, జనగామ జిల్లాల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సర్వేయర్ల కొరతతో రైతులు సర్వే కోసం ఇబ్బందులు పడుతుంటే.. కొత్త చట్టం ప్రకారం క్రయవిక్రయాలు జరిగే ప్రతి భూమి ని కొలత వేయ్యాలనే నిబంధనతో రిజిస్ట్రేషన్ ఆలస్యమయ్యే అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది.

**ఏడీ కార్యాలయాల్లో కొరత ఇలా..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడీ కార్యాలయాల్లో ఇంకా 44 సర్వేయర్ల పోస్టులు ఖాళీగా వాటిలో వరంగల్‌లో 8, హనుమకొండలో 7, మహబూబాబాద్ 5, జనగామ 7, భూపాలపల్లి 7, ములుగులో 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



**ఉమ్మడి జిల్లాలో సర్వేయర్లున్నారిలా..**

| జిల్లా | మండలాలు | సర్వేయర్లు |
|---|---|---|
| వరంగల్ | 13 | 10 |
| హనుమకొండ | 14 | 12 |
| మహబూబాబాద్ | 18 | 01 |
| జనగామ | 12 | 07 |
| భూపాలపల్లి | 12 | 03 |
| ములుగు | 09 | 01 |
| మొత్తం | 78 | 40 |

### జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు ఆఫీసుల్లో సిబ్బంది కొరతే..

మండల, డివిజన్ రెవెన్యూ కార్యాలయాల్లోనే కాదు జిల్లా సర్వే అండ్ రికార్డు కార్యాలయాల్లోనూ ఉద్యోగులు, సిబ్బంది కొరత

మిగతా 5వ పేజీలో...

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ సంధ్యారాణి



మరియపురంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గీసుగొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నిర్ణీత గడువులో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ఆదేశించారు. శుక్రవారం మరియాపురంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆమె తనిఖీ చేశారు. లబ్ధిదారుల వి వరాలను కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయటంతో పాటు రిజిస్టర్‌లో కూడా రాసుకో వాలని కార్యదర్శులకు సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దిన్, ఎంపీడీవో కృష్ణవేణి, ఎంపీవో ప్రభాకర్, ఆర్ఐ సాంబయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

### రైస్‌మిల్లుల తనిఖీ..

మండలంలోని రైస్ మిల్లులను అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి శుక్రవారం తనిఖీ చేశారు. గొర్రెకుంటలోని మణికంఠ, ఈశ్వర ఇండస్ట్రీస్ మిల్లులో వడ్ల దిగు మతి వివరాలను తెలుసుకున్నారు. టార్గెట్ ప్రకారం వడ్లను దిగుమతి చేసుకొని వివరాలను ఓపీఎంఎస్‌లో యాక్సెప్ట్ చేయాలని మిల్లు యజమానులను ఆదేశిం చారు. రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దిన్, సివిల్ సప్లయీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి ఎస్సైపై సస్పెన్షన్ వేటు

**ఉత్తర్వులు జారీ చేసిన సీపీ**

వరంగల్ క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటూ, రాజకీయ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, ఫిర్యాదులను కూడా పట్టించుకోకుండా మామూళ్ల వసూళ్లకు అలవాటు పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎల్కతుర్తి ఎస్సై రాజ్‌కుమార్ సస్పెన్షన్ వేటుకు గురయ్యారు. ఈ మేరకు శుక్రవారం సీపీ అంబర్‌కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఎస్సై సస్పెన్షన్‌కు పలు కారణాలు వెలుగులోకి వచ్చాయని తెలుస్తోంది. ఎల్కతుర్తి పీఎస్ పరిధిలో జరిగిన ఓ శుభకార్యానికి ఓ మంత్రి అన్న కుమారుడు రాగా ఎలాంటి ప్రొటోకాల్ లేని ఆయనకు ఎస్సై పైలట్‌గా వెళ్లి సైరన్ కొడుతూ విధులను దుర్వినియోగం చేశాడని, అదే విధంగా కరీంనగర్‌లో జరిగిన సదరు రాజకీయ నాయకుడి జన్మదిన వేడుకలకు హాజరై.. అక్కడ తన అధికారాన్ని ఉపయోగించి మద్యం తెప్పించడం, తాను ఆ విందులో పాల్గొని మద్యం తాగి ఎల్కతుర్తి నుంచి వెళ్లిన నాయకులు, యువకులతో ఫొటోలు దిగడం, ఆ ఫోటోలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టడం చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే ఆయన వ్యతిరేక వర్గం ఎస్సై తీరును సీపీ దృష్టికి తీసుకెళ్లినట్టుగా తెలుస్తోంది. బీఆర్ఎస్ హయాంలో పోస్టింగ్ దక్కించుకున్న ఎస్సై అధికార పార్టీ నాయకులకు కాకుండా బీఆర్ఎస్‌లోని కొందరు నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి అధికార పార్టీకి చెందిన కొందరు స్థానిక నాయకులు తీసుకెళ్లారని సమాచారం. అంతేకాకుండా ఎస్ఐ తాను నివాసం ఉండే క్వార్టర్స్‌కు బయటివాళ్లు వచ్చి మద్యం తాగడం, క్వార్టర్స్ పరిసరాల్లో సెటిల్‌మెంట్లు చేస్తుండటంతో పోలీసు కుటుంబాలు కూడా ఆ ఎస్ఐపై ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. వరుస ఫిర్యాదులతో విచారణకు ఆదేశించిన సీపీ విచారణలో వెల్లడైన అంశాల మేరకు ఎస్సైపై సస్పెన్షన్ వేటు వేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, సుదర్శన్‌రెడ్డి, ధర్మారెడ్డి, నరేందర్

## కేటీఆర్‌ను అరెస్టు చేస్తే ఊరుకునేది లేదు

- కాంగ్రెస్ అవినీతిని ప్రశ్నిస్తే కేసులా
- అక్రమ అరెస్టులు చేస్తే ధర్నా, రాస్తారోకో చేస్తాం..
- మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, సుదర్శన్‌రెడ్డి, నరేందర్, ధర్మారెడ్డి

4


## కొత్త నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

- పాత మాస్టర్ ప్లాన్ 2041నే అమలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

వరంగల్‌సిటీ, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): మాస్టర్‌ప్లాన్ లో కొత్త నోటిఫికేషన్ ను రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏనుమాముల మార్కెట్ నుంచి సీకేఎం కళాశాలకు వేళ్లే జంక్ష న్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్ 2041 ప్రకారం 200 అడుగుల రహదారిని మా ర్చడానికి ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని, లేదంటే ఏనుమాముల మార్కెట్ ప్రాంత వాసులకు అన్యాయం జరుగుతుందని, కాంగ్రెస్ నాయకులు తమ ఆస్తులను కాపాడుకోవడానికే అలైన్‌మెంట్ మారుస్తున్నారని, ఇప్పటికైనా అధికార యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నోటిఫికేషన్‌ను రద్దు చేసి పాత పద్ధతిలోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ ప్రాంత వాసులతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, ఎల్లావుల లలితా కుమార్ యాదవ్, కేతిరి రాజశేఖర్, టి.రమేష్‌బాబు, పత్రి రాజపోశాలు, గంధ్రాతి భాస్కర్, సిలువేరు పవన్, రాజు, వీరాచారి, గోవిందు, సలీం,ఫిరోజ్, సతీస్, అనిల్ పాల్గొన్నారు.

## కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను రెగ్యూలర్ చేయాలి

- డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు

వరంగల్ మెడికల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎం, ఎన్ఎంలు, ఈసీఎఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఏఎన్ఎంలు, వైద్య విధాన పరిషత్ ఏఎన్ఎంలు, హెచ్ఆర్‌డీ ఏఎన్ఎంలు ఇతర అన్ని రకాల ఏఎన్ఎంలను రాత పరీక్ష లేకుండా యథావిధిగా రెగ్యులర్ చేయా లని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నేత, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనిన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ మాట్లాడు తూ 24ఏళ్లుగా రెగ్యూలర్ చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. సమస్యల ప రిష్కారం కోసం పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశా రు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ నాయకులు శ్రీనివాస్, సుజాత, సరోజ, చంద్రకళ, ప్రభావతి, సాంబలక్ష్మీ, మంజుల, పుష్పలత, విజయ, కవిత, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.




# కిల్లర్.. క్లినిక్స్

వరంగల్ మెడికల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాను.. రాను వైద్యం వ్యాపారం అవుతోంది. అనేక ప్రైవేట్ ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్న క్రమంలో చాలా యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. కనీస నిబంధనలను పాటించకుండా ఆసుపత్రులను ఏర్పాటు చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు వేలల్లో ఉన్నాయి. ఈ క్రమంలో హనుమకొండ జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ.. 229 క్లినిక్‌లు, 55 పాలిక్లినిక్‌లు, 62 మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, ఐదు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, 162 ఆస్పత్రులు, 14 నర్సింగ్ హోంలు, 78 డెంటల్ ఆస్పత్రులు, 70 వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, రెండు ఇమేజింగ్ సెంటర్లు, ఆరు డీ అడిక్షన్ సెంటర్లు, 24 ఫిజియోథెరపీ కేంద్రాలను గుర్తించింది. వీటికి మాత్రమే అనుమతి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వందలాదిగా ఆస్పత్రులు పుట్టుకొస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సర్వే చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రయివేట్ ఆస్పతులు, నర్సింగ్ హోమ్స్, క్లినిక్‌లు, కన్సల్టేషన్ రూములు, పాలిక్లినిక్‌లు, గయాగ్నోస్టిక్ కేంద్రాలు, ఫిజియోథెరపి కేంద్రాలు, డెంటల్ ఆస్పత్రిలో తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ లేకుండానే నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వెంటనే ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. ఏదైనా సంఘటన జరిగితే ఆ తర్వాత వాటికి అనుమతులున్నాయా? లేవా? అన్న వి షయం ఇంతకాలం బయటపడుతూ వస్తోంది. కానీ ఇకపై ఈ తరహా వ్యవహారాలకు స్వస్తి పలికేందుకు ప్రభుత్వమే ముందుగా సర్వే నిర్వహించాలని నిర్ణయించింది. అదే వి ధంగా మెడికల్ ఎక్విప్‌మెంట్, శానిటేషన్ ఆస్పత్రి నుంచి వచ్చే వ్యర్థాల నిర్వహణ విషయంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించడం లేదన్న విషయం ఆరోగ్యశాఖ దృష్టికి వచ్చింది. గతంలో ఇదే తరహా సర్వే నిర్వహించగా.. నెల రోజులుగా మళ్లీ సర్వే కొనసాగుతోంది. అనుమతులు ఉన్నప్పటికి రెన్యూవల్ చేసుకోని ఆస్పత్రులు చాలా ఉన్నట్లు తాజాగా నిర్వహించిన సర్వేలో తేలింది. హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో ప్రముఖమైన ఆస్పత్రులకు నోటీసులను కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ వైద్యాన్ని బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం అవుతోంది.

- పుట్టగొడుగుల్లా ప్రైవేట్ ఆస్పత్రులు
- నిబంధనలు గాలికొదులుతున్న యాజమాన్యాలు
- పాత పేరులో స్వల్పమార్పులు.. కొత్త పేర్లతో మళ్లీ తెరపైకి
- అనుమతులు లేని దవాఖానాలు ఎన్నో
- ప్రమాదాలు జరిగితే పరిస్థితేంటి?
- రోగుల ప్రాణాలతో చెలగాటం
- అంబులెన్స్ తిరిగే స్థలం కూడా ఉండని పరిస్థితి

### నిబంధనలు గాలికి...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయి. ఆస్పత్రుల అనుమతులు ఫైర్ మెజర్‌మెంట్ తప్పనిసరి. కానీ ఇప్పటి వరకు అనుమతి పొందిన ఏ ఆస్పత్రిలో కూడా ఫైర్ శాఖ నిబంధనలు లేకున్నప్పటికీ మంజూరు చేస్తున్నారు. హనుమకొండలోని రద్దీగా ఉండే ఓ ప్రదేశంలో సుమారు 100 గజాల ప్రదేశంలో కూడా బహుళ అంతస్థులు నిర్మించి రోగుల నుంచి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి ఆస్పత్రిలో విధిగా ఆక్సిజన్ లాంటి మౌలిక సదుపాయాలు ఉండాలని నిబంధనలు ఉన్నప్పటికీ వీటిని గాలికి వదిలేస్తున్నారు. కొన్ని చోట్ల అధికారులు సీజ్ చేసిన ఆసుపత్రులను మూసినట్టే మూసి.. ఆ తర్వాత అవే యాజమాన్యాలు మారుపేర్లలో అడ్డదారిలో అనుమతులు తెచ్చుకుని మళ్లీ ఆసుపత్రులను ప్రారంభిస్తున్నట్టు విమర్శలున్నాయి.

### అంబులెన్స్ పార్కింగ్ కూడా లేదు..

నగరంలోని అనేక ఆస్పత్రుల్లో అంబులెన్స్‌లు అవలీలగా వచ్చేందుకు మార్గాలు లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. అనేక ఆస్పత్రుల్లో రోగులను బయట వరకు స్ట్రెచర్‌పైనే తీసుకువస్తూ అంబులెన్స్‌లో ఎక్కించి తరలిస్తున్నారు. అలాంటి వారికి ఎలా అనుమతులు ఇచ్చారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### గోల్డ్‌మెడల్స్ అంటూ మోసం

ఇక అనేక మంది ప్రముఖ వైద్యులు తమ పేరు చివరన గోల్డ్ మెడల్ తగిలించుకొని రోగులను మోసగిస్తున్నట్టు తెలుస్తోంది. వాస్తవంగా గోల్డ్‌మెడల్ సాధించిన వారికంటే గోల్డ్‌మెడల్స్ రాకపోయినా వచ్చిందని ప్రచారం చేసుకుంటున్న వారే ఎక్కువగా ఉన్నట్టు చర్చ జరుగుతోంది. అయినా చికిత్స అందించే సమయంలో ఈ మెడల్స్ ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. డిగ్రీల పేరుతో మోసానికి కూడా పాల్పడుతున్నారు. విదేశాల్లో చదివినట్లు పేరు కింద నమోదు చేసుకుంటూ సామాన్యులను అయోమయానికి గురి చేస్తున్నారు.

### ఆరోగ్య శాఖ తనిఖీలు ఏమైనట్టు?

సామాన్యులను మోసం చేస్తున్న వైద్యుల పట్ల తనిఖీలు చేయాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో నిద్రపోతున్నట్లు తెలుస్తుంది. అడపా దడపా తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ చేతులు దులుపుకొంటున్నట్టు వి మర్శలు వ్యక్తం అవుతున్నాయి. కార్పొరేట్‌ఆస్పత్రుల వైపు కనీసం కన్నెత్తికూడా చూడని ఆరోగ్యశాఖ అధికారులు సాధారణ వైద్యుల వెంటపడుతున్నట్టు చర్చించుకుంటున్నారు. కార్పొరేట్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నుంచి క్లినిక్ వరకు ముమ్మర తనిఖీలు చేయాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. కొన్ని ఆస్పత్రులు ఒక రకమైన చికిత్స కోసం అనుమతులు తీసుకొని మరో విభాగంలో వైద్యం అందిస్తున్నట్టు కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి ఆస్పత్రులపై కూడా వైద్య ఆరోగ్యశాఖ కొరడా ఝళిపించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.



రోడ్డు ను బ్లాక్ చేసి.. పనులు చేయకుండా రోడ్డుపై ఉన్న ఎక్స్‌కవేటర్

## మూడేళ్లయినా ముడిపడలే..

అది వరంగల్ నర్సంపేట ప్రధాన రహదారి. ఆ మార్గంలోని కొటగండి సమీపంలో కూడా ఆధ్వర్యంలో నగర సుందరీకరణ పనుల్లో భాగంగా ఓ ఆర్చీని నిర్మిస్తున్నారు. మూడేళ్ల క్రితం ప్రారంభించిన ఈ ఆర్చీ పూర్తి కాలేదు. నత్తనడకన జరుగుతున్న ఈ పనుల కోసం రోజూ ఆ ప్రధాన రహదారిని ఒక వైపు మూసేస్తున్నారు. పూర్తిస్థాయిలో పనులు చేయకుండానే ఇలా రోడ్లును ఒక వైపు బంద్ చేయడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే ప్రమాదాలకు గురవుతున్నారని, ఆర్చి పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

- ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

# 'గిరిఫెడ్' మంజూరు

- గంగారం, కొత్తగూడలో ఆదివాసి సొసైటీల ఏర్పాటుకు శ్రీకారం
- సభ్యులకు రూ.5లక్షల మేర ఉచితంగా విత్తనాలు, ఎరువులు పంపిణీ
- ఎన్సీడీసీ నుంచి రూ.160 కోట్ల సబ్సిడీ మంజూరు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10 సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదన
- వడ్డీ వ్యాపారులనుంచి విముక్తి పొందనున్న గిరిజనులు

గంగారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లాలోని గంగారం మండలానికి నీతి అయోగ్ ప్లానింగ్ కమిషన్ సూచన మేరకు కేంద్రప్రభుత్వం ఎగిరిఫెడ్ మంజూరు చేసింది. ఈ సొసైటీ సభ్యులకు ప్రభుత్వమే ఉచితంగా విత్తనాలు ఎరువులు పంపిణీ చేయనుండగా.. రైతులు వడ్డీ వ్యాపారుల చేతిలో మోసపోకుండా బయటపడనున్నారు. అందుకు గాను ఎన్సీడీసీ నుంచి రూ.160కోట్ల నిధులు సబ్సిడీ కింద గిరిఫెడ్‌కు మంజూరు చేస్తూ ఆమోదం తెలిపింది. దీంతో ఏజన్సీలో గంగారం గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్రం నుంచి మహబూబాబాద్ జిల్లాలో వెనుకబడిన మండలమైన గంగారాన్ని గతేడాది కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్‌గా ఎంపిక చేసింది. ఈ పథకంలో అధికారులు మండలాన్ని విద్య, వైద్యం, పోషకాహారం, వ్యసాయం, తాగునీరు, సాగునీరు, తో పాటు గిరిజన మహిళలను చైతన్య పర్చాల్సి ఉంది. ఒక వ్యవసాయం మినహా అన్ని రంగాలలో గిరిజనులు కొద్దోగొప్పో అభివృద్ధి కనిపించినా.. వ్యవసాయ పరంగా వందలాది ఎకరాలు ఉన్నా రైతుల అభివృద్ధి కానరాకపోవటంపై స్పందంచిన నీతి అయోగ్ ప్లానింగ్ కమిషన్ అధికారులు మండలంలోని 19 గ్రామాలలో గిరిజనుల ప్రధాన పంట అయిన మొక్కజొన్న సాగు, దిగుబడులు, ఆదాయంపై ప్రతీ గిరిజనుడితో సర్వేలు చేసి వివరాలు సేకరించారు. గిరిజనులు వ్యవసాయం చేయాలంటే ఎరువుల వ్యాపారుల నుంచి వడ్డీకి తెచ్చేనే సాధ్యమని గుర్తించటం జరిగింది. గిరిజనులు వ్యవసాయ పరంగా కష్టపడినా ప్రయోజనం దక్కటం లేదని, ఏటా పండించిన పంట అంతా వడ్డీతో సహా వ్యాపారులకే చెల్లిస్తున్నామని గిరిజనులు అధికారులకు చెప్పటంతో వ్యాపారుల నుంచి రైతులను ఆదుకునేందుకు నీతి అయోగ్ అధికారులు ఉమ్మడి మండలాలైన గంగారం, కొత్తగూడ ను కలిపి గిరిఫెడ్ ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కేంద్రానికి నివేదికలు పంపారు. కేంద్రంప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి పది గిరిజన ఆదివాసీ సొసైటీలకు అనుమతి ఇస్తూ.. హైదరాబాద్ రాజధాని కేంద్రంగా గిరిఫెడ్ మంజూరు చేసింది. ఈ గిరిఫెడ్ ద్వారా గిరిజనులు గిరిజన కోఆపరేటివ్ ఫెడరేషన్ ఏర్పాటు చేసుకుని సభ్యులుగా చేరాల్సి ఉంటుంది. మండలానికి ఒక బ్లాక్ చొప్పున గిరిజనుల సమైఖ్యను ఏర్పాటు చేసిన అధికారులు ఒక్కో రైతుకి ఏడాదికి రూ. ఐదు లక్షల వరకు అవసరం అయిన ఎరువులు పురుగు మందులు విత్తనాలను వడ్డీ లేకుండా ఇస్తారు. ఇలా గిరిఫెడ్ నుంచి అప్పు తీసుకున్న రైతు పండించిన పంటను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే తిరిగి గిరిజన సొసైటీ కొనుగోలు చేసి రైతు ఎకౌంట్‌లో నిధులు జమ చేస్తారు. దీంతో గిరిజనులు ఎరువుల వ్యాపారులను ఆశ్రయించే అవసరం ఉండదని నీతి అధికారులు చెప్తున్నారు.

### స్థల సేకరణ..

గిరిఫెడ్ ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం నీతి అయోగ్ అధికారులు స్థలం సేకరణలో నిమగ్నమైయ్యారు. కార్యాలయంతో పాటు రైతులు సమావేశానికి అవసరమైయ్యే వేదికతోపాటు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను నిల్వ ఉంచేందుకు అవసరమైన స్థలం (పది ఎకరాలుపైన) కోసం సర్వే చేస్తున్నారు.




### ఇంటర్ నెట్ సౌకర్యం కూడా ఉండాలి..

జిల్లాలో బాగా వెనుక బడిన మండలమైన గంగారంలో ఇంటర్‌నెట్ సౌకర్యాలు అరకొర మాత్రమే. ఎఆన్‌లైన్ సౌకర్యం లేకపోవటంతో ఆన్‌లైన్ సౌకర్యం ఉన్న కొత్తగూడలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలలో అధికారులు ఉన్నారు.

### వడ్డీ వ్యాపారులనుంచి విముక్తి పొందనున్న ఏజన్సీ గిరిజలు..

ఉమ్మడి మండలాలైన గంగారం, కొత్తగూడకు గిరిఫెడ్ కు అవసరమైన స్థలం దొరికితే ఈ ప్రాంత గిరిజనులు వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి పొందినట్టేనని హర్షం వ్యక్తం చేస్తున్నారు. గంగారం మండలంలో 19 గ్రామాలలో సుమారు 25 నుంచి 30 వరకు చిన్నా చితుకా ఎరువులు, పురుగుమందుల షాపులు ఉన్నాయి. ప్రతీ గిరిజనుడు ఆ ఎరువుల వ్యాపారులు ఇచ్చే అప్పుపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. తరతరాలుగా వడ్డీకి తెచ్చి వ్యవసాయం చేయటంతో గిరిజనులు పురోగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాగా మారింది. ఈ గిరిజన సొసైటీల వలన వడ్డీ వ్యాపారుల నుంచి గిరిజనులకు విముక్తి పొందే సువర్ణ అవకాశం దక్కుతుందనే చెప్పాలి.

### అటవీ ఉత్పత్తులనూ కొనుగోలు..

గిరిజన కోఆపరేటీవ్ సొసైటీ వారు గిరిజనులు అడవుల్లో సేకరించే అటవీ ఉత్పత్తులు అయిన తేనె, చీపుర్లు, జిగురు, ఇప్పబద్దలు, ఇప్పపువ్వు, చింతగింజలు, చింతపండు, చిల్లగింజలు, కరక్కాయలు, విషముష్టి గింజలు, పారటాకు (ఇస్తారాకు)లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేసి, రైతులను ఆదుకుంటామని నీతి అయెగ్ అధికారులు తెలిపారు.



ప్రిన్సిపాల్‌రాజిరెడ్డికి వినతి పత్రాన్ని ఇస్తున్న బీసీ విద్యార్థి సంఘం నేత నాగరాజు తదితరులు

## కేడీసీలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు గడువు పొడిగించాలి

కేయూ క్యాంపస్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ అధ్యాపక పోస్టుల దరఖాస్తుల గడువును పొడిగించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కేయూ ఇన్‌చార్జి ఆరెగంటి నాగరాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం కేడీసీ ప్రిన్సిపాల్ రాజిరెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. కేడీసీలో మైక్రోబయోలజీలో గెస్ట్ ఫ్యాకల్టీ నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. అభ్యర్థుల దరఖాస్తులు, ఇంటర్వ్యూలకు ఒక్కరోజు గడువు విధించారని పేర్కొన్నారు. 4 రోజుల పాటు గడువు పొడిగించాలని, పారదర్శకంగా నియామకం చేపట్టాలని కోరారు. పీహెచ్‌డీ, నెట్, స్లెట్‌తో పాటు యూజీసీ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సానుకూలంగా స్పందించి గడువును పొడిగిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ రిసెర్చ్ స్కాలర్లు శృంగారపు విష్ణు, సేవాలాల్ విద్యార్థిసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి నాయక్, రామకృష్ణ పాల్గొన్నారు.

## నేడు కేయూలో జాతీయ గణిత దినోత్సవం

కేయూ క్యాంపస్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీ గణిత విభాగం సెమినార్ హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు విస్తృత ఉపన్యాసం నిర్వహిస్తున్నట్లు గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆర్.భారవి శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. శ్రీనివాస రామానుజం అయ్యంగార్ జయంతిని పురస్కరించుకుని వరంగల్ ఎన్ఐటీ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఈ.సత్యనారాయణ ఎడిఫ్రెన్షియల్ ఈక్వెటెన్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అనే అంశంపై విస్తృత ఉపన్యాసం చేస్తారని వెల్లడించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలు హాజరుకానున్నట్లు భారవిశర్మ తెలిపారు. విద్యార్థులు, స్కాలర్లు హాజరు కావాలని కోరారు.

## కేయూ ఏబీవీపీ నూతన కార్యవర్గం ఎంపిక



సాయికుమార్, శివ

కేయూ క్యాంపస్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూని వర్సిటీ ఏబీవీపీ 2024-25 ఏడాదికి గాను నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎంపిక చేసినట్లు వరంగల్ విభాగ్ వ్యవస్థా ప్రముఖ్ ఏలేటి నాగరాజు ప్రకటించారు. ఈ మేరకు వర్సిటీలో ని ర్వహించిన సమావేశంలో కమిటీ వివరాలు వెల్లడించారు. ఏబీవీపీ కేయూ కమిటీ అధ్యక్షుడిగా మేరుగు సాయికుమార్, (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్), కార్యదర్శిగా చింతకాయల శివ,(జువాలజీ) ఉపాధ్యక్షులుగా అఖిల్, శివ, రోహిత్, కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా వంశీ, ఫణీంద్ర, మహేశ్, శివకుమార్, ప్రణయ్, సందీప్, కార్యవర్గ సభ్యులుగా అజయ్, శేఖర్, అరవింద్, విశ్వ, గోపాల్, శివకుమార్, సురేశ్, నగేశ్, శ్రీకాంత్, మురళి, గర్ల్ కన్వీనర్‌గా పి. పూజలు ఎంపికైనట్లు వెల్లడించారు. కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

# దేశ వ్యతిరేక శక్తులను అడ్డుకోవాలి

### ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాచర్ల రాంబాబు



సభలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాచర్ల రాంబాబు, కిరణ్, జీవన్

కేయూ క్యాంపస్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులందరూ దేశ వ్యతిరేక శక్తులను అడ్డుకోవాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మా చర్ల రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కేయూ ఫిజిక్స్ విభాగంలోని ప్రొఫెసర్ వెంకట్రామయ్య సెమినార్ హాల్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ నూతన విద్యార్థుల స్వాగత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు మాచర్ల రాంబాబు, ఓయూ స్కాలర్ జీవన్‌లు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రపంచంలోనే అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్ అని చెప్పారు. వ్యక్తి నిర్మాణంతోనే జాతీయ పునర్నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. జాతీయ పునర్ నిర్మాణం కోసం ఏబీవీపీ పని చేస్తోందన్నారు. వివేకానందుడి స్ఫూర్తితో అంబేద్కర్ ఆశయాల సాధనకు ఏబీవీపీ కృషి చేస్తోందన్నారు. దేశ వ్యతిరేక శక్తులను విద్యాప్రాంగణాల నుంచి తరిమికొట్టేందుకు ఏబీవీపీ ముందుంటుందని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఏబీవీపీ నేతృత్వంలో దేశంలో అనేక విద్యార్థి, సామాజిక ఉద్యమాలను నిర్మించి విజయాలు సాధించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ వర్సిటీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. వర్సిటీలకు పునర్వైభవం తీసుకువచ్చేం దుకు ఏబీవీపీ పోరాడుతోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏబీవీపీ వర్సిటీ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి అంబాల కిరణ్, వరంగల్ విభాగ్ సంఘటన మంత్రి హర్షవర్ధన్, రాష్ట్ర నాయకులు గట్టు ప్రశాంత్, రాజుకుమార్, డాక్టర్ వంగా మల్లేశ్, సుజిత్, అరుణ్, ఉమాశంకర్, సుధాకర్, జగత్, కృష్ణ, చంద్రశేఖర్, రాజు, అశోక్, ఈశ్వర్‌తో పాటు స్కాలర్లు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను అరెస్టు చేస్తే ఊరుకునేది లేదు

### మాజీ ఎమ్మెల్యేలు వినయ్ భాస్కర్, సుదర్శన్‌రెడ్డి, నరేందర్, ధర్మారెడ్డి

హనుమకొండ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేటీఆర్‌ను అరెస్టు చేస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్‌లు అన్నారు. ఫార్ములా ఈ రేస్ నిర్వహణలో అవినీతి జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే కేటీఆర్‌ను అరెస్టు అంటూ అసత్య ప్రచారాలతో కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం బురద జల్లే ప్రయత్నం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నందుకే కేటీఆర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఆరు గ్యారంటీలు అమలు మర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామన్నారు. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే గల్లీ నుంచి ధర్నా, రాస్తారోకో చేస్తామన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ వలనే దేశంలోనే హైదరాబాద్ నగరంలో ఈ రేస్‌ను ఏర్పాటు చేసిందని అన్నారు. రూ. 55 కోట్లు నేరుగా హెచ్ఎండీఏ ద్వారా ఫార్ములా ఈ రేస్ సంస్థకు చెల్లింపులు జరిగినట్లు కేటీఆరే చెప్పారన్నారు. అసలు నిందితుడు సీఎం రేవంత్‌రెడ్డేనని ఫార్ములా ఈ రేస్ విషయంలో ఆ సంస్థకు చెందిన వ్యక్తిని రేవంత్‌రెడ్డి కలిసిన విషయాన్ని ప్రభుత్వం ఎందుకు దాచిందో చెప్పాలన్నారు. చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే తెలంగాణలో మరో ఉద్యమం ఎగిసిపడుతుందన్నారు. ప్రతీ మూడు నెలలకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త అంశాన్ని తెరపైకి తెస్తూ ప్రజలను డైవర్ట్ చేస్తున్నారని విమర్శించారు. నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ చంద్రబాబు చెంచాగా ఉండి నాడు ఓటుకు నోటు కేసులో దొరికి న దొంగ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి పెరిగిందన్నారు. జిల్లాలో కాంగ్రెస్ నాయకులు, మంత్రులు కబ్జాలకు పాల్పడుతున్నట్లు విమర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవ్‌రెడ్డి, బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మేడిపల్లి శోభన్‌బాబు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎలుకుర్తి శివాలయాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సునిత

## ఆలయాలను సందర్శించిన అసిస్టెంట్ కమిషనర్

గీసుగొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డుచింతలపల్లి, ఎలుకుర్తి శివాలయాలతో పాటు కొమ్మాల శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయాన్ని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సునిత, డీఈ రమేష్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు రడం భరత్ శుక్రవారం సందర్శించారు. ఆయా దేవాలయాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు డీఈ చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు వీరారావు, భిక్షపతి నాయకులు కళ్యాణ్, కార్తీక్, నాగేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారికి మహాభిషేకం

### భక్తులతో కిటకిటలాడిన దేవాలయం



భద్రకాళి అమ్మవారికి మహాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

వరంగల్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర మాసం శుక్రవారం ధనుర్మాసం సందర్భంగా భద్రకాళి అమ్మవారికి మహా అభిషే కాన్ని నిర్వహించారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు నేతృత్వంలో అమ్మవా రికి విశేష పూజలు చేశారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా అమ్మ వారికి నిర్వహించిన మహాభిషేకంలో హనుమకొండకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మునిగాల సురేందర్‌రావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఈవో శేషు భారతి, సూపరింటెం డెంట్ అద్దంకి విజయ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భక్తులతో కిటకిటలాడుతున్న దేవాలయం

## 22 సెకన్లలో రాష్ట్రాలు, రాజధానుల పేర్లు..

### వరంగల్ జిల్లా కొలన్‌పెల్లి విద్యార్థిని ప్రతిభ



రాష్ట్రాల పేర్లు చెబుతున్న విద్యార్థిని రాజ శ్రీ

రాయపర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కొలన్‌పెల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశా లలో 8వ తరగతి చదువు తున్న పి.రాజశ్రీ అనే విద్యార్థి నితన ప్రతిభను చాటుకుంది. 22సెకండ్లలో దేశంలోని 28 రాష్ట్రాలు, వాటి రాజధానులు మొత్తం 56పేర్లను చకాచకా చెప్పి అబ్బుర పరిచింది. తడబాటు లేకుండా, తప్పుల్లే కుండా అర నిమిషంలోపే ఈ పేర్లన్నీ చెప్పడంతో ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తోటివిద్యార్థినిలు రాజశ్రీని అభినందనల్లో ముంచెత్తారు.

## 24న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో 24న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం. మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మెడ్‌ప్లస్‌లో వివిధ ఉద్యోగాల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డీ, బీ ఫార్మసీ ఉత్తీర్ణులై, 18 నుంచి 30 సంవత్సరాల మధ్య గల వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ, యువకులు వారి జీరాక్స్ సర్టిఫికేట్లతో మంగళవారం ఉదయం 11 గంటలకు ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధికల్పన కార్యాలయంలో హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7893394393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు (బిల్టీ రకం) | - | - |
| పల్లికాయ (సూక) | 3100 | 3000 |
| పల్లికాయ (పచ్చిది) | 4600 | 4500 |
| కందులు | - | - |
| పెసళ్లు | 7560 | 4000 |
| పత్తి | 6980 | 5800 |
| పసుపు (కాడి) | - | - |
| పసుపు (గోల) | - | - |
| తేజ మిర్చి | 12000 | 9000 |
| తేజ మిర్చి (కొత్తది) | 15500 | 12000 |
| తేజ ఏసీ | 15000 | 14000 |
| వండర్‌హాట్ ఏసీ | 14500 | 13000 |
| యూఎస్341ఏసీ | 14000 | 11000 |
| దేశీ ఏసీ | - | - |
| సింగిల్‌పట్టి ఏసీ | - | - |
| తాలు మిర్చి | 7000 | 3000 |

- వరంగల్ వ్యవసాయం



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీజీవీబీ చైర్మన్ కె. ప్రతాప్‌రెడ్డి

## 27 నుంచి 30 వరకు లావాదేవీలు ఉండవు

### బ్యాంకు సేవలను 27 లోపే పూర్తి చేసుకోవాలి

### ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ టౌన్ , డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీజీవీబీ బ్యాంకు లావాదేవీలు కస్టమర్లకు ఈ నెల 27 నుంచి 30 వరకు అందుబాటులో ఉండవ ని కస్టమర్లు బ్యాంకు సేవలను ఈ నెల 27 లోపే పూర్తి చేసుకోవాలని ఏపీజీవీబీ చైర్మన్ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని ఏపీజీవీబీ జోనల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీజీవీబీ చైర్మన్ కె. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు వన్ స్టేట్ వన్ ఆర్ఆర్‌బీ లక్ష్యంలో భాగంగా ఏపీజీవీబీ బ్యాంకులను టీజీబీ బ్యాంకులో విలీనం చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంకు సంబంధించిన 493 శాఖలను గ్రామీణ బ్యాంకు టీజీబీలో విలీనం కానున్నట్లు తెలిపారు. 2025 జనవరి 1 నుంచి టీజీబీ హెడ్ ఆఫీస్ హైదరాబాద్‌లోనే ఏపీజీవీబీ బ్రాంచ్‌లు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా తలెత్తే సాంకేతిక కారణంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్ సర్వీస్‌లు ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను ఈ నెల 27 నుంచి 31 వరకు అందుబాటులో ఉండవన్నారు. కస్టమర్లు ఈ నెల 27వ తేదీలోగా తమ లావాదేవీలు పూర్తి చేసుకోవాలని కస్టమర్లకు విజ్ఞప్తి చేశారు. 2025 జనవరి 1 నుంచి బ్యాంకు సర్వీస్‌లు యథావిధిగా నడుస్తాయన్నారు. ఖాతాదారుల నంబర్లు అలాగే ఉంటాయని ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఆపరేషన్ బి. దయాకర్, కోఆర్డినేటర్లు శశికాంత్ పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి అమిత్‌షాపై పోలీసులకు ఫిర్యాదు

ఎల్కతుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీఆర్ అంబేద్కర్‌ను కించపర్చేలా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై కాంగ్రెస్ మండల నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మొక్కితే ఏమి వస్తుందని.. దేవుడిని మొక్కితే పుణ్యం వస్తుందని అనడం అంబేద్కర్‌ను కించపర్చినట్లేనని ఆరోపించారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో నాయకులు సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, గొర్రె మహేందర్, దూలం ప్రభాకర్ గౌడ్, బచ్చు శ్రీధర్‌రావు, అంబాల శ్రీకాంత్, శనిగరం వెంక టేష్, సాహు, పాక రమేష్, సాతూరి రాజమౌళి, మేకల చేరాలు, వెంకన్న, రాజయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.




పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## అంగరంగ పెళ్లిళ్లపై ఐటీ చూపు

న్యూఢిల్లీ, డిసెంబరు 20: భారీ సెట్టింగు.. డెస్టినేషన్ వెడ్డింగ్.. సినీ తారల సందడి.. కోట్లు ఖర్చు అయినా వెనుకాడకుండా ఆతిథ్యం.. ఇలా అంగరంగ వైభోగంగా జరిగే పెళ్లిళ్లపై ఆదాయ పన్ను శాఖ దృష్టి పెట్టింది. పన్ను లెక్కల్లో చూపని నగదును ఈ కల్యాణాల్లో ఖర్చు చేస్తున్నట్లు పసిగట్టింది. ఇలాంటి డబ్బు గతేడాది కాలంలో రూ. 7,500 కోట్లకుపైగా ఖర్చు పెట్టారని లెక్కగట్టింది. ఆ విలాసవంతమైన వెడ్డింగ్‌లకు జైపూర్ కేంద్రమని గుర్తించిన ఆదాయ పన్ను అధికారులు.. ఇక్కడి టాప్ 20 వెడ్డింగ్ ప్లానర్ల లెక్కలు బయటకు తీస్తోంది. వీరిని ఇతర ప్రాంతాల వెడ్డింగ్ ప్లానర్లు సంప్రదిస్తారని అధికారులు గుర్తించారు. జైపూర్‌లో భారీ పెళ్లిళ్ల కోసం మ్యూల్ ఖాతాలు, హవాలా ఏజెంట్లు, నకిలీ బిల్లుల సృష్టి కర్తలతో కూడిన ఓ నెట్‌వర్క్ పనిచేస్తోందని, ఈ నెట్‌వర్క్‌కు హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాల్లోని సహచరులతో సంబంధాలు ఉన్నాయని కనిపెట్టారు.

## హరియాణా మాజీ సీఎం చౌతాలా కన్నుమూత



చండీగఢ్, డిసెంబరు 20: హరియాణా మాజీ సీఎం, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ అధ్యక్షుడు ఓం ప్రకాశ్ చౌతాలా(89) కన్నుమూశారు. గురుగ్రామ్‌లోని నివాసంలోనే ఆయన గుండెపోటుతో శుక్రవారం తుది శ్వాస విడిచారు. మాజీ ఉప ప్రధాన మంత్రి దేవీలాల్ పెద్ద కొడుకైన చౌతాలా అయిదు సార్లు హరియాణా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. చౌతాలా మృతి పట్ల ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చౌతాలా మృతి నేపథ్యంలో హరియాణా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు శనివారం సెలవు ప్రకటించింది. అలాగే శుక్రవారం నుంచి మూడురోజులు సంతాప దినాలుగా ప్రకటించింది.

## అమెరికాకు 'ఘోస్ట్ గన్స్' తలనొప్పి!



» పెరిగిపోతున్న త్రీడీ ముద్రిత

### తుపాకుల సంస్కృతి

తుపాకుల సంస్కృతి అమెరికాకు కొత్త కాదు! తరచుగా ఎక్కడో ఒకచోట కాల్పుల ఘటనలు జరుగుతూనే ఉంటాయి. అలాంటి దేశాన్నే ఇప్పుడు 'త్రీడీ ప్రింటెడ్' తుపాకుల విస్తృతి తీవ్రంగా భయపెడుతోంది. చూడ్డానికి పిల్లలు ఆడుకునే బొమ్మల్లా ఉండే ఈ తుపాకులు అగ్రరాజ్యానికి తలనొప్పిగా మారాయి. ఉదాహరణకు.. ఈ నెల 4వ తేదీన అమెరికాలో యునైటెడ్ హెల్త్‌కేర్ సీఈవో బ్రియాన్ థాంప్సన్.. కాల్పుల్లో చనిపోయారు గుర్తుంది కదా! ఆ హత్యకు నిందితుడు వాడింది త్రీడీ ప్రింటెడ్ తుపాకీనే. అదొక్కటే కాదు.. ఇటీవలికాలంలో అమెరికాలో జరిగిన పలు హై-ప్రొఫైల్ నేరాల్లో నిందితులు ఇంట్లోనే త్రీడీ ప్రింటర్ల సాయంతో ముద్రించిన ఆయుధాలను వాడినట్టు తేలడం పోలీసులను కలవరపెడుతోంది. దుకాణంలో కొన్న తుపాకులకు ఒక లెక్కాపత్రం ఉంటాయి! ఇంట్లో త్రీడీ ప్రింటర్ పెట్టి దాంట్లో ఆయుధాలను/తుపాకులను ముద్రించి నేరాలకు పాల్పడితే వాటిని గుర్తించడం కూడా కష్టమే కదా! అందుకే ఈ తుపాకులను అమెరికా పోలీసులు 'ఘోస్ట్ గన్స్'గా వ్యవహరిస్తున్నారు. చాలా కేసుల్లో ఘోస్ట్ గన్స్ వాడినట్టు తేలడంతో అమెరికా సుప్రీంకోర్టు కూడా ఈ సమస్యపై దృష్టి సారించింది. ఈ సమస్య ఒక్క అమెరికాకే కాదు.. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలకు ఉంది. నిజానికి త్రీడీ ముద్రిత తుపాకీకి సంబంధించి ప్రపంచంలో తొలి క్రిమినల్ కేసు యూకేలో 2013లో నమోదైంది. అప్పటి నుంచి యూరప్‌లోని వ్యవస్థీకృత నేర ముఠాల నుంచి మయన్మార్‌లో తిరుగుబాటుదారుల దాకా.. జిహాదీలు, వామపక్ష తీవ్రవాదులు, మితవాదులు, జాతిపరమైన వేర్పాటువాదులు.. ఇలా అందరి దృష్టీ వీటిపైకి మళ్లింది. యూరప్‌లో 2013-2024 నడుమ త్రీడీ ప్రింటెడ్ ఆయుధాలకు సంబంధించి 165 కేసులు నమోదయ్యాయి. అందులో 15% కేసులు ఉగ్రవాదానికి సంబంధించినవి. తుపాకులు కలిగి ఉండడం చట్టబద్ధమైన అమెరికాలో అయితే.. వీటి వినియోగం ఆందోళనకరస్థాయికి పెరిగిపోయింది. యూఎస్ బ్యూరో ఆఫ్ ఆల్కహాల్, ఫైర్‌ఆర్మ్స్ అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ గణాంకాల ప్రకారం.. 2017-21 నడుమ అక్కడి దర్యాప్తు సంస్థలు 38 వేల ఘోస్ట్ గన్స్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా త్రీడీ ముద్రిత తుపాకులకు సంబంధించి అరెస్టుల సంఖ్య కూడా పెరుగుతోంది. 2022లోఅన్ని దేశాల్లో కలిపి ఈ తరహా కేసుల్లో 66 మంది అరెస్టయ్యారు.

### అదానీపై ఆరోపణల వెనుక ఉన్న అమెరికా అటార్నీ రాజీనామా?

వాషింగ్టన్, డిసెంబరు 20: అదానీ గ్రూప్ సంస్థల అధినేత గౌతమ్ అదానీపై కేసు నమోదు వెనుక ఉన్న అమెరికా అటార్నీ బ్రియాన్ పీస్ జనవరి 10న తన పదవికి రాజీనామా చేయనున్నారు. అమెరికా అటార్నీ కార్యాలయం తాజాగా ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. న్యూయార్క్‌లోని ఈస్టర్న్ డిస్ట్రిక్ట్‌కు ఆయన అటార్నీగా వ్యవహరిస్తున్నారు. 53 ఏళ్ల బ్రియాన్ పీస్‌ను 2021లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆయనను న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ అటార్నీగా నియమించారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వ కాంట్రాక్టులు పొందేందుకు లంచాలు ఇవ్వడానికి అమెరికాలోని పెట్టుబడిదారుల నిధులను అదానీ గుట్టుచప్పుడు కాకుండా మళ్లించారని ఈ ఏడాది నవంబరులో బ్రియాన్ పీస్ కార్యాలయం అభియోగాలు మోపింది.

### ఎందుకు ప్రమాదం?

చట్టబద్ధంగా ఎవరైనా తుపాకీ కొంటే.. దాని సీరియల్ నంబర్, ఎవరు కొన్నారు? ఎప్పుడు కొన్నారు? లాంటి వివరాలన్నీ అధికారుల డేటాబేస్‌లో ఉంటాయి. కాల్పుల ఘటనలు జరిగినప్పుడు కొద్దిపాటి దర్యాప్తుతో నేరగాళ్లను గుర్తించే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఎవరికివారు ఇంట్లో ప్రింటర్ పెట్టి ప్రింటవుట్ తీసినంత సులభంగా ఆయుధాలు ముద్రించేసుకుంటే వాటిని గుర్తించడం పోలీసులకు అసాధ్యం అవుతుంది. ఈ ముప్పును గుర్తించే జపాన్, కెనడా, యూరోపియన్ దేశాలు త్రీడీ ప్రింటెడ్ తుపాకులపై నిషేధం విధించాయి.



మీడియాతో మాట్లాడుతున్న సాయిదివ్య

## పీఎస్ఎల్వీ-సీ60లో స్వేచ్ఛశాట్ పేలోడ్

తెనాలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులో పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా స్పాడెక్స్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపేందుకు ఇస్రో సన్నద్ధమవుతోంది. శ్రీహరికోట నుంచి చేపట్టే ఈ ప్రయోగంలో తెనాలికి చెందిన ఎన్ స్పేస్ టెక్ సంస్థ భాగస్వామ్యం కానుంది. ఇస్రో సహకారంతో యుహెచ్‌ఎఫ్ కమ్యూనికేషన్ మాడ్యూల్‌కు సంబంధించి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అతి చిన్న స్వేచ్ఛశాట్-వీ.0 పేలోడ్‌ను పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నట్టు ఎన్ స్పేస్ టెక్ సంస్థ వ్యవస్థాపకురాలు, ఏపీలోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొత్తమాసు సాయిదివ్య శుక్రవారం తెలిపారు. తమ మాడ్యూల్‌కు సంబంధించి భూమిపై చేసిన పరీక్షలన్నీ విజయవంతమయ్యామని, ఉపగ్రహం కక్ష్యలోకి చేరాక తాము పంపిన మాడ్యూల్ ఇస్రోకు సంకేతాలు పంపితే తమ ప్రయత్నం ఫలించినట్టేనని ఆమె చెప్పారు. స్వేచ్ఛశాట్ విజయవంతమైతే భారీ మాడ్యూల్స్ స్థానంలో అతి చిన్న మాడ్యూల్స్‌ను ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. అలాగే ఎటువంటి కమ్యూనికేషన్ వ్యవస్థ లేని మారుమూల ప్రాంతాలకు ఎంతగానో ఉపయోగమని అన్నారు. వ్యవసాయ రంగంలోనూ సమూల మార్పులకు ఇది దోహదపడుతుందన్నారు.

## రక్షణ పరిశ్రమలో స్వదేశీ సామర్థ్యాల పెంపు

» దేశాభివృద్ధి కోసం సాంకేతిక పురోగతిని సాధించాలి: రాష్ట్రపతి ముర్ము
» కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌కు 'కలర్స్ ప్రజెంటేషన్ అవార్డు' అందజేత
» రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోమ్.. హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్



ఎట్‌హోమ్ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ముతో సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

అల్వాల్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): దేశంలో సాంకేతికంగా అధునాతన పరికరాలను తయారు చేయడం ద్వారా రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన సాధించే దశను ప్రారంభించే సమయం వచ్చేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. స్వావలంబన, సాంకేతిక పురోగతి, వ్యూహాత్మక సహకారాలపై దృష్టి సారించడం ద్వారా భారతదేశం తన సరిహద్దులను కాపాడుకోవడమే కాకుండా ప్రపంచ శాంతి, స్థిరత్వానికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఈజ్ ఆఫ్ డూయింగ్' వంటి కార్యక్రమాల ద్వారా వ్యాపారం, రక్షణ పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి, రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు భారతీయ, విదేశీ పెట్టుబడుదారులను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. స్వదేశీకరణకు ప్రాధాన్యమిస్తూ దేశీయంగా అనేక రక్షణ ఉత్పత్తులు తయారు చేయడం జరుగుతోందన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)కు 'కలర్స్ ప్రజెంటేషన్ అవార్డు' అందజేయడానికి రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రక్షణ పరిశ్రమలో స్వదేశీ సామర్థ్యాలను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. రక్షణ బలగాల అధికారులు ఆత్మనిర్భర్ భారత్ విజన్‌ను సాధించడానికి, స్వావలంబన సాధించడానికి సహకరించాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. రక్షణ ఆధునీకరణ రంగంలో భారతదేశం తన సంప్రదాయాల బలగాలను అప్‌గ్రేడ్ చేయడం, కృత్రిమ మేధస్సు, డ్రోన్‌లు, సైబర్ వార్‌ఫేర్ సామర్థ్యాలు, అంతరిక్ష రక్షణ సాంకేతికతలతో సహా అత్యాధునిక సాంకేతికతలను తెలుసుకోవడం వంటి సమగ్ర విధానంపై, ప్రపంచ స్థాయిలో వ్యూహాత్మక రక్షణ భాగస్వాములను ఏర్పాటుపై భారతదేశం దృష్టి సారిస్తుందని పేర్కొన్నారు. బహుపాక్షిక ఆర్థిక సైనిక దళాల కార్యకలాపాల ద్వారా ప్రాంతీయ, ప్రపంచ రక్షణ చర్చల్లో భారతదేశ ప్రభావం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. గత ఐదు దశాబ్దాలుగా సీడీఎం ప్రయాణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ఆమె అభినందించారు. భారత సైన్యం, నేవీ, వైమానిక దళం, కోస్ట్‌గార్డ్‌ల అధికారుల శిక్షణలో ఉన్నత ప్రమాణాలను సాధించడానికి సీడీఎం విశేషంగా కృషి చేస్తోందన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, కృత్రిమ మేధస్సుకు భారతదేశం అధిక ప్రాధాన్యాన్నిస్తోందని, వాటిని భారత రక్షణ వ్యవస్థల్లో మెరుగైన సామర్థ్యం, ప్రపంచ పోటీతత్వం కోసం ఉపయోగిస్తుందని వివరించారు. కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చీఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్, సీడీఎం కమాండెంట్ హర్ష్ చిబ్బర్, త్రివిధ దళాల అధికారులు పాల్గొన్నారు.

### ముర్ము తేనీటి విందు

శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తేనీటి విందు ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే దంపతులు హాజరయ్యారు. హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావు, శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి రాష్ట్ర మంత్రులు దామోదర, పొన్నం, సీతక్క, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు తదితరులు రాష్ట్రపతి ఎట్‌హోం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అప్పులపై రాష్ట్రాలకు కేంద్రం స్వేచ్ఛనివ్వాలి


» మూలధన వ్యయంలో రాష్ట్రాలకు ఏటా రూ.2.5 లక్షల కోట్లు ఇవ్వాలి
» జైసల్మేర్‌లో జరిగిన కేంద్ర ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీసుకునే విషయంలో రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని, షరతులు, ఆంక్షలను తొలగించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన శుక్రవారం రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో జరిగిన కేంద్ర బడ్జెట్ ముందస్తు సమావేశం(ప్రీ బడ్జెట్)లో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ అభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే అప్పులు తీసుకోవడంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని భట్టి అన్నారు. రాష్ట్రాల అప్పులపై ఆంక్షలు, షరతులను తొలగించాలని, అప్పుడే అవి ఆర్థిక పరిపుష్టిని సాధిస్తాయన్నారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, దేశీయ ఆర్థిక మందగమనం వంటి పరిస్థితుల్లో మూలధన వ్యయం విషయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దృష్ట్యా... మూలధన వ్యయం కింద రాష్ట్రాలకు ప్రత్యేక సహాయంగా ఏటా రూ.2.5 లక్షల కోట్లను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రానికి జనాభా ఆధారంగా సీఎస్ఎస్‌ల నిధులను కేటాయించాలని, ఎలాంటి వివక్ష లేకుండా వెంటనే నిధులను విడుదల చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 లోని సెక్షన్ 94(2) ప్రకారం.. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధి కింద రాష్ట్రానికి రావాల్సిన రూ.1800 కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ పథకాన్ని మరో ఐదేళ్ల పాటు కొనసాగించాలని కోరారు. దేశ పన్నుల వ్యవస్థను సరళీకృతం చేయాలని, ముఖ్యంగా ఆదాయ పన్నులో సంస్కరణలు చేపట్టాలని అన్నారు. జీఎస్టీ, ఐటీ రిటర్నుల దాఖలు ప్రక్రియను సులభతరం చేయాలని, పారిశ్రామిక శిక్షణ సంస్థల(ఐటీఐ) ద్వారా కృత్రిమ మేధ(ఏఐ), ఎలక్ట్రానిక్స్ వంటి ఆధునిక కోర్సులను అందిస్తూ, యువతలో నైపుణ్యాన్ని పెంచాలని అన్నారు. గిగ్ వర్కర్ల సామాజిక భద్రతకు జాతీయ స్థాయి విధానాన్ని తీసుకురావాలన్నారు.

## ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నేడు ప్రపంచ ధ్యాన దినోత్సవం

యోగా, ధ్యానంపై దృష్టి పెట్టాలంటున్న గురువులు



### మానసికోల్లాసం కోసం..


యోగా, ధ్యానాల గురించి తెలియని వారు కూడా ఇంకా ఉన్నారని, దీనిని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పి అందరికీ అవగాహన కల్పించడం గొప్ప సంకల్పమని ఐక్యరాజ్య సమితి అభిప్రాయ పడింది. యోగా అనేది శారీరానికి ఉల్లాసాన్ని ఇస్తే.. ధ్యానం అనేది మనస్సుకు ఉల్లాసాన్ని ఇస్తుంది. ఈ రెండింటినీ నిపుణులు ధ్రువీకరించారు. ఈ సాధనాలు అత్యంత అవసరమని గుర్తించారు. ఇవి శరీర భంగిమ, వశ్యత, సత్తువ, ఏకగ్రతలను మెరుగుపరుస్తుందని యోగా గురువులు చెబుతున్నారు.

### అంతర్జాతీయ స్థాయిలో ధ్యాన దినోత్సవం

ప్రపంచ వ్యాప్తంగా ధ్యాన దినోత్సవాన్ని జరిపేందుకు ఐక్యరాజ్య సమితి డిసెంబరు 21వ తేదీని ఖరారు చేసింది. ఈ క్రమంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని శనివారం జరపనున్నారు. ప్రతి మనిషి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నారంటే.. అది కేవలం మానసికంగా బాగా లేకపోవడం వల్లనేనని మానసిక వైద్యులు, శాస్త్రవేత్తలు, యోగా గురువులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మానసిక బాధలను జయించడానికి ఏకైక సాధనం యోగా ధ్యానాలేనని చెబుతున్నారు. అందుకే ఈ రెండింటికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చింది. వాటికి ప్రత్యేక రోజును కేటాయించారు. ఈ రెండూ నిత్యం చేస్తే ప్రతి మనిషి ఆరోగ్యంగా జీవిస్తారని చెబుతున్నారు.

### యోగా, ధ్యానాలతో ప్రయోజనాలు..

మనస్సును, శరీరాన్ని సమన్వయం చేయడం, స్థూల శరీరం.. సూక్ష్మ శరీరాన్ని అనుసందానం చేయడం. ఇంకా లోతుగా చెప్పాలంటే... జీవాత్మను పరమాత్మలో కలపడమే యోగంగా యోగా గురువులు అభివర్ణిస్తున్నారు. యోగా ధ్యానాలతో అనేక ప్రయోజనాలున్నాయని చెబుతున్నారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుకు ఎంతగానో దోహద పడుతుందని, దీర్ఘకాలిక వ్యాధులైన మధుమోహం, రక్తపోటు వంటి వాటి నుంచి ప్రమాదం లేకుండా చేస్తుందని చెబుతున్నారు. యోగా, ధ్యానాలతో మానసిక సమస్యలు కూడా తొలిగిపోతాయని అంటున్నారు. యోగా ద్వారా మనోధైర్యాన్ని పెంపొందించుకోవచ్చని, తద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గురువులు చెబుతున్నారు. వైద్యశాస్త్రంలో అంతుచిక్కని వ్యాధులు సైతం యోగాధ్యానాల ద్వారా నయమైన సందర్భాలు లేకపోలేదని స్పష్టం చేస్తున్నారు.



భూపాలపల్లి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోట్లు సంపాదిం చినా.. ఆరోగ్యం గా లేక పోతే అన్నీ కోల్పోయినట్లే నని అం టారు పెద్దలు. ఇది అక్షర సత్యమని అంటున్నారు నిపుణులు. అందుకే ఆరోగ్యమే... మహాభాగ్యం అన్నారు పెద్దలు. యోగా గురువులు కూడా ఆరోగ్యాన్ని మించిన సంపద లేదని బోధిస్తూనేఉన్నారు. ఎంత సంపాదించినా కూటికే.. చివరకు వెళ్లేది కాటికే... రెండింటి మధ్య మన జీవితం ఆరోగ్యంగా ఉండటమనేది ఎంతో ముఖ్యమని కూడా చెప్పారు మహర్షులు. ఇదే స్ఫూర్తితో యునైటెడ్ నేషన్స్ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభించింది. ఇప్పుడు కొత్తగా ధ్యాన దినోత్సవాన్ని సైతం అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేకంగా ఓ రోజు ఉండాలని డిసెంబరు 21ని ఐక్యరాజ్యసమితి ప్రపంచ ధ్యాన దినోత్సవంగా గుర్తించింది.


### తప్పకుండా పాటిస్తేనే ఫలితాలు



యోగా శారీరానికి, మనస్సుకు ఎంతో ఉల్లాసాన్ని ఇస్తుంది. దీని ద్వారా అనేక రోగాలు నయమవుతాయి. తు.చ. తప్పకుండా పాటిస్తేనే ఫలితాలు కనిపిస్తాయి. అలాగే శాఖాహార భోజనం భుజిస్తే ఇంకా మంచిది. యోగా గురువుల వద్ద శిక్షణ పొంది, రెగ్యులర్ సాధన చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. జీవితాన్ని సవ్యంగా నడుపుకోవచ్చు. వర్షకాలం, శీతాకాలంలో వాతావరణ తీవ్రతను తట్టుకోవడానికి ఈ యోగా ఎంతగానో ఉపయోగపడుతుంది.

- చెరుకుపల్లి రవీందర్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్, భూపాలపల్లి

### యోగాధ్యానాలతో జీవితం సార్థకం



ప్రతీ మనిషి యోగా ధ్యానాలు చేస్తే జీవితం సార్థకమవుతుంది. మానసిక రుగ్మతలనే కాకుండా జీవితంలో తలెత్తుతున్న సమస్యలను సైతం సునాయసంగా పరిష్కరించగలిగే శక్తి వస్తుంది. ఇది ప్రయోగాత్మకంగా చేస్తేనే ఫలితం ఉంటుంది.

- యాసోజు మాధవాచారి, శ్రీపరివార్ యోగాచార్యులు భూపాలపల్లి

## 'భూభారతి'కి.. సర్వే సంకటం!

(3వ పేజీ తరువాయి)

ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని సర్వే, రికార్డు కార్యాలయాల్లో 83మంది విధులు నిర్వంచాల్సి ఉండగా, కేవలం 44మంది మాత్రమే ఉన్నారు. మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు జిల్లాలో సర్వే ల్యాండ్ రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) కార్యాలయంలో పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఏడీ, సూపరింటెండెంట్‌తో పాటు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, డ్రాఫ్ట్‌మెన్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు నుంచి చివరకు అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడీ, సూపరెంటెండెంట్లు మాత్రమే భూపాలపల్లి నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి ములుగు జిల్లాలో పని చేస్తున్నారు. దీంతో సర్వే, రికార్డు కార్యాలయాల్లో ఏం జరుగుతుందో ఎవరికి తెలియటం లేదనే విమర్శలున్నాయి. అలాగే మహ బూబాబాద్ జిల్లాలో ఏడీ కార్యాలయంలో ఇద్దరు సర్వేయర్లు, ముగ్గురు డిప్యూటీ సర్వేయర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వరంగల్ జిల్లా ఏడీ కార్యాలయంలో ఎనిమిది మంది విధులు నిర్వహించాల్సి ఉండగా, పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. డిప్యూటేషన్‌పై ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. జనగామ జిల్లాలో మొత్తం 14పోస్టులకు సగం ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లాలో 15మంది ఉండాల్సి ఉండగా, 8మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. హనుమకొండ జిల్లా ఏడీ కార్యాలయంలో 21మంది ఉండాల్సి ఉండగా 14మంది పని చేస్తున్నారు. మరో ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కీలకమైన ఏడీ కార్యాలయాల్లోనే సర్వేయర్ల కొరత ఉండటంతో అన్ని జిల్లాల్లో భూముల కొలతలో పాటు ప్రభుత్వ ప్రాజెక్టు కోసం భూసేకరణ, మైనింగ్ తదితర పనులకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా సర్వేయర్లను తీసుకుంటామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించినప్పటికీ, ఎప్పటిలోగా రిక్రూట్‌మెంట్ పూర్తి చేస్తారో అనేది ఉత్కంఠగా మారింది. మొత్తానికి ఇప్పటికే సర్వేయర్ల కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు కొత్తగా తీసుకవచ్చిన భూభారతితో భూక్రయవిక్రయాలకు ముందే.. భూముల సర్వే చేస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తారని పేర్కొనటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

### సర్వేయర్ల కొరత తీరుతుందా?

రాష్ట్రవ్యాప్తంగా సర్వేయర్ల కొరత ఉన్న నేపథ్యంలో.. భూభారతి అమలుకు అడ్డంకులు లేకుండా చూసేందుకు గాను వెయ్యి మందిని సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లుగా నియమించబోతున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. ఆయన ప్రకటనతో ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌లో ఉన్న సర్వేయర్ల కొరత తీరుతుందని ఆశిస్తున్నారు. ఈ నియామకాలతో భూభారతి అమలు, భూముల రిజిస్ట్రేషన్లకు ముందు జరిగే ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు ఉండవని భావిస్తున్నారు.

## నేడు అతిపొడవైన రాత్రి!


**మధ్యాహ్నం 2.49గంటల నుంచే వెలుతురు తగ్గుతుందట**

**ఖగోళంలో అరుదైన ఆవిష్కరణపై సర్వత్రా చర్చ**

మహబూబాబాద్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : 2024 ఏడాది చివరాంకాన.. శనివారం ఖగోళంలో అరుదైన ఆవిష్కరణ చోటు చేసుకోబోతోందని, శనివారం అతిపొడవైన రాత్రి ఉండబోతోందని, మధ్యాహ్నం 2:49 గంటల నుంచే సూర్యుడి వెలుగు తగ్గి చీకటివైపు పయనిస్తుందని కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో సమాచారం చక్కర్లు కొడుతోంది. దీంతో శనివారం ఏం జరగబోతోం దనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. శాస్త్రజ్ఞుల అంచనాల మేరకు ఈ అరుదైన అయనాంతం దేనికి సంకేతమ నే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విజ్ఞానశాస్త్రంపై ఆసక్తి కలిగిన విద్యార్థి, యువతతో పాటు పెద్దవారు సైతం తమకు తెలిసిన శాస్త్రవేత్తలు, సైన్స్ కమ్యూనికేటర్లను సంప్రదిస్తున్నారు. అయితే అంతరిక్షంలోకి అడుగులు వేస్తూ అనేక ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో కొత్తపుంతలు తొక్కుతున్న నేపథ్యంలో ఇది కాలానుగుణంగా జరిగే సహజ అంశమే అని కొందరు విజ్ఞానవంతులు కొట్టిపారేస్తున్నారు. దీంతో సుదీర్ఘకాలం కిందట స్కైలాబ్, ఇతర ఉత్రా శకలాలపై వచ్చి న ఊహాగానాలను గుర్తుచేసుకుంటున్నారు. ఏదేమైనా శీతాకాలంలో ఏర్పడుతున్న ఈ ఆవిష్కరణను శీతాకాలపు అయనాంతంగా పేర్కొంటారని సైన్స్ పరిశోధకులు అంటున్నారు. అసలు ఈ ఆవిష్కరణ ఏంటి? అయనాం తం అంటే ఏంటి? శనివారం ఏం జరగబోతోందనే విష యాలను తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' మహబూబా బాద్ జిల్లా సైన్స్ కమ్యూనికేటర్ పూరె గురునాథరావును సంప్రదించింది. ఆయన తెలిపిన పలు వివరాలు..

### మధ్యాహ్నం 2.49 గంటల నుంచి..

సోల్సిస్ సమయం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 2.49 గంటల నుంచి భూమి సూర్యుడి మధ్య వ్యత్యాసం పెరగడంతో చీకటి ప్రారంభమై వెలుతురు తగ్గిపోతుందని సైన్స్ కమ్యూనికేటర్ గురునాథరావు చెబుతున్నారు. సోల్సిస్ అనేది భూగోళం అక్షంపై భూగ్రహం ప్రయాణిస్తున్నప్పుడు సూర్యుడు ఆ దిశలో అత్యంత దూరంగా లేదా.. దగ్గరగా ఉండే క్షణాన్ని సూచిస్తుందని, ఇది సూర్యుడి కిరణాలు భూమి మధ్య కోణాన్ని ప్రభావితం చేస్తుందని, ఫలితంగా వార్షిక కాల సీజన్‌ల మార్పులు జరుగుతాయని ఆయన తెలిపారు. దక్షిణగోళంలో అత్యం త దూరంగా ప్రయాణించే సూర్యుడు మన దేశ సమయం ప్రకారం శనివారం మధ్యాహ్నం 2.49గంటలకు దిశాబద్ధంగా దూరమవడం ప్రారంభమవుతుందని, సమ్మర్ సోల్సిస్ ప్రకారం.. ఉత్తరగోళంలో అత్యంత దగ్గరగా.. దక్షిణగోళంలో అత్యంత దూరంగా ఉంటాడన్నారు. ఈ క్రమంలో ఉత్తరగోళంలో వేసవికాలం ప్రారంభమైతే.. దక్షిణగోళంలో శీతాకాలం ప్రారంభమవుతుందన్నారు. వింటర్ సోల్సిస్ ప్రకారం.. సూర్యుడు దక్షిణగోళంలో మరింత కాంతిని ప్రసరించడాన్ని సూచిస్తుంది. దీంతో ఉత్తరగోళంలో అత్యంత చిన్నరోజు అంటే చిన్న ఉదయం.. ఎక్కువ రాత్రి ఉంటుందని తెలిపారు. ఇక ఈ ఏడాది డిసెంబర్ 21న శీతాకాల సూర్యాయనం చోటు చేసుకుంటుందని, ఇది ఉత్తరగోళంలో అతిచిన్న రోజుగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇదేరోజు అతిపొడవైన రాత్రిని కూడా చూడగలుగుతామని, భూమి అక్షం తన 23.5 డిగ్రీల కోణంలో తిరుగుతుండగా.. ప్రకృతిపరంగా ఒక అందమైన శక్తివంతమైన మార్పును చూపుతుందన్నారు. ఏదేమైనా నేటి శీతాకాలపు అయనాంతాన్ని ఆస్వాదించాలని ప్రతీ ఒక్కరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




సూర్యుడి చుట్టు భూ పరిభ్రమణ దృశ్యాలు (ఫైల్)



గురునాథరావు

## 10వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రాజ్‌పుత్‌వాడలో డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న వెంకటేశ్వర్లు

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 10వ డివిజన్ రాజ్‌పుత్‌వాడలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ తోట వెంక టేశ్వర్లు శుక్రవారం రూ.10లక్షల నిధులతో సైడ్ డ్రైయినేజీ, రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడు తూ...గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా హనుమకొండ చౌరస్తాకు కూత వేటు దూరంలో ఉన్న 10వ డివిజన్ ఆశించినంత అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 10వ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. డివిజన్ ప్రజల సహాయ సహకారాలతో మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానికులు ఠాకూర్ నారాయణసింగ్, బ్రిజ్‌కుమార్‌సింగ్, భరత్‌సింగ్, రాంరతన్‌సింగ్, కె.సోమిరెడ్డి, రామకృష్ణారెడ్డి, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

## ఎన్ఐఎఫ్‌టీలో అడ్మిషన్లు ప్రారంభం

వడ్డేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టీ) టెక్నాలజీలో 2025 జులై నుంచి ఈ విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని ఎన్ఐఎఫ్‌టీ డైరెక్టర్ ఏ. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు డైరెక్టర్లు డాక్టర్ చక్రపాణి, నరేష్‌కుమార్ మాట్లాడారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఫ్యాషన్, టెక్స్‌టైల్, లెదర్, యాక్సెసరి డిజైన్లు, నిట్‌వేర్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ టెక్నాలజీ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివరాలకు 9440480856 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



అఖండ జ్యోతి వెలిగించి ర్యాలీని ప్రారంభిస్తున్న నాయిని నీలిమారెడ్డి

## 'ధ్యానంతో మానసిక ప్రశాంతత'

వడ్డేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మానసిక ప్రశాంతతకు ధ్యానం దోహద పడుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి అన్నారు. వరంగల్ పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ వ్యవస్థాపకుడు సుభాష్ పత్రిజీ ఆశయాల మేరకు శుక్రవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె అఖండ జ్యోతిని వెలిగించి, జెండా ఊపి అంతర్జాతీయ ధ్యాన మహోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు జున్నూతుల కిషన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లూనావత్ యాకూబ్‌నాయక్, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు బంక సరళ సంపత్‌యాదవ్, జిల్లా నేత మండల సమ్మయ్య పిరమిడ్ ప్రతినిధులు అంజలిదేవి, రమాదేవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ అంబేద్కర్ విగ్రహం సర్కిల్, అదాలత్ సెంటర్ మీదుగా హంటర్‌రోడ్డులోని రామకృష్ణ పిరమిడ్ ధ్యాన కేంద్రం వరకు సాగింది.

## పాలక మండలి కోసం రీ నోటిఫికేషన్

వరంగల్ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ భద్రకాళి దేవస్థానం పాలక మండలి నియామకం కోసం మూడు నెలల క్రితం జారీ చేసిన నోటిఫికేషన్ రాజకీయ ఒత్తిళ్లతో రద్దు కావడంతో ప్రభుత్వం మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసింది. మొదటిసారి 28 పేర్లతో లిస్టు తయారు చేసి పోలీసు వెరిఫికేషన్ అనంతరం జాబితాను దేవాదాయ శాఖ అధికారులు హైదరాబాద్ కమిషనరేట్ కార్యాలయానికి పంపారు. అయితే పాలకమండలి సభ్యుల నియామకంలో రాజకీయ ఒత్తిళ్లనేపథ్యంలో నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్లు తెలిసింది. దీంతో మళ్లీ కొత్తగా నోటిఫికేషన్ జారీ చేశారు. దీనికి ఈనెల 25 చివరి తేదీ కావడంతో ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఈసారైనా భద్రకాళి దేవస్థానం పాలక మండలి ఏర్పాటవుతుందా కాదా అని భక్తులు ఎదురు చూస్తున్నారు.

## విజ్ఞాన భారత్ నిర్మాణంలో విద్యార్థులే కీలకం

▸▸ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్‌గౌడ్

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన భారత్ నిర్మాణంలో విద్యార్థులే కీలకమని వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్వకేట్ తీగల జీవన్‌గౌడ్ అన్నారు. సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సామాజిక వేత్త, న్యాయవాది గంధం శివ తల్లిదండ్రులు గోపాల్ సారమ్మల జ్ఞాపకార్థం 10వ తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా జీవన్‌గౌడ్ హాజరై విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతశిఖరాలకు ఎదగాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ సురేష్, కాంగ్రెస్ నాయకులు కూరాకుల భారతి, అడ్వకేట్ ఎర్రం శివశంకర్, హనుమకొండ ఎంఈవో నెహ్రూనాయక్ పాల్గొన్నారు.



బ్యాలెన్సింగ్ బీమ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణిలు

## హోరాహోరీగా సాగుతున్న జిమ్నాస్టిక్స్

▸▸ 18 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారుల హాజరు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జేఎన్ఎస్‌లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. శుక్రవారం అండర్-14 బాలబాలికల విభాగంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీ ప్రదర్శించారు. హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ జిమ్నాస్టిక్స్ హాల్ లో జరుగుతున్న క్రీడా పోటీల ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర స్థాయిలో జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, బ్యాలెన్సింగ్ బీమ్, ప్యారలాల్‌బార్స్, టేబుల్‌వాల్ట్, అర్జెంటల్‌బార్, రోమన్‌రింగ్స్, పామెల్‌హార్స్ అన్‌ఇవన్‌బార్, క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా రాష్ట్ర వ్యాప్తంగా 18జిల్లాల నుంచి 150మంది బాలబాలికల పాల్గొనడం జరిగిందన్నారు. ఇక్కడ క్రీడా పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుణి క్రీడా ప్రదర్శన ప్రత్యేక సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, అఫ్జల్, జీవన్, విష్ణు, రాజు, ప్రశాంత్, వెంకటేశ్వర్లు, పీఈటీలు, పీడీలు, టెక్నికల్ అఫీషి యల్స్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లీగల్ సెల్ కమిటీ తాత్కాలికంగా నిలిపివేత

వరంగల్ లీగల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ కమిటీ నియామకాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన జారీ చేశారు. ఈ నెల 17న హనుమకొండ జిల్లాకు కాంగ్రెస్ లీగల్‌సెల్ కమిటీని నియమించామని సదరు నియామకం తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు నిలిపి వేస్తున్నట్లు ఆయన ప్రకటనలో తెలిపారు.

# కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

వడ్డేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అమిత్‌షా అంబేద్కర్‌ను అవమాన పరిచినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని, మాల మహానాడు రాష్ట్ర నేత, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పనికెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అమిత్‌షాను వెంటనే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మాల మహానాడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టి బొమ్మను హనుమకొండలోని అంబేద్కర్ సర్కిల్‌లో దహనం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దండు మోహన్, పానుగంటి లక్ష్మీనారాయణ, సాధు కుమారస్వామి, సురాసి విక్రమ్, కాళేశ్వరపు రాము, కూనమల్ల అనిత, దాసరి రాజేశ్వరి, ఆకుల సుగుణ, సంపతి రఘు, కడారి కుమార్, గూడెపు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

● అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, జిల్లా నాయకులు రాచపుడి యువన్, భాను, రాహుల్, అజయ్, మహేష్, సాగర్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు.

● అమిత్‌షాపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి తిరుపతయ్య డిమాండ్ చేశారు. హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాస్వామిక సంస్థల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, ప్రజా సంఘాల నాయకులు కుమారస్వామి, అరసం వీరస్వామి, కరేటి శంకర్‌యాదవ్, ఎండీ రాజ్‌మహ్మద్, ఉప్పుల శివ, ప్రొఫెసర్ వీరస్వామి, హరికృష్ణ, రమాదేవి, ప్రవీణ్‌కుమార్, దిలీప్ తదిరులు పాల్గొన్నారు.

### అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

మడికొండ: కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో బాబాసాహెబ్ అంబేద్కర్‌పై వ్యంగ్య వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మడికొండలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానిస్తూ మాట్లాడిన అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జవ్వాజి కిషన్, ఎ.కుమారస్వామి, జానపట్ల సారయ్య, కట్ట వెంకట్రాంనర్సయ్య, బండారి వెంకటస్వామి, జిట్ల అనిల్, నెలకంటి వెంకట్, కిన్నెర నరేష్, పసుల గణేష్, పవన్‌కుమార్, ఎలగొండ శివ, మూల వీరస్వామి, మూల వెంకటస్వామి, కట్ట రాజ్‌కుమార్, పెంట స్వామి, మద్దెల రమ, జె.విమల, కనకలక్ష్మి, యాకలక్ష్మి పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాస్వామ్య సంస్థల నేతలు

● కాజీపేట : అంబేద్కర్‌ను అవమానపర్చేలా మాట్లాడిన అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని కాజీపేట చౌరస్తాలో శుక్రవారం తేజోమయి మాల కుల సంక్షేమ సంఘ నాయకులు ధర్నా చేశారు. అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి బండి విజయ్ కుమార్ మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగంగానే ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి పప్పు గోవర్ధన్, నాయకులు తండమల్ల వేణు, సత్యనారాయణ, బండి రాంచందర్, వి. రాజేశ్, జానపట్ల యాదగిరి, బి. ఉప్పల్, మర్యాల ప్రవీణ్, బొబ్బిలి రాజేందర్ పాల్గొన్నారు.

## కెమిస్ట్, డ్రగ్గిస్ట్ ఎన్నికల సందడి

వరంగల్ మెడికల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ (2005-2008) ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైంది. ఫిబ్రవరి 9వ తేదీన పోలింగ్ జరగనుంది. జనవరి 17, 18 తేదీల్లో నామినేషన్ పత్రాలు స్వీకరించి, 18న సాయంత్రం 5 గంటలకు ఉపసంహరణ గడువుగా ప్రకటించారు. జనవరి 16వ తేదీన ఓటరు లిస్టును ప్రకటించడం జరుగుతుంది. నామినేషన్ పత్రాలను రూ. 5వేలు చెల్లించి పొందాల్సి ఉంటుంది. ఈ నెల 31లోగా నూతన సభ్యులు తమ పేర్లు రూ. 1000 చెల్లించి నమోదు చేసుకోవాలి. రెన్యూవల్ సభ్యులు రూ. 500 చెల్లిస్తే సరిపోతుందని జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మృత్యుంజయరెడ్డి, కార్యదర్శి శ్రీరామ్ రావు, కోశాధికారి కమలాకర్‌లు పేర్కొన్నారు.

## ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

▸▸ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలోని పరిశరాలను పరిశుభ్రంగా ఉంచాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు. శుక్రవారం హను మకొండ గోపాల్‌పూర్‌లోని ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గోపాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 2 జాతీయ నాణ్యతా ప్రమాణాల గుర్తింపు ఎంపిక జరగడం అభినందనీయమన్నారు. హైపర్ టెన్షన్ 822, డయాబెటిస్ 448, క్యాన్సర్ 2 మొత్తం దాదాపుగా 1300 మంది వ్యాధిగ్రస్తులకు వైద్య చికిత్సలు ఉచితంగా అందిస్తున్నామని ఇంకా ప్రభుత్వం అందించే వైద్య సౌకర్యాలను వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజేందర్‌రెడ్డి, ఆయూష్ మెడికల్ ఆఫీసర్ ఈశ్వర్, ప్రసాద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## కాజీపేటలో సీపీఐ వార్షికోత్సవం

కాజీపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ఏఆర్ఆర్ కాలనీలో శుక్రవారం సీపీఐ 99వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలకు సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు రాసమల్ల దీన, నాయకులు పార్టీ జెండా ఎగురవేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27న 200 మంది ఎర్ర చొక్కాలు ధరించి వేయి స్తంబాల ఆలయం నుంచి హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ర్యాలీకి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు శంకర్ నాయక్, బి. రాజమణి, మణెమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● మడికొండ (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లో సీపీఐ వార్షికోత్సవాన్ని పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. భూమి లేని నిరుపేదలకు భూములు పంచడానికి భూపోరాటాలు చేసిన ఏకైక పార్టీ సీపీఐ అని కొనియాడారు. 99 సంవత్సరాలు పూర్తి చేసుకొని 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సీపీఐ ఈనెల 30న నల్గొండ జిల్లాలో శత జయంతి ఉత్సవాలకు తరలి రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శంకర్ నాయక్, నాయకులు మునిగాల భిక్షపతి, మునిగనాల ఐలయ్య, దామర వెంకటయ్య, కొయ్యడ కుమార్, మేకల మనోహర్, ఇల్లందుల పద్మ, లకావత్ లక్ష్మి, మారగోని వరలక్ష్మి, మునిగాల రజిత, గడ్డం స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

హన్మకొండటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్షా(ఎస్ఎస్)లో 9 విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని గెజిటెడ్ హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు రవిందర్ అన్నారు. బాలసముద్రం ఏకశిలా పార్కు వద్ద కాంట్రాక్ట్ ఉద్యోగులు చేస్తున్న దీక్షలు శుక్రవారం 14వ రోజుకు చేరాయి. దీక్షలను గెజిటెడ్ హెచ్ఎంలు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రవిందర్ మాట్లాడుతూ ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులైజ్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. అప్పటి వరకు మినిమం టైం స్కేల్ ఇచ్చి వారికి ఉద్యోగభద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్ఎ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె చేస్తుండడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతుందన్నారు. కాగా, ప్రభుత్వం నుంచి తమకు స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె విరమించేది లేదని జేఏసీ నాయకులు దొనికెల శ్రీధర్‌గౌడ్, షఫీ, కుమార్‌లు స్పష్టం చేశారు. అవసరమైతే అమరణ నిరాహారదీక్షకు కూడా వెనుకాడబోమన్నారు. పీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు తమ దీక్షలను సందర్శించి ఇచ్చిన హామీని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. వెట్టిచాకిరికి గురవుతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

## మానసిక వికలాంగులను చేరదీయాలి

▸▸ జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారద

హనుమకొండ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : 2001 సంవత్సరం నుంచి మల్లికాంబ మనోవికాస సంస్థ ద్వారా ఎంతో మంది మానసిక వికలాంగుల విద్యార్థులను చేరదీయడం మహోన్నత విషయమని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సత్యశారద అన్నారు. శుక్రవారం హనుమకొండలోని బాలసముద్రంలో రామోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 70 లక్షలతో నిర్మించిన భవనాన్ని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రభాకర్‌రెడ్డి దంపతులతో కలిసి సత్యశారద ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ మానసిక వికలాంగులను చేరదీయడాన్ని చూసి సంస్థ నిర్వాహకులను అభినందించారు. జిల్లా రిటైర్డ్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో దివ్యాంగులను ఆదరించి వారికి కావల్సిన సదుపాయాలను కల్పించడంపై మల్లికాంబ మనోవికాస సంస్థ నిర్వాహకురాలు బండ రామలీలను అభినందించారు. 2001 నుంచి ప్రభుత్వ అనుమతితో సంస్థను నడుపుతూ నేడు 200 మంది విద్యార్థిని, విద్యార్థులకు సేవలందించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మజా, కోవడం కల్యాణ్, బండ సదానందం, యాదగిరి, హనుమకొండ, వరంగల్ జిల్లా సీడబ్ల్యూసీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వృద్ధులు, దివ్యాంగులు ధైర్యంగా ఉండాలి

▸▸ అదనపు డీసీపీ రవి





వృద్ధురాలికి దుప్పట్లు అందజేస్తున్న అదనపు డీసీపీ రవి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ధైర్యంగా ఉండాలని, మీ రక్షణకు పోలీస్ శాఖ తోడ్పడుతుందని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ రవి అన్నారు. ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సమితి, వనం మహిళా సంఘం ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతో శుక్రవారం సుబేదారిలోని అసుంత భవన్‌లో సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు డీసీపీ రవి హాజరై వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రతీ ఒక్కరికి జత దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ఎఫ్ఎంఎం సంస్థ ద్వారా చేస్తున్న కార్యక్రమాలతో వృద్ధులు మరింత సంతోషిస్తారన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ధైర్యంగా ఉండాలన్నారు. జిల్లా సంక్షేమఅధికారి జయంతి మాట్లాడుతూ ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందని, ఎవరైనా ప్రభుత్వ పథకాలను అందుకోలేని స్థితిలో ఉంటే తమ శాఖను నేరుగా సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, కాజీపేట రైల్వే ఇన్‌స్పెక్టర్ సంజీవరావు, ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, వనం మహిళా సంఘం సీఈవో సిస్టర్ నిర్మల, ఎఫ్ఎంఎం సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీకాంత్, జిల్లా బాలల సంక్షేమ అధికారి ప్రవీణ్ కుమార్, బాలరక్షణ భవన్ కోఆర్డినేటర్ అవంతిక, ఫైనాన్స్ మేనేజర్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని చలికి దుప్పట్లు కొనుక్కోలేని పేదలకు శుక్రవారం సాయంత్రం చక్రి ఫౌండేషన్ ఫౌండర్ చెట్టిపల్లి దేవిక దుప్పట్లు పంపిణీ చేశారు. హనుమకొండలోని సుబేదారి, అదాలత్ జంక్షన్, వడ్డెపల్లి తదితర ప్రాంతాల్లోని సుమారు 30 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు.

## ఎస్‌వీఎస్‌లో టెక్ క్వెస్ట్ వేడుకలు

హసన్‌పర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమారం ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే టెక్ క్వెస్ట్-24 వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిశోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు చక్కటి సంస్కారాన్ని అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదలతో విజయం సాధించవచ్చన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని ప్రపంచంలో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్స్, పోస్టర్లు, ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్, ఐడియేషన్లను పరిశీలించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న కళాశాల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు, బోధన సిబ్బందిని అభినందించారు. అనంతరం విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. విద్యారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ మనన్ భట్, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, డీఎస్పీ సైదులు, ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, పీఆర్‌వో నాగేశ్వర్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో బెదిరింపులు తగదు

▸▸ కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్

▸▸ కేయూలో విద్యార్థులు, పోలీసుల మధ్య తోపులాట

▸▸ కేటీఆర్‌పై కేసు నమోదుపై భగ్గుమన్న విద్యార్థులు



బీఆర్ఎస్వీ నేత ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో బెదిరింపులు తగదని కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుపై కేసు నమోదుపై వర్సిటీలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. శుక్రవారం కేయూ మొదటి గేటు ఎదుట బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ నేతృత్వంలో బీఆర్ఎస్వీ నేతలు నిరసనకు దిగారు. ఆందోళన చేపట్టిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు విద్యార్థులకు స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని వర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద పెట్టున నిరసన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బైరపాక ప్రశాంత్, బీఆర్ఎస్వీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాచర్ల శరత్‌చంద్రలు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి కావాలనే కక్ష పూరితంగా కేటీఆర్‌పై ఫార్ములా కేసును నమోదు చేయించారని ఆరోపించారు. కేటీఆర్‌పై కేసు సిగ్గుమాలిన చర్య అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి డైవర్టు పాలిటిక్స్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు తూట్లు పొడిచి బీఆర్ఎస్‌పై కక్షకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. ఫార్ములా రేస్‌ను హైదరాబాద్‌కు తెచ్చిన ఘనత కేటీఆర్‌కు దక్కుతోందని చెప్పారు. ఫార్ములా రేస్‌తో రాష్ట్రంలో టూరిజం, ఇతర వసతులు పెరిగి రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తోందని వివరించారు. కాంగ్రెస్ 420 హామీలు, మూసీ రూ.1.5 కోట్ల కుంభకోణం, రూ, 1.137 కోట్ల అమృత్ టెండర్ల కుంభకోణం, కొడంగల్ లిఫ్ట్ పనులకు రూ.4కోట్ల కుంభకోణాలను కేటీఆర్ బట్టబయలు చేసినందుకు అక్రమ కేసు నమోదు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనలో గురుకుల విద్యార్థుల ఫుడ్ పాయిజన్‌తో 55 మంది చనిపోయారని, 950 మంది అస్వస్థతకు గురైయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. కొడంగల్, లగచర్ల, హైడ్రా బాధితుల తరుపున కేటీఆర్ కొట్లాడుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర వ్యాప్తంగా అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్లు డాక్టర్ అరూరి రంజిత్‌కుమార్, పిల్లల నాగరాజు, నాయకులు కలకోట సుమన్, గొల్లపల్లి వీరస్వామి, రాసురి రాజేశ్, మహేశ్, రాజు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు ఏసీపీ కౌన్సెలింగ్

వరంగల్ క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పీఎస్ పరిధిలోని రౌడీషీటర్లకు ఏసీ పీ దేవేందర్‌రెడ్డి శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సత్ప్రవర్తనతో ఉంటూ గతంలో ఉన్న నేర చరిత్రను తుడిపేసుకోవాలని సూచించారు. నేరాలు చేయడం మానుకొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. కాదని ఎప్పటిలాగే చట్ట వ్యతిరేఖ పనులకు పాల్పడతానంటే కఠినంగా శిక్షించడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ సతీష్, ఎస్సైలు అశోక్, సతీష్, పరుశురాములు, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

## 13 మంది జువైనల్ హోంకు తరలింపు

వరంగల్ క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడిన 13 మందిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి జువైనల్ హోంకు తరలిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 14 మందికి రూ.18,700 జరిమానా విధించారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని ముగ్గురు వాహనదారులకు రూ.1500 జరిమానా విధించడం జరిగిందన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన ఇద్దరికి ఒక రోజు కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష విధించడం జరిగిందని సీఐ తెలిపారు.

## భార్యను చంపిన భర్త

▸▸ కాజీపేట మండలం అమ్మవారిపేటలో ఘటన

మడికొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భార్యను ఉరివేసి చంపిన ఘటన కాజీపేట మండలంలో చోటు చేసుకుంది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మవారిపేట గ్రామానికి చెందిన మైదం కొమురయ్య కొంత కాలంగా ఏ పని చేయకుండా తాగుడుకు అలవాటు పడి కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. కొద్ది రోజుల క్రితం పంచాయితీలో పెద్ద మనుషులు కొమురయ్యను మందలించి పంపించారు. దీంతో కొమురయ్య అదే రోజు కుటుంబ సభ్యులతో అందరినీ చంపేస్తానని బెదిరించాడు. గురువారం సాయంత్రం భార్య సంతోష(55) మెడకు కొమురయ్య తాడుతో ఉరి వేసి లాగుతుండగా వారి కోడలు చూసి కేకలు వేయడంతో వదిలిపెట్టి పారిపోయాడు. అప్పటికే సంతోష మృతి చెందింది. మృతురాలి కుమారుడు మైదం రాజేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవు

▸▸ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

వరంగల్ క్రైం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నేరాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా హెచ్చరించారు. శుక్రవారం సుబేదారి పీఎస్ పరిధిలోని హౌజింగ్ బోర్డు కాలనీలో హనుమకొండ డివిజన్ పోలీసులతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్లు వాహనాలు నడపటం వల్ల కలిగే నష్టాలు, సైబర్ క్రైమ్ మోసాలు, డ్రగ్స్ గంజాయి సేవించడం ఇతర నేరాలు కాలనీల్లో జరుగుతున్నాయా అనే దానిపై ఆరా తీశారు. అనుమానితులు కాలనీల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ దేవేందర్ రెడ్డి, సీఐలు సతీష్, సత్యనారాయణరెడ్డి, రవికుమార్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుల అరెస్టు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకులను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో ఏఐఎస్ఎఫ్ నాయకులను హైదరాబాద్‌లోని వివిధ ఠాణాలను తరలించి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ల్లా నుంచి అరెస్టయిన వారిలో ఊట్కూరి ప్రణీత్ గౌడ్, బాషబోయిన సంతోష్, వేల్పుల చరణ్, కుక్కల కుమార్, కసరబోయిన రవితేజ, శ్రీపతి వినయ్, పాలక్ లవన్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
7
శనివారం • 21 డిసెంబరు 2024

# ఏడు రకాల అద్భుత అన్నాలు

అన్నం అనగానే మనకు తెల్లటి వరి అన్నం గుర్తుకొస్తుంది. కానీ మన ప్రాచీన గ్రంథాలలో దీనిని 'కేవలాన్నం' అంటారు. అంటే ఏ ఇతర పదార్థాలు కలపని అన్నం అని అర్థం. కేవలాన్నంలో ఇతర పదార్థాలను కలిపితే అవి అద్భుత అన్నాలు అవుతాయంటాడు భోజన కుతూహలం గ్రంథ రచయిత రఘునాథ సూరి. ఆ అన్నాలేమిటో తెలుసుకుందాం.



### పరమాన్నం

'తండుల త్రిగుణం దుగ్ధం దుగ్ధార్థం జీవనీయకమ్ తదర్థం! గుడచూర్ణంతు పరమాన్న మితి స్మృతమ్'

బియ్యానికి మూడు రెట్లు చిక్కని పాలు, పాలలో సగం నీళ్లు, ఆ నీళ్ళకు సగం బెల్లంపొడి ఈ కొలతలలో తీసుకుని వండినది పరమాన్నం.

### హరిద్రాన్నం

"సంస్కృతం మధితం గవ్యం తండులానాం చతుర్గుణం ఈషత్ హరిద్రయా యుక్తం
మరీచా జాజి సంయుతమ్ఖ హరిద్రాన్నం"

అంటే పసుపు అన్నం అని! ఇది పులిహోర కాదు ఒక రకం క్షీరాన్నమే! దీని తయారీకి బాగా శుద్ధి చేసి చిలికిన పాలను.. అవి నాలుగోవంతు అయ్యేదాకా మరిగించాలి. అప్పుడు బియ్యానికి నాలుగు రెట్లు ఎక్కువ ఈ పాలను పోసి.. దానిలో పసుపు, మిరియాలపొడి, జాజికాయపొడి వేయాలి. దీనిని నెయ్యి, బెల్లం నంజుకుంటూ తింటారు.

### దధ్యాన్నం

"మధురామ్లేన గోదధ్నా శుద్ధాన్నంతు విమిశ్రితంఖ
శాంశ్చ నిర్జిజ్యనిష్యేద్య షోడాభఃక్షాళయేద్ బుద్ధాఃఖ నిర్జిజ్య"

అన్నాన్ని వండటానికి తీసుకునే బియ్యాన్ని నీళ్లు పోసి చేతితో పిసుకుతూ.. కడగాలి. ఇలా 8 సార్లు కడగాలి. ఈ బియ్యం ఉడుకుతున్నప్పుడు దానిలో మిరియాలపొడి, అల్లం ముక్కలు, సైంధవ లవణం వేసి ఉడికించాలి. అన్నం వేడి తగ్గిన తర్వాత దానిలో శుద్ధమైన పెరుగు వేసి కలపాలి. పెరుగు మన శరీరానికి అవసరమైన మంచి సూక్ష్మక్రిములను అందిస్తుంది.

### కృశరాన్నం

బియ్యంలో సగం పెసరపప్పు కలిపి వండిన పులగం లేదా కటుపొంగలినే కృశరాన్నం అని కూడా అంటారు. దీనిని నేతితో వండుతారు.

### గుడోదనం

పాలలో సగం కొలతలో బెల్లం తీసుకుని అదే పాలలో కరిగించి పరమాన్నం వండుకోవాలి. ఈ పరమాన్నంలో నెయ్యి, చక్రకేళి పండ్ల గుజ్జు కూడా కలుపుతారు. పరమాన్నంలో కంటే ఎక్కువ బెల్లం.. అదనంగా నెయ్యి, అరటిపళ్లు కలుస్తాయి.

### ముద్గాన్నం

మూడు భాగాలు బియ్యం, ఒక భాగం పెసరపప్పు కలిపి తగినంత ఉప్పు వేసేది ముద్గాన్నం. ఇందులో రుచికి ఒక చెంచాడు నెయ్యి వేసుకుని తింటారంతే!

### భూతోదనం

'హృదయాధిప' అనే గ్రంథంలో పెరుగు, పసుపు, వేగించి విసిరిన పెసరపిండి, చక్కగా ఉడికిన అన్నం, కొద్దిగా ఆవపిండి కలిపిన అన్నాన్ని భూతోదన అంటారని భోజన కుతూహలం పేర్కొంది. ఉడికించిన కూరగాయ ముక్కలు కూడా ఇందులో కలుపుకుంటే ఇది అద్భుతమైన ఆహారం అవుతుంది.

● గంగరాజు అరుణాదేవి

# అవాంఛిత రోమాలతో ఇబ్బందా?

కొంతమంది మహిళలు అవాంఛిత రోమాలతో సతమతమవుతూ ఉంటారు. హార్మోన్ల అసమతౌల్యం వల్ల లేదా వంశపారంపర్యంగా ఈ సమస్య ఎదురవుతుంటుంది. దీంతో మహిళలు వ్యాక్సింగ్, థ్రెడింగ్ పద్ధతులు అనుసరిస్తూ ఉంటారు. వీటివల్ల విపరీతమైన నొప్పిని భరించాల్సి ఉంటుంది. అలాకాకుండా ఇంట్లో దొరికే వస్తువులతో కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు.

**చక్కెర-నిమ్మరసం:** ఒక గిన్నెలో రెండు చెంచాల చక్కెర వేసి వేడి చేస్తే చిక్కని ద్రవం ఏర్పడుతుంది. దీనిలో ఒక చెంచా నిమ్మరసం కలిపి ఈ మిశ్రమాన్ని అవాంఛిత రోమాలు ఉన్న చోట రాయాలి. అయిదు నిమిషాలు ఆరాక దానిమీద మెత్తని వస్త్రాన్ని పెట్టి గట్టిగా ఒత్తాలి. తరవాత వస్త్రాన్ని వెంట్రుకలు పెరుగుతున్న దిశకు వ్యతిరేకంగా లాగాలి. వెంట్రుకలన్నీ గుడ్డతోపాటే ఊడి వచ్చేస్తాయి.

**ఓట్స్-అరటిపండ్లు:** మిక్సీ గిన్నెలో అర కప్పు ఓట్స్ వేసి మెత్తని పొడిలా చేయాలి. ఈ పొడిని చిన్న గిన్నెలోకి తీసుకుని అరటి పండు గుజ్జు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, కాళ్లు, చేతులకు పట్టించి ఇరవై నిమిషాలు ఆరనివ్వాలి. తరవాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే అవాంఛిత రోమాలు క్రమంగా తొలగిపోయి మరల పెరగవు.



వంటిల్లు



క్రిస్మస్, కొత్త సంవత్సరం వచ్చేస్తున్నాయి. ఇంటికి ఎవరో ఒకరు వస్తూ ఉంటారు. అతిథులు వచ్చిన ప్రతిసారీ ఇడ్లీ, దోశలు మాత్రమే పెడితే ఏంబాగుంటుంది! అందుకే అందరూ ఇష్టంగా తినే ఆరోగ్యకరమైన చాట్‌లను ఎలా తయారుచేయాలో చూద్దాం.

# కిర్రెక్కించే చాట్‌లు



## చిలకడదుంప చాట్

**కావాల్సిన పదార్థాలు:**

ఉడకబెట్టి వేయించిన చిలకడదుంప ముక్కలు: ఒక కప్పు, చింతపండు రసం: నాలుగు చెంచాలు, నిమ్మరసం- ఒక చెంచా, చాట్ మసాలా- ఒక చెంచా, ఉప్పు- తగినంత, దానిమ్మ గింజలు- నాలుగు స్పూన్లు, తరిగిన కొత్తిమీర- ఒక స్పూను

**జాగ్రత్తలు**

- చిలకడదుంపలను ఎక్కువ ఉడకబెడితే ముద్దగా అయిపోతాయి. అందువల్ల తక్కువగానే ఉడకబెట్టాలి.
- కొందరు ఉడకబెట్టిన తర్వాత నెయ్యి వేసి వేయిస్తారు. అలా చేసినా రుచికరంగానే ఉంటుంది.

**తయారీ విధానం**

- చిలకడదుంపను బాగా కడిగి తొక్క తీసేయాలి. దానిని ముక్కలుగా తరగాలి. వాటిని కుక్కర్‌లో ఉడకబెట్టవచ్చు. లేదా నెయ్యి వేసి వేయించవచ్చు.
- ఒక గిన్నెలో చిలకడదుంప ముక్కలు, చింతపండు రసం, నిమ్మరసం, చాట్‌మసాలా, ఉప్పు వేసి బాగా కలపాలి. ఆ తర్వాత దానిమ్మ గింజలు, కొత్తిమీర పైన చల్లాలి.

## పాలకూర పకోడీ చాట్

**కావాల్సిన పదార్థాలు**

తరిగిన పాలకూర: ఒక కప్పు, శనగపిండి- అరకప్పు, నూనె- ఒక కప్పు, ఉప్పు- తగినంత, పెరుగు- ఒక కప్పు, చింతపండు రసం- రెండు చెంచాలు, జీలకర్ర పొడి- ఒక చెంచా

**జాగ్రత్తలు**

- పకోడీలపై పెరుగు, ఇతర పదార్థాలు వేసిన తర్వాత బాగా కలపకూడదు. దీనివల్ల పకోడీలు మెత్తపడిపోతాయి.
- పాలకూరలో శనగపిండిని కలపాలి. అవసరమైతే కొద్దిగా నీళ్లు చిలకరించాలి. అంతే తప్ప శనగపిండిలో పాలకూరను వేసి నీళ్లతో కలపకూడదు.

**తయారీ విధానం**

- పాలకూరను బాగా కడిగి దానిలో శనగపిండి, ఉప్పు వేసి కలపాలి.
- ఒక మూకుడులో నూనెను తీసుకొని, పాలకూర మిశ్రమాన్ని పకోడీల మాదిరిగా వేయించాలి. బయటకు తీసి ప్లేటులో ఉంచాలి.
- ఒక గిన్నెలో పాలకూర పకోడీలు వేయాలి. దానిపై పెరుగు, చింతపండు రసం, ఉప్పు, జీలకర్ర పొడి వేయాలి.

ఈ చాట్‌లన్నింటికీ చాట్ మసాలా అవసరమవుతుంది. ప్రస్తుతం మార్కెట్లో రకరకాల బ్రాండ్ల చాట్‌మసాలాలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఏ చాట్ మసాలానైనా వాడుకోవచ్చు.

## ఆలూటిక్కీ చాట్

**కావాల్సిన పదార్థాలు :**

బంగాళదుంప ముక్కలు- రెండు కప్పులు, కార్న్‌ఫ్లోర్- ఒక చెంచా, పచ్చి బఠానీలు- పావుకప్పు, పెరుగు- ఒక కప్పు, చింతపండు రసం- రెండు స్పూనులు, గ్రీన్ చట్నీ (కొత్తిమీర, పుదీనా, పుట్నాల పప్పు, నిమ్మరసంల మిశ్రమం)- రెండు చెంచాలు, కారప్పూస- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, చాట్ మసాలా- ఒక చెంచా, ఉప్పు- తగినంత

**జాగ్రత్తలు**

- టిక్కీల కోసం కార్న్‌ఫ్లోర్ అందుబాటులో లేకపోతే బియ్యపు పిండిని వేయవచ్చు.
- టిక్కీలను బాగా కరకరలాడేలా కాల్చకూడదు. కొద్దిగా మెత్తగా ఉంటేనే బావుంటుంది.

**తయారీ విధానం**

- బంగాళదుంపలను తొక్క తీసి బాగా ఉడికించాలి. పచ్చి బఠానీలను కూడా ఉడికించాలి. ఇవి రెండూ ఉడికి చల్లారిన తర్వాత ఒక గిన్నెలో బంగాళదుంపలు, పచ్చి బఠానీలు, ఉప్పు, కార్న్‌ఫ్లోర్ వేసి ముద్దగా చేయాలి.
- బంగాళదుంపల మిశ్రమాన్ని చిన్న ముద్దలుగా చేసి అరచేతిలో గుండ్రంగా ఒత్తాలి. వీటినే టిక్కీలంటారు.
- ఒక పెనంపై నూనె వేసి వేడి చేయాలి. టిక్కీలను సన్నని సెగపై కాల్చాలి.
- ఇలా కాల్చిన టిక్కీలను ఒక గిన్నెలో తీసుకొని దానిలో చింతపండు రసం, గ్రీన్ చట్నీ, కారపూస, చాట్ మసాలా, ఉప్పులను వేయాలి.



# ఆరోగ్యమే అసలు రహస్యం



సెలబ్ ఫిట్


**వెండితెరపై అలరిస్తున్న మరో వారసురాలు... అలనాటి తార పూజా బేడీ కూతురు... అలయా ఇబ్రహీమ్ ఫర్నిచర్‌వాలా. ఉరఫ్ అలయా ఎఫ్‌గా సుపరిచితురాలు. చేసింది కొద్ది సినిమాలే అయినా విలక్షణ నటిగా పేరు తెచ్చుకొంది. అభినయంతో పాటు నాజూకైన రూపంతోనూ ప్రత్యేకతను సంతరించుకున్న ఈ భామ... ఇన్‌స్టాలో తరచూ ఫిట్‌నెస్ వీడియోలు పెట్టి... ఆరోగ్యవంతమైన జీవన విధానం దిశగా అభిమానులను ప్రోత్సహిస్తోంది.**

హాస్యభరిత చిత్రం 'జవానీ జానేమన్'తో బాలీవుడ్‌లోకి ప్రవేశించింది అలయ. ఆమె తల్లి పూజా బేడీ కథానాయికగా పలు చిత్రాల్లో అలరించారు. ప్రముఖ నటుడు కబీర్ బేడీ ఆమెకు తాత. ఫర్హాన్ ఇబ్రహీమ్ ఫర్నిచర్‌వాలాతో వివాహం తరువాత పూజా బేడీ అమెరికాలో స్థిరపడ్డారు. అక్కడే అలయ జన్మించింది. పరిశ్రమలోకి రాకముందు ఆమె ముంబయి 'జమునాబాయి నర్సీ స్కూల్'లో చదివింది. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం కావడంతో... అలయకు చిన్నప్పటి నుంచే నటి కావాలనే కోరిక బలపడింది. దానికోసమే 'న్యూయార్క్ ఫిలిమ్ అయాడమీ'కి వెళ్లి నటనలో డిప్లమా చేసింది. ఆ క్రమంలోనే తెరపై తన పేరును అలయ ఎఫ్‌గా మార్చుకుంది. కథక్ నాట్యంలో కూడా శిక్షణ తీసుకున్న అలయ... 2011లో అమ్మతో కలిసి ఓ రియాలిటీ షోలో పాల్గొంది. 2020లో ఆమె తొలి చిత్రం 'జవానీ జానేమన్' విడుదలైంది. సైఫ్ అలీఖాన్ హీరో. చక్కని నటనతో ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. మొదటి సినిమానే అయినా కెమెరా ముందు అలయ ఎంతో సహజంగా కనిపించిందనేది విశ్లేషకుల మాట. 'బెస్ట్ ఫీమేల్ డెబ్యూ' ఫిలిమ్‌ఫేర్ అవార్డు కూడా దక్కించుకుంది. ఇక అక్కడి నుంచి వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. 'ఫ్రెడ్డీ, యూటర్న్'తో పాటు ఇటీవల విడుదలైన మల్టీస్టారర్ 'బడేమియా చోటేమియా'లో టైగర్‌షరాఫ్‌కు జోడీగా కీలక పాత్ర పోషించింది. పారిశ్రామికవేత్త శ్రీకాంత్ బొల్లా జీవిత చరిత్ర ఆధారంగా తీసిన 'శ్రీకాంత్'లో హీరో రాజ్‌కుమార్‌రావుతో పోటీపడి నటించింది.

ఐదేళ్ల కెరీర్‌లో ఆరు చిత్రాల్లోనే నటించినా... తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. నైకా, లెన్స్‌కార్ట్ వంటి బడా బ్రాండ్‌లకు ప్రచారకర్తగా వ్యవహరిస్తోంది. అటు సినిమాలు, ఇటు ప్రకటనలతో రెండు చేతులా సంపాదిస్తోంది ఈ అందాల తార. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు ఇరవై లక్షలమంది ఆమెను ఫాలో అవుతున్నారు. ప్రతి వీడియోకూ లైకులు కనీసం లక్ష దాటతాయి. ఆమె పోస్టు చేసేవాటిల్లో ఎక్కువగా తన ప్రాజెక్టులు, బ్రాండ్‌లతో పాటు ఫిట్‌నెస్ వీడియోలు ఉంటాయి. అక్కడ అప్పుడప్పుడూ అభిమానులకు కొన్ని ఫిట్‌నెస్ సవాళ్లు కూడా విసురుతుంటుంది. కెరీర్‌కు ఎంతటి ప్రాధాన్యమిస్తుందో... ఆరోగ్యవంతమైన జీవన విధానానికి కూడా అంతే ప్రాధాన్యమిస్తుంది. అదే తన విజయ రహస్యమని, అందుకే తన జీవితంలో వ్యాయామాలు, ఆహార నియమాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తానని చెబుతుంది అలయ.

### వ్యాయామాలు ఇలా...

అలయ వ్యాయామాల విషయంలో అస్సలు రాజీపడదు. ఆమె రోజువారీ వర్కవుట్స్ చాలా కఠినంగా ఉంటాయి. ఎప్పటికప్పుడు తనకు తాను కొత్త లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని చేరుకొనేందుకు కఠోరంగా శ్రమిస్తుంటుంది. వ్యక్తిగత ఫిట్‌నెస్ ట్రైనర్ పూజా థియా అమిన్ పర్యవేక్షణలో క్లిష్టమైన యోగాసనాలు కూడా సాధన చేస్తుంది. ఒకవేళ జిమ్‌కు వెళ్లడం కుదరకపోతే ఇంట్లోనే సుదీర్ఘ ఏరోబిక్స్ సెషన్‌తో పాటు స్కిప్పింగ్‌తో అదనపు క్యాలరీలు కరిగిస్తుంది.



- ఉదయం లేవగానే ముందుగా రన్నింగ్, జాగింగ్‌తో కూడిన కార్డియో సెషన్
- తరువాత పావుగంట కిక్‌బాక్సింగ్. దీనివల్ల మెదడు చురుగ్గా పని చేస్తుందనేది అలయ మాట.
- సరైన శరీరాకృతి, శరీర దారుఢ్యం కోసం వెయిట్ ట్రెయినింగ్‌తో పాటు స్క్వాట్స్, సూపర్‌మ్యాన్ స్ట్రెచ్, లంగెస్, ప్లాంక్స్, క్రంచెస్ తదితర వ్యాయామాలు.
- అప్పుడప్పుడూ బంతితో ట్రైనింగ్. అంటే బంతిపై కూర్చొని వ్యాయామాలు చేయడం. దీనివల్ల బ్యాలెన్స్ బాగా కుదురుతుంది. అయితే ఇలాంటి వ్యాయామాలు నిపుణుల సమక్షంలోనే చేయాలి.
- అలయ 90 నిమిషాల తన వర్కవుట్ సెషన్‌ను రెండుగా విభజించింది. మొదటి సెషన్ ఇండోర్‌లో. అంటే జిమ్‌లో చేసేవి. రెండో సెషన్ ప్రకృతి ఒడిలో.
- అలయ వర్కవుట్స్‌లో మానసిక వ్యాయామం కూడా ఉంటుంది. రోజూ ధ్యానంతో పాటు ఏదో ఒక పుస్తకంలో పది పేజీలు చదువుతుంది. దీనివల్ల విజ్ఞానమే కాకుండా, సృజనాత్మక శక్తి కూడా పెరుగుతుందని అలయ చెబుతోంది. అంతేకాదు... తన ఆలోచనలన్నిటినీ ఒక కాగితం మీద పెడుతుంది. తన లక్ష్యాలను ఎంతవరకు చేరుకుందో ఏరోజుకారోజు బేరీజు వేసుకొంటుంది.

### ఇదీ ఆహారం...

ఆహారం విషయంలోనూ అలయ ఎంతో శ్రద్ధ తీసుకొంటుంది. శరీరం డీహైడ్రేట్ కాకుండా రోజుకు నాలుగు లీటర్ల నీళ్లు తాగుతుంది. ఇంటి వంటకే ప్రాధాన్యమిస్తుంది. పోషక విలువలు సమతులంగా ఉండేందుకు మెనూలో రకరకాల సలాడ్స్‌ను జోడించింది.

- ఉదయం ఒక బౌల్ ఓట్‌మీల్‌తో మొదలవుతుంది. పిండి, పీచుపదార్థాలు ఇందులో పుష్కలం. మంచి శక్తినిస్తుంది. తాజా పండ్లకు అలయ అధిక ప్రాధాన్యం ఇస్తుంది. అరటిపండు, బెర్రీస్, యాపిల్ తదితర పండ్లు ఆమె మెనూలో ఉంటాయి. వాటితోపాటు ఆమ్లెట్ లేదా బాయిల్డ్ ఎగ్‌తో బ్రేక్‌ఫాస్ట్. తరచూ గ్రీన్ టీ తాగుతుంటుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్స్ అధికం.
- మధ్యాహ్న భోజనంలో పాలకూర సూప్, కర్జూర, క్వినోవా పులావ్.
- రాత్రి పడుకొనే ముందు ఓట్‌మిల్క్, నాలుగు బాదంపప్పులు, రెండు అక్రోట్లు, చెంచాడు తేనె, దాల్చినచెక్క, సబ్జాగింజలు, ప్రొటీన్ పౌడర్‌తో ప్రత్యేకంగా తయారు చేసిన స్మూతీ.

మేకప్

# కలలు కనే కళ్ల కోసం..

ముఖంలో టక్కున ఆకట్టుకునేవి కళ్లే! కాబట్టి కళ్ల మెరుపులు చిందేలా ఐమేకప్ వేసుకోవాలి. అందుకోసం ఇవిగో ఈ చిట్కాలు పాటించాలి.

**ఐ షాడో ఇలా...**

ముదురు నుంచి లేత రంగుల వరకూ రకరకాల రంగుల ప్యాలెట్‌ను ఎంచుకోవాలి. మరీ ముఖ్యంగా మన కళ్లకు మరింత బాగా నప్పే రంగులు ఉండేలా చూసుకోవాలి.

**రంగుల మీద పట్టు**

ప్యాలెట్‌ను తెరిచి, ఏవి తేలిక రంగులు, ఏవి మధ్యస్థ రంగులు, ఏవి ముదురు రంగులో గుర్తించాలి. వీటిలో ఏ రంగులను ఉపయోగిస్తే, ఉబ్బెత్తుగా కనిపించేలా చేయవచ్చో, ఏ రంగులను ఉపయోగిస్తే, లోతుగా కనిపించేలా చేయవచ్చో తెలుసుకోవాలి. పై కను రెప్ప మధ్యలో ఉబ్బెత్తుగా కనిపించేలా తేలిక రంగు అద్దుకోవాలి. కొలకుల దగ్గర ముదురు రంగు ఐషాడో వేసుకోవాలి.

**ఇలా అద్దుకోవాలి**

- తేలిక రంగులను హైలైట్ కోసం ఉపయోగించాలి. కంటి కొలకుల దగ్గర, కంటి ఎగువ ఎముక దగ్గర ఈ రంగులను వాడుకోవాలి.
- మధ్యస్థ రంగులను కంటి ప్రాథమిక ఆకారాన్ని ప్రస్ఫుటం చేయడం కోసం వాడుకోవాలి. అలాగే తేలి



కపాటి ప్రదేశాలను ముదురు రంగు ప్రదేశాల్లో కలిసిపోయేలా చేయడం కోసం కూడా ఈ రంగులు ఉపయోగపడతాయి. ఈ రంగులను కనురెప్పల మధ్యలో, ముడతల దగ్గర వాడుకోవాలి.
- కంటి ఆకర్షణ కోసం, కాంటూరింగ్ కోసం ముదురు రంగులు ఉపయోగపడతాయి. కంటికి మరింత తీవ్రతను తెచ్చిపెట్టడం కోసం కూడా ముదురు ఐ షాడోలను వాడుకోవచ్చు. కనురెప్పల చివర్లలో, ముడతల దగ్గర ఈ రంగులను అప్లై చేసుకోవాలి.
- **బ్లెండింగ్:** ముదురు రంగును లేత రంగులోకి కలపాలన్నా, లేత రంగును ముదురు రంగులోకి కలపాలన్నా బ్లెండింగ్ బ్రష్‌ను వృత్తాకారంలో కదిలిస్తూ బ్లెండ్ చేసుకోవాలి.

# ఆరోగ్యదాయిని ఆప్రికాట్

ఆప్రికాట్ తినడానికి రుచికరంగా ఉంటుంది. దీనితో తయారు చేసే తీపి పదార్థాలను పిల్లలు ఇష్టంగా తింటూ ఉంటారు. రెండు ఆప్రికాట్ పండ్లను రాత్రి నీళ్లలో నానబెట్టి రోజూ ఉదయాన్నే తినడంవల్ల అనారోగ్యం దరిచేరదు.

**మలబద్దకానికి:** ఆప్రికాట్‌లో పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. రోజూ ఈ పండు తినడంవల్ల మలబద్ధకం దూరమవుతుంది. దీనిలోని కెరోటినాయిడ్స్ పెద్ద పేగు, చిన్న పేగుల్లో క్యాన్సర్ రాకుండా చేస్తాయి. జీర్ణాశయంలో సమస్యలను నివారించి జీర్ణక్రియకు సహకరిస్తాయి.

**కంటిచూపుకి:** ఈ పండులో ఉండే ఎ విటమిన్ కంటి సమస్యలను నివారిస్తుంది. రోజూ ఉదయాన్నే ఈ పండు తినడంవల్ల ఫ్రీ రాడికల్స్ నుంచి రెటీనాకు రక్షణ లభిస్తుంది. కళ్ల నుంచి నీరు కారడం, కళ్లలో పొరలు పెరగడం వంటి సమస్యలు తలెత్తవు.

**గుండెకు:** ఆప్రికాట్‌లోని పీచు పదార్థం రక్తంలో చేరిన కొలెస్ట్రాల్‌ను కరిగించి శరీరమంతా రక్తప్రసరణ జరిగేలా చూస్తుంది. దీనివల్ల గుండె జబ్బులు రావు. శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది. రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచి మధుమేహం రాకుండా కాపాడతాయి.



**ఎముకలకు:** తరచూ ఆప్రికాట్‌ను ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, మాంగనీస్, పాస్పరస్ లాంటి ఖనిజ లవణాలు అంది ఎముకలు దృఢంగా మారతాయి. కండరాలు పట్టేయడం, కీళ్లనొప్పులు వంటి సమస్యలను నివారిస్తాయి.

**వాపులకు:** ఆప్రికాట్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శరీర ఉష్ణోగ్రతను నియంత్రణలో ఉంచుతాయి. వెన్ను నొప్పి, మెడనొప్పి, కడుపులో మంట, అరికాలి మంటలు, తిమ్మిర్లు, మోకాళ్ల సమస్యలను నివారిస్తాయి.

**చర్మానికి:** ఆప్రికాట్‌ను తరచూ తింటూ ఉంటే చర్మం తేమతో నిండి కాంతివంతంగా మారుతుంది. దీనిలోని సి, ఎ, కె విటమిన్లు; ఫైటో న్యూట్రియెంట్స్ చర్మానికి పోషణను అందిస్తాయి. మొటిమలు, మచ్చలు రాకుండా చేస్తాయి.

# ప్రాణాలు పోయినా భూములివ్వం

- మేం ఎవరం అధికారులపై దాడి చేయలేదు..!
- విడుదల అనంతరం లగచర్ల గ్రామస్థులు



జైలు నుంచి విడుదలైన తండ్రి హీర్యా నాయక్‌ను చూసి భావోద్వేగానికి గురైన కూతురు

కంది, బొంరాస్‌పేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రాణాలైనా వదులుకుంటాం కానీ భూములను మాత్రం ఇవ్వబోం, ఆస్తులను కాపాడుకుని తీరుతాం అని లగచర్ల కేసు నిందితులు స్పష్టం చేశారు. జీవితంలో జైలుకెళ్తామని ఊహించలేదంటూ కంటతడి పెట్టారు. గత నెల 11న వికారాబాద్ కలెక్టర్ మరికొందరు అధికారులపై దాడి చేశారనే ఆరోపణలతో కొడంగల్ మండలం లగచర్ల, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండా, హకీంపేట గ్రామాలకు చెందిన 71 మందిపై కేసు నమోదైంది. వీరిలో 32 మందిని జ్యుడీషియల్ కస్టడీ కింద కందిలోని సంగారెడ్డి కేంద్ర కారాగారానికి తీసుకొచ్చారు. 17 మందికి నాంపల్లి కోర్టు రూ.20 వేల పూచీకత్తుపై షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గురువారం సాయంత్రం సంబంధిత పత్రాలు అందకపోవడంతో జైలు అధికారులు శుక్రవారం విడుదల చేశారు. ఈ కేసులోని ఎ-2 సురేష్, మరో 14 మందికి బెయిల్ రాలేదు. కాగా, 37 రోజులు జైల్లో ఉన్న లగచర్ల కేసు నిందితులు విడుదల తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బయట ఉన్న కుటుంబ సభ్యులను చూసి భావోద్వేగానికి గురయ్యారు. జైల్లో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యామని చెప్పుకొని రోదించారు. 'మేం అధికారులపై దాడి చేయలేదు. భూములు ఇవ్వలేదనే నెపంతో అక్కడి రాజకీయ నాయకులు ఉద్దేశపూర్వకంగా అరెస్టు చేయించారు. కుటుంబసభ్యుల ఎదుటనే దూషిస్తూ ఇళ్లలోంచి లాక్కొచ్చి పోలీసులు అరాచకం సృష్టించారు. ఏం జరుగుతుందో ఊహించేలోపే అరెస్టు చేశారు. పరిగి ఠాణాలో ఇష్టారాజ్యంగా కొట్టారు. కుటుంబసభ్యులను కలుసుకునే అవకాశం ఇవ్వలేదు. సంగారెడ్డి జైలుకు వచ్చిన తర్వాతా పోలీసులు కొట్టిన దెబ్బల తాలూకు నొప్పులతో ఇబ్బందిపడ్డాం" అని వివరించారు.

### విడుదలైనది వీరే..

పాత్లవత్ వినోద్, పాత్లవత్ శ్రీనునాయక్, రాథోడ్ వినోద్, పాత్లవత్ భాష్యానాయక్, జర్పు హీర్యానాయక్ (రోటిబండ తండా), మైలారం విష్ణువర్ధన్‌రెడ్డి, ఎదురింటి శివకుమార్, నీలి రవి, బసప్ప, బ్యాగరి యాదయ్య, లక్ష్మయ్య, కావలి రాఘవేందర్ (లగచర్ల), దోరమని రమేష్, మాణిక్య శ్రీశైలం, దోరమని బాలకృష్ణయ్య (హకీంపేట), జర్పు హీర్యానాయక్, పాత్లవత్ ప్రవీణ్ కుమార్ (పులిచెర్ల కుంట తండా).

# తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు సహించం

- సోషల్ మీడియా ద్వారా హెచ్చరించిన టీటీడీ చైర్మన్
- తెలంగాణ నేతపై చర్యలకు ఆదేశిస్తున్నట్లు వెల్లడి

తిరుమల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుమల ప్రశాంతతను దెబ్బతీసేలా కొండపై ఎవరు రాజకీయ వ్యాఖ్యలు చేసినా సహించేది లేదంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సోషల్ మీడియా ద్వారా హెచ్చరించారు. తిరుమలలో తెలంగాణ ప్రజలు, రాజకీయ నాయకులు, వ్యాపార వేత్తల విషయంలో భేదం చూపిస్తున్నారంటూ తెలంగాణ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గురువారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు మీడియాతో మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు కాస్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో టీటీడీ చైర్మన్ తన ఫేస్‌బుక్ ఖాతాలో గురువారం అర్ధరాత్రి ఓ పోస్ట్ చేశారు. 'తిరుమల పవిత్ర క్షేత్రం. ఇది రాజకీయ వేదిక కాదు. రాజకీయంగా తిరుమలను ఎవరు వేదికగా చేసుకున్నా చర్యలు తప్పవని గతంలోనే హెచ్చరించాం. తెలంగాణకు చెందిన ఒక నేత తిరుమల వేదికగా రాజకీయ వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆయనపై చర్యలకు ఆదేశిస్తున్నాం' అంటూ పేర్కొన్నారు.

# కాళేశ్వరం డిజైన్లకు సీడబ్ల్యూసీ ఆమోదం లేదు

- పరీక్షలు చేయకుండానే బ్యారేజీ నిర్మాణం
- కాళేశ్వరం కమిషన్ ఎదుట వెదిరె శ్రీరామ్
- అఫిడవిట్ దాఖలు చేసే విధానం ఇదేనా?
- కోదండరామ్‌కు కమిషన్ చురకలు

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకం డిజైన్లకు కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) ఆమోదం లేదని కేంద్ర జలశక్తి శాఖ సలహాదారుడు వెదిరె శ్రీరామ్ స్పష్టం చేశారు. ఏ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నా తొలుత సరైన ఇన్వెస్టిగేషన్లు జరగాలని, ఆ ఫలితాల ఆధారంగా డిజైన్లు/డ్రాయింగ్‌లు పూర్తయ్యాక నిర్మాణం జరగాల్సి ఉంటుందని తెలిపారు. కానీ, కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో ఇవేమీ జరగలేదని గుర్తు చేశారు. కాళేశ్వరం కమిషన్ ఎదుట శుక్రవారం ఆయన మరోసారి విచారణకు హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతుల కోసం కేంద్ర జల వనరుల సంఘాని(సీడబ్ల్యూసీ)కి సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) రాసిన లేఖను సాక్ష్యంగా గతంలో వెదిరె శ్రీరామ్ సమర్పించగా.. ఆ లేఖలో వ్యత్యాసాలు ఉన్నట్లు కమిషన్ గుర్తు చేసింది. ఏ అధికారంతో అధికారిక పత్రాలను సంపాదించారని ప్రశ్నించగా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాల్లో భాగంగా సంపాదించానని, అవన్నీ పబ్లిక్ డాక్యుమెంట్లేనని ఆయన చెప్పారు. డిజైన్లకు అవరమైన వివరాలను అప్పటి ప్రభుత్వం సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో)కు ఇవ్వలేదని, సరైన వివరాలు లేకుండా డిజైన్లు రూపొందించారని ఆరోపించారు. "బ్యారేజీల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించిన దాఖలాలు కనిపించడం లేదు. నిర్మాణం తర్వాత ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) పనులు జరగలేదు. 2019లో వరదలు తగ్గుముఖం పట్టాక మేడిగడ్డ బ్యారేజీ దిగువ భాగంలో సీసీ బ్లాకులు చెల్లాచెదురైనట్టు గుర్తించారు. వాటిని అప్పుడే సరిచేయాల్సి ఉండగా.. చేయలేదు. ఈ విషయమై నిర్మాణ సంస్థ, అధికారుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగినా.. పనులు చేపట్టలేదు. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ నివేదిక ప్రకారం 3 బ్యారేజీల్లోనూ ఓ అండ్ ఎం నిధులు వెచ్చించిన దాఖలాల్లేవు. పునాదుల నుంచి ఇసుకంతా జారి.. మేడిగడ్డ కుంగింది. అన్నారం, సుందిళ్లలో సీపేజీలు ఏర్పడ్డాయి. ప్రతిపాదిత ప్రదేశాలకు 2.2కిలోమీటర్ల దూరంలో సుందిళ్ల, 5.4 కి.మీ దూరంలో అన్నారం బ్యారేజీని కట్టారు. పరీక్షలు ఒకచోట జరిగితే.. బ్యారేజీలు ఒక చోట కట్టారు. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉందని సీడబ్ల్యూసీ చెప్పినా.. అప్పటి సీఎం నిర్ణయం మేరకే తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టలేదు. హడావుడిగా కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణం చేపట్టారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణంలో తొందరపాటు చర్యలకు పాల్పడ్డారు. డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ ఆమోదించడానికి ముందే నిర్మాణం ప్రారంభించారు" అని శ్రీరామ్ తెలిపారు.

### అఫిడవిట్.. ఇలాగేనా దాఖలు చేసేది?

"అఫిడవిట్ దాఖలు చేసే విధానం ఇదేనా? సమగ్ర సమాచారంతోపాటు అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలకు సాక్ష్యాలు సమర్పించాల్సి ఉండగా.. ఆ పని చేయలేదు. మీరు పేర్కొంటున్న పత్రాలు గతంలోనే సేకరించామని, మళ్లీ ఇచ్చే పత్రాలు చెత్తబుట్టలో పడేయడానికి తప్ప, దేనికీ పనికి రావు" అని ఎమ్మెల్సీ కోదండరామ్‌కు కాళేశ్వరం కమిషన్ చురకలు అంటించింది. విచారణ అనంతరం కోదండరామ్ మాట్లాడుతూ తొందరపాటుతో కాళేశ్వరం కట్టారని, ఇది తెలంగాణకు గుదిబండగా మారిందని దుయ్యబట్టారు. కాగా, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో తన పాత్ర లేదని, కొంత కాలం మాత్రమే నీటిపారుదల శాఖ బాధ్యతలు చూశానని రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ వెల్లడించారు. కమిషన్ ముందు హాజరైన ఆయన.. అప్పట్లో మైనర్ ఇరిగేషన్, భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణ బాధ్యతలు చూశానని వివరించారు.

# పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్ వెనక్కి


## నీటి కేటాయింపులపైనే ప్రధాన అభ్యంతరం.. కేంద్ర జలవనరుల సంఘం సంచలన నిర్ణయం

- బ్రిజేష్ ట్రిబ్యునల్ కృష్ణాలో వాటా తేల్చేదాకా ఆ 45 టీఎంసీలపై ఎవరికీ హక్కు లేదని వెల్లడి
- 6 నెలల్లో తీర్పు వస్తుందని సర్కారు ఆశ
- తర్వాత మళ్లీ డీపీఆర్ సమర్పించే యోచన
- కాళేశ్వరం అదనపు టీఎంసీ, వార్ధా ప్రాజెక్టుల డీపీఆర్‌లను సైతం వెనక్కి పంపిన సీడబ్ల్యూసీ

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను వెనక్కి పంపిస్తూ కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) సంచలన నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు బీఆర్ అంబేడ్కర్ వార్ధా ప్రాజెక్టు, కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అదనపు టీఎంసీ ప్రాజెక్టు డీపీఆర్‌లనూ వెనక్కి పంపించింది. 90టీఎంసీల సామర్థ్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2022 సెప్టెంబరు 3న సీడబ్ల్యూసీకి డీపీఆర్‌ను సమర్పించగా, అందులోని ఏ డైరెక్టరేట్ కూడా దీన్ని పరిశీలించలేదు. ఈ ప్రాజెక్టుకు 90 టీఎంసీల నీటి కేటాయింపులపైనే ప్రధానంగా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కృష్ణా బేసిన్ పరిధిలో చిన్న నీటిపారుదల రంగం కింద 2012-13 నుంచి 2021-23 దాకా తాము పొదుపు చేసిన 45.66 టీఎంసీలతోపాటు పోలవరం ప్రాజెక్టుకు అనుమతి లభించాక.. కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీల్లో ఉమ్మడి ఏపీకి దక్కిన 45 టీఎంసీలను ఈ ప్రాజెక్టుకు వినియోగించుకుంటామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, పోలవరం వాటా కింద దక్కిన నీటిపై తెలంగాణకు పూర్తి అధికారం లేదని, తెలుగు రాష్ట్రాల మధ్య ఒప్పందం లేదా ట్రిబ్యునల్ తీర్పు తర్వాతే ఆ నీటిపై అధికారం ఉంటుందని ఏడాదిన్నర కిందటే సీడబ్ల్యూసీ డైరెక్టరేట్ తెలంగాణకు లేఖ రాసింది. చిన్ననీటిపారుదల రంగానికి ఉన్న కేటాయింపులను పొదుపు చేస్తున్నారనడానికి ప్రాతిపదిక ఏంటని ప్రశ్నిస్తూ.. నిర్దేశిత ప్రొఫార్మాలో వివరాలు అందించాలని కోరింది. అయితే, నీటి పొదుపుపై తెలంగాణ ప్రభుత్వం వివరణ ఇవ్వకపోవడంతోపాటు జస్టిస్ బ్రిజేష్‌కుమార్(కృష్ణా ట్రిబ్యునల్-2) కృష్ణా జలాల వాటాను తేల్చేదాకా పోలవరం వాటాలో దక్కిన 45 టీఎంసీలపై ఎవరికీ హక్కు లేదని పేర్కొంటూ సదరు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ వెనక్కి పంపింది. పాలమూరు-రంగారెడ్డికి 2019లో తొలి, రెండో దశ అటవీ అనుమతులు రాగా, 2021 సెప్టెంబరు 3న పర్యావరణ అనుమతులు, 2023 మార్చి 17న కేంద్ర విద్యుత్ సంస్థ(సీఈఏ), ఇతర అనుమతులు లభించాయి. 2023 ఏప్రిల్‌లోనే డీపీఆర్‌ను వెనక్కి పంపిస్తామని సీడబ్ల్యూసీ సమాచారం ఇచ్చింది. తాజాగా ఆయా కారణాలను చూపుతూ డీపీఆర్‌ను వెనక్కి పంపించింది. అయితే, కృష్ణా జలాల వాటాకు సంబంధించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ఆరు నెలల్లో వెలువడే అవకాశం ఉందని తెలంగాణ ప్రభుత్వం ఆశాభావంతో ఉంది. నీటి కేటాయింపుల అనంతరం పాలమూరు ఎత్తిపోతల డీపీఆర్‌ను తిరిగి సమర్పించే అవకాశాలు ఉన్నాయి.

### కాళేశ్వరం అదనపు టీఎంసీ ఔట్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా రోజుకు 2 టీఎంసీలు తరలించే హెడ్‌వర్క్‌లు పూర్తయిన వెంటనే బీఆర్ఎస్ ప్రభుత్వం హడావుడిగా మరో టీఎంసీని తరలించే పథకాన్ని చేపట్టిన విషయం విదితమే. అయితే, గోదావరి, కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలంటూ 2021 జూలై 15న కేంద్రం జారీ చేసిన గెజిట్‌లో కాళేశ్వరం అదనపు టీఎంసీ ప్రాజెక్టును అనుమతి లేని జాబితాలో ఉంచిది. దీనిపై బీఆర్ఎస్ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. అయితే, రెండు కాంపొనెంట్లు వేర్వేరు కావనే విషయాన్ని తెలుపుతూ కాళేశ్వరం సవరణ డీపీఆర్‌ను సమర్పిస్తే.. అన్ని పరిశీలనలు పూర్తయ్యాకే గెజిట్ నుంచి తొలగిస్తామని కేంద్రం తేల్చిచెప్పింది. దాంతో కాళేశ్వరం సవరణ డీపీఆర్‌ను మూడేళ్ల కిందటే సీడబ్ల్యూసీతో పాటు గోదావరి బోర్డుకు సమర్పించారు. అదనపు టీఎంసీపై కోర్టులో కేసులు ఉన్నందున ఆ డీపీఆర్‌ను పరిశీలించబోమని ఓ దశలో గోదావరి బోర్డు తేల్చి చెప్పగా ఆ తర్వాత కేంద్ర జలశక్తి శాఖ కూడా డీపీఆర్‌పై యథాతథ స్థితిని పాటించాలని ఆదేశాలు ఇచ్చింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం కోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఆదేశాలతో డీపీఆర్ పరిశీలన జరిగింది. డీపీఆర్‌పై సందేహాలు లేవనెత్తుతూ సీడబ్ల్యూసీ రెండు డజన్లకుపైగా లేఖలు రాయగా వాటికి జవాబులు చెప్పలేక గత ప్రభుత్వం తిప్పలు పడింది. అదనపు టీఎంసీ ప్రాజెక్టు వ్యయం రూ.34,810కోట్లు కాగా.. రూ.13,900 కోట్ల దాకా వెచ్చించారు. ఇందులో రూ.12,392 కోట్ల పనులను నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టడం విమర్శలకు తావిచ్చింది. 2022 జూలైలో వచ్చిన వరదలతో కన్నెపల్లిలోని పంప్‌హౌస్ రక్షణ గోడ కుప్పకూలి మోటార్లు మునిగిపోగా, ఆ తర్వాత అదనపు టీఎంసీ కోసం తెప్పించిన పరికరాలతో మోటార్లకు మరమ్మతులు చేశారు. కాళేశ్వరం అదనపు టీఎంసీ కాంపొనెంట్‌ను అనుమతి లేని జాబితా నుంచి తొలగించాలని అప్పటి సీఎం కేసీఆర్ నాటి కేంద్ర మంత్రి షెకావత్‌ను కలిసి కోరినా.. ఫలితం లేకపోయింది. తాజాగా డీపీఆర్‌ను వెనక్కి పంపుతూ సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకుంది.



### వార్ధా కూడా...

ప్రాణహిత-చేవెళ్ల స్థానంలో ప్రతిపాదించిన 'వార్ధా' ప్రాజెక్టు డీపీఆర్ కూడా వెనక్కి వచ్చేసింది. రూ.4,874.87 కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తామంటూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 మే 11వ తేదీన సీడబ్ల్యూసీకి డీపీఆర్ సమర్పించిది. ఆసిఫాబాద్ జిల్లా గుండాయిపేట వద్ద వార్ధా బ్యారేజీ కట్టాలని ప్రతిపాదించింది. ఉమ్మడి ఏపీ పాలనలో ఆదిలాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై రూ.1,919 కోట్లతో బ్యారేజీ నిర్మించి తెలంగాణలోని 16.40లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వడానికి ప్రాణహిత - చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రాజెక్టుల రీ-డిజైన్‌లో భాగంగా దీన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కనపెట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టును తెరపైకి తెచ్చి.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించింది. ఇందులో మేడిగడ్డ కుంగిపోగా, అన్నారం, సుందిళ్లలో నీటి నిల్వ చేయరాదని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ సూచించింది. తాజాగా వార్ధా డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ వెనక్కి పంపించడంతో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలన్న కాంగ్రెస్ సర్కారు అడుగులకు మార్గం సుగమమైంది.

# నవ్య | చిత్రజ్యోతి

## స్టైలిష్ లుక్‌లో సోహైల్‌ఖాన్



నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఎన్‌కేఆర్ 21' (వర్కింగ్ టైటిల్). ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో శరవేగంగా చిత్రీకరణ సాగుతోంది. కల్యాణ్‌రామ్‌పై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ సోదరుడు సోహైల్ ఖాన్ ఈ చిత్రంతో నటుడిగా తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. ఈవిల్డోర్ అనే విలన్ పాత్రలో ఆయన కల్యాణ్‌రామ్‌తో తలపడనున్నారు. శుక్రవారం సోహైల్ ఖాన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. నల్లటి దుస్తుల్లో స్టైలిష్ లుక్‌లో సోహైల్‌ఖాన్ కనిపించారు. ఈ చిత్రంలో విజయశాంతి, సాయీ మంజ్రేకర్, శ్రీకాంత్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: అజనీష్ లోకనాథ్, సినిమాటోగ్రఫీ: రామ్ ప్రసాద్.

## భావోద్వేగానికి గురయ్యా



'ఎన్నో గొప్ప చిత్రాలను, గట్టి పోటీని తట్టుకుని అవార్డుని దక్కించుకున్నందుకు నాకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. అభిమానుల ప్రేమకు భావోద్వేగానికి గురయ్యా' అని ఆనందం వ్యక్తం చేశారు నటి సాయిపల్లవి. చెన్నైలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'అమరన్' చిత్రానికి ఉత్తమ నటిగా సాయిపల్లవి, 'మహారాజ' చిత్రానికి ఉత్తమ నటుడిగా విజయ్ సేతుపతి అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా సాయిపల్లవి స్పందిస్తూ 'ముకుంద్ కుటుంబ సభ్యుల వల్లే ఇది సాధ్యమైంది. ఈ కథను ప్రపంచానికి చెప్పడానికి వాళ్లు అంగీకరించడం వల్లనే 'అమరన్' చిత్రాన్ని రూపొందించగలిగాం' అని వివరించారు. కాగా, 'మహారాజ'ను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు విజయ్ సేతుపతి.

## సూపర్ నేచురల్ థ్రిల్లర్



యుగంధర్ ముని దర్శకత్వంలో ఆది సాయికుమార్ నటిస్తున్న చిత్రం 'శంబాల'. అర్చన అయ్యర్ కథానాయిక. భారీ బడ్జెట్‌తో రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఆది సాయికుమార్ జియో సైంటిస్ట్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభమైంది. ఎవరూ టచ్ చేయని పాయింట్, కథతో ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో శిక్షణ పొందిన యుగంధర్ ముని ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీరామ్ మద్దూరి సంగీతాన్ని అందిస్తున్నారు. శ్వాసిక, రవివర్మ, మీసాల లక్ష్మణ్, మధునందన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



అల్లు అర్జున్ హీరోగా నటించిన 'పుష్ప' సినిమాలో 'ఊ అంటావా మావా.. ఉహూ అంటావా' పాటతో నూతన గాయని ఇంద్రావతి చౌహాన్‌ని పరిచయం చేసిన సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ 'పుష్ప 2' సినిమాతో మరో కొత్త గాయనికి అవకాశం ఇచ్చారు. ఈ సినిమాలోని 'వస్తుండాయి పీలింగ్స్' అనే పాట పాడిన గాయని పేరు దాస లక్ష్మి. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం గన్నోర గ్రామానికి చెందిన ఈ జానపద గాయని చిన్నప్పటి నుంచి తల్లి జయశీల పాడే మరాఠీ కీర్తనలు, మరాఠీ పాటలు అనుకరిస్తూ తెలుగులో ఫోక్ సాంగ్స్ పాడుతుండేది. ఆమె ప్రతిభను గమనించిన ఆ



## వస్తుండాయి పీలింగ్స్

గ్రామానికి చెందిన కళాకారుడు దిగంబర్ పాటలలో మెళకువలను నేర్పించారు. అవకాశం దొరినప్పుడల్లా రకరకాల ప్రోగ్రామ్స్‌లో పాటలు పాడిన దాస లక్ష్మి యూట్యూబ్ వల్ల ఎంతో పాపులర్ అయింది. ఆమె పాడిన దాదాపు 700కి పైగా జానపద గీతాలు యూ ట్యూబ్ ద్వారా సంగీత ప్రియులను అలరిస్తున్నాయి. టాలెంట్ ఉన్న కొత్తవారికి అవకాశాలు ఇచ్చే దర్శకుడు సుకుమార్, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ 'పుష్ప 2' లో దాస లక్ష్మికి అవకాశం ఇచ్చారు. ఆమె పాడిన 'వస్తుండాయి పీలింగ్స్' పాట వైరల్ కావడంతో దాస లక్ష్మి పేరు తెలుగు రాష్ట్రాల్లో మారుమోగుతోంది. నిర్మల్ జిల్లా జానపద గాయకురాలికి ఇలా సినిమాలో పాట పాడే అవకాశం రావడం.. అది హిట్ కావడంతో లక్ష్మిని జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

ముథోల్ (ఆంధ్రజ్యోతి)

## నా పాత్ర ప్రేక్షకులను మెప్పిస్తుంది

**- ఐశ్వర్య శర్మ**



ధర్మ, ఐశ్వర్యశర్మ జంటగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. ఈ నెల 27న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను ఐశ్వర్యశర్మ మీడియాతో పంచుకున్నారు. 'నటనలో శిక్షణ తీసుకున్నాక కొన్ని వాణిజ్య ప్రకటనల్లో నటించాను. నటిగా 'డ్రింకర్ సాయి' నాకు తొలి చిత్రం. నేను చేసిన బాగీ పాత్రకు ప్రేక్షకులంతా కనెక్ట్ అవుతారు. ఇందులో వైద్య విద్యార్థినిగా కనిపిస్తాను. రెగ్యులర్ హీరోయిన్ రోల్స్‌కు భిన్నంగా నా పాత్ర ఉంటుంది. ట్రైలర్ చూసి కొంతమంది 'అర్జున్‌రెడ్డి' సినిమాతో పోలిక తెచ్చారు కానీ మా 'డ్రింకర్ సాయి' కథ పూర్తి భిన్నంగా ఉంటుంది. కథా బలమున్న చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తున్నందుకు ఆనందంగా ఉంది. తెలుగు అమ్మాయిని కాకపోవడంతో సెట్‌లో సంభాషణలు పలికేందుకు కొంత ఇబ్బందిపడ్డాను. హీరో ధర్మ, దర్శకుడు కిరణ్ నాకు సాయం చేశారు. నా నటన సహజంగా ఉండేలా చూసుకునేందుకు చాలా శ్రమించాను. 'డ్రింకర్ సాయి' చిత్రంతో ఒక మంచి ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. అలాగే మంచి సందేశం కూడా ఈ సినిమాలో ఉంది' అని అన్నారు.

## తండ్రి తీర్పు సిద్ధం



కుటుంబ విలువలు, తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. ప్రతాప్ భీమవరపు దర్శకత్వంలో లయన్ శ్రీరామ్ దత్తి నిర్మించారు. ఈ చిత్రంతో వివారెడ్డి హీరోగా పరిచయమవుతున్నాడు. శుక్రవారం చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. ఈ నెల 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఒక మంచి కుటుంబ కథా చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నందుకు ఆనందంగా ఉంది. తల్లితండ్రులను నిర్లక్ష్యం చేస్తున్న కొడుకులకు కనువిప్పు కలిగించేలా మా సినిమా ఉంటుంది' అని తెలిపారు. ఈచిత్రానికి సంగీతం: మధు బాపు శాస్త్రి. సినిమాటోగ్రఫీ: సురేశ్ చెటిపల్లి

### కొత్తగా..

## గ్రామీణ ప్రేమకథ



చంద్రహాస్ కథానాయకుడిగా సంపత్ రుద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. గెడాచందు, గాయత్రి చిన్ని, ఏవీఆర్ నిర్మిస్తున్నారు. మేఘనా ముఖర్జీ కథానాయిక. అర్జున్ మహీ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు వి.వి వినాయక్ చేతుల మీదుగా మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రహాస్ మాట్లాడుతూ 'తెలంగాణలోని రుద్రారం అనే ఊరి నేపథ్యంలో సాగే అందమైన ప్రేమకథను ఈ సినిమాలో చూపించబోతున్నాం. ధ్రువన్ సంగీతం అద్భుతంగా అలరిస్తుంది' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు.

## ఉద్యమ నేపథ్యం



తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'దక్కన్ సర్కార్'. కళా శ్రీనివాస్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. చాణక్య, కియా రెడ్డి, మౌనిక హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. చిత్రబృందం టీజర్ విడుదల చేసి, పోస్టర్‌ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా కళా శ్రీనివాస్ మాట్లాడుతూ "దక్కన్ సర్కార్' ద్వారా తెలంగాణ ఉద్యమాన్ని వెండితెరపైన ఆవిష్కరించే ప్రయత్నం చేశాం. పోరాటాలకు విరామం ఉండదని ఈ సినిమా ద్వారా చెప్పబోతున్నాం. త్వరలో ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహిస్తాం' అని చెప్పారు. తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నారెడ్డి, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఖమ్మంలో మంత్రి పొంగులేటి, వైఎస్ జగన్ ఫ్లెక్సీలు

జిల్లా కేంద్రం ఖమ్మంతో పాటు పలుచోట్ల శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడి, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఉన్న ఫ్లెక్సీలు వెలిశాయి. జగన్ జన్మదినం సందర్భంగా 'జన్మదిన శుభాకాంక్షలు.. కళ్లెం ఉపేందర్‌రెడ్డి, 23వ డివిజన్' పేరుతో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. డిసెంబరు 21న జగన్ జన్మదినం సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి ఫొటోలతో ఈఫ్లెక్సీలు వెలియడం చర్చనీయాంశంగా మారింది.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం

## చిట్యాల మునిసిపల్ పరిధిలో 18 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా!

» ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు
» కాంగ్రెస్ నేత దేవనక దేవేందర్

బర్కత్‌పుర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లా చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెంలోని సర్వే నంబర్ 34లో ఉన్న 18 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాచేసి గుట్టలను ధ్వంసం చేస్తూ మట్టిని విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ దేవనక దేవేందర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ గుట్టల వెనకున్న పొలాలకు రైతులను వెళ్లనీయకుండా కబ్జాదారులు అడ్డుకుంటున్నకుంటున్నారని, దీంతో పొలాలు ఎండిపోతుండటం వల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు అధికారులు కబ్జాదారులకు వత్తాసు పలుకుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇందులో చిట్యాల తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్లు ప్రధాన పోషిస్తున్నారని ఆయన ఆరోపించారు. భూకబ్జాపై ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని, తహసీల్దార్ కబ్జాదారులకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే ఆ భూమిని సందర్శించాలని, రైతులు పొలాలకు వెళ్లేలా దారి ఏర్పాటు చేయాలని కోరారు.

## అసహనంతోనే బీజేపీ ఎంపీలపై దాడులు

» కాంగ్రెస్‌పై కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపణ
» తోపులాటలో గాయపడిన బీజేపీ ఎంపీలకు కిషన్ పరామర్శ
» బండి సంజయ్, డా.కె.లక్ష్మణ్‌తో కలిసి ఆసుపత్రి సందర్శన

న్యూఢిల్లీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌ను తీవ్రంగా అవమానించిన కాంగ్రెస్, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. వివిధ రాష్ట్రాల ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలలో వరుసగా ఓటములు ఎదురవడంతో కాంగ్రెస్ నాయకుల్లో అసహనం పెరిగిపోయిందన్నారు. అందుకే పార్లమెంటును స్తంభింపచేసి బీజేపీ ఎంపీలపై దాడులకు పాల్పడుతున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం, పార్లమెంటులో జరిగిన తోపులాటలో గాయపడి రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీలు చంద్రప్రతాప్ సారంగి, ముఖేష్ రాజ్‌పుత్‌ను కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీ కె.లక్ష్మణ్‌తో కలిసి కిషన్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

పార్లమెంటు ఆవరణలో జరిగిన ఘటన అత్యంత దురదృష్టకరమని కిషన్‌రెడ్డి చెప్పారు. ఘటనకు బాధ్యత వహిస్తూ ఎంపీలకు, దేశ ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో అంబేడ్కర్‌ను అవమానించి, కేంద్ర మంత్రివర్గం నుంచి అవమానకరరీతిలో బయటకు పంపించిందంటూ ఆయన కాంగ్రెస్‌పై ఆరోపణలు చేశారు. అంబేడ్కర్‌కు భారతరత్న ఇవ్వకుండా కాంగ్రెస్ అడ్డుకుందని ఆరోపించారు. దేశ ప్రజలకు అన్ని విషయాలు తెలిసినందునే కాంగ్రెస్ డ్రామాలను నమ్మకుండా వరుస ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెబుతున్నారని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం అంబేడ్కర్ ఆలోచనలను సాకారం చేసే దిశగా కృషి చేస్తోందన్నారు. మరోవైపు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వైఖరిని ఖండిస్తూ పార్లమెంట్ ముందున్న గాంధీ, అంబేద్కర్ విగ్రహాల వద్ద శుక్రవారం రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, కె.లక్ష్మణ్, గొడం నగేష్ ఈ నిరసనలో పాల్గొని కాంగ్రెస్ పార్టీకి, రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## తెలంగాణ సీపీపీ కన్వీనర్‌గా మల్లు రవి

న్యూఢిల్లీ, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ(సీపీపీ) కన్వీనర్‌గా సీనియర్ ఎంపీ మల్లు రవిని ఆ పార్టీ అధినాయకత్వం నియమించింది. తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాలకు కూడా సీపీపీ కన్వీనర్లను నియమించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి, ఎంపీ అమర్ సింగ్ శుక్రవారం పేర్లను ప్రకటించారు. కేరళ, లక్షద్వీప్ కన్వీనర్‌గా ఆంటోనీ, తమిళనాడు, పుదుచ్చేరికి జోతిమణి, కర్ణాటకకు చంద్రశేఖర్, మహారాష్ట్ర, గోవాకు ప్రణీతి శిందే, రాజస్థాన్, గుజరాత్‌కు బ్రిజేంద్ర, హరియాణాకు వరుణ్ చౌదరి, పంజాబ్, చండీగఢ్ జమ్మూకశ్మీర్‌కు గుర్జీత్ సింగ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు ఇమ్రాన్ మసూద్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు సుఖ్‌దేవ్ భగత్, అస్సోం, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్‌కు రకిబుల్ హుస్సేన్‌లను సీపీపీ కన్వీనర్లుగా నియమించారు. వీరు ఆయా రాష్ట్రాలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ ఎంపీలను సమన్వయం చేయాలని, వారికి నాయకత్వం వహించాలని అమర్‌సింగ్ ప్రకటనలో స్పష్టం చేశారు.

## కొత్తగా రెండు కార్పొరేషన్లు, 12 మునిసిపాలిటీలు

» మహబూబ్‌నగర్, మంచిర్యాలకు నగరపాలక హోదా
» ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే నాలుగు కొత్త మునిసిపాలిటీలు
» రాష్ట్రంలో 153కి చేరిన పట్టణ ప్రాంతాలు

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా రెండు నగరపాలక సంస్థలు(కార్పొరేషన్లు) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే 12 నూతన మునిసిపాలిటీల ఏర్పాటుపైనా నిర్ణయం తీసుకుంది. నూతనంగా ఏర్పాటు చేసిన పురపాలికల్లో(మునిసిపాలిటీ) ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే నాలుగు ఉన్నాయి. ఈ జిల్లాలో కోహిర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్ కొత్త మునిసిపాలిటీలుగా ఆవిర్భవించాయి. మహబూబాబాద్‌లో కేసముద్రం, జనగాం జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్, నారాయణపేటలో మద్దూరు, ఖమ్మం జిల్లాలో ఏదులాపురం, భద్రాదికొత్తగూడెంలో అశ్వారావుపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో దేవరకద్ర, రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, మొయినాబాద్ కొత్త మునిసిపాలిటీలుగా ఏర్పడ్డాయి. అలాగే, ఇప్పటికే మునిసిపాలిటీలుగా ఉన్న వాటిలో అదనంగా మరికొన్ని గ్రామాలను విలీనం చేశారు. పరిగి మునిసిపాలిటీ పరిధిలో ఆరు గ్రామాలు, నర్సంపేట పరిధిలో ఏడు గ్రామాలను, నార్సింగ్‌లో జన్వాడ, శంషాబాద్‌లో శంకరాపురం, కరీంనగర్ పరిధిలో కొత్తపల్లి మునిసిపాలిటీతోపాటు మరో ఆరు గ్రామాలను ప్రభుత్వం విలీనం చేసింది. 80 గ్రామ పంచాయతీలను, 12 ఆవాసాలను కొత్త మునిసిపాలిటీల పరిధిలో విలీనం చేశారు. ఈ నూతన మునిసిపాలిటీలకు సంబంధించిన కార్యాలయాలు, ఉద్యోగుల కేటాయింపు తదితర అంశాలపై ప్రభుత్వం త్వరలోనే ఉత్తర్వులు ఇవ్వనుంది. ఇక, కొత్త నగర పాలక, పురపాలక సంస్థల ఏర్పాటుతో రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల(యుఎల్‌బీ) సంఖ్య 153కు పెరిగింది. కొత్తగా ఏర్పాటు చేసిన 12 మునిసిపాలిటీలతో పట్టణ ప్రాంత పరిధి 6000 చదరపు కిలోమీటర్ల మేర పెరిగింది.

# రోజుకు 3.5లక్షల సంపాదన

### గంజాయి డాన్ నీతూబాయ్ అసాధారణ దందా.. రోజుకు దాదాపు 20 కేజీల గంజాయి విక్రయం

» పోలీస్, ఎక్సైజ్ అధికారులకు లక్షల్లో లంచాలు!
» పట్టుబడితే బెయిల్ కోసం ప్రత్యేక లీగల్ టీమ్
» ఆమెపై తూతూ మంత్రంగా కేసుల నమోదు
» అర కేజీ, కేజీ మాత్రమే సీజ్ చేసినట్లు రికార్డులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీతాలు నెలకు రూ.50 వేల నుంచి ఉన్నతస్థాయిలో ఉన్నవారికైతే రూ.10 లక్షల దాకా ఉంటాయి! పాతికేళ్ల కష్టపడి చదువుకొని 30 ఏళ్ల కష్టపడ్డ ఐఏఎస్, ఐపీఎస్‌ల జీతం కూడా నెలకు రూ.5 లక్షల్లోపే!! కానీ.. హైదరాబాద్ గచ్చిబౌలి నానక్‌రామ్‌గూడ ప్రాంతంలో గంజాయి డాన్‌గా పేరొందిన నీతూబాయ్ నెలవారీ సంపాదన ఎంతో తెలుసా? అక్షరాలా కోటి రూపాయలు!! ఎక్సైజ్ ఉన్నతాధికారుల విచారణలో తేలిన విషయమిది! గంటకు సగటున 80 మంది కస్టమర్ల చొప్పున.. రోజుకు 15-20 కేజీల గంజాయి విక్రయిస్తున్న నీతూబాయ్ కుటుంబం తక్కువలో తక్కువ రూ.3.5లక్షలు సంపాదిస్తోంది. కొన్ని నెలల క్రితం ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ దూల్‌పేట' నేపథ్యంలో.. నీతూబాయ్ దందా గురించి విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. దూల్‌పేటకు వచ్చే గంజాయిలో సింహభాగం నానక్‌రామ్‌గూడలోని ఆమె అడ్డాకే చేరుతున్నట్లు వారి విచారణలో తేలింది. ఆమె దందాపై ఎక్సైజ్ ఉన్నతాధికారులు ప్రత్యేక టీమ్‌తో నిఘా పెట్టగా.. 15 నిమిషాల్లోనే 20 మంది కస్టమర్స్ గంజాయి కోసం వచ్చినట్లు వెల్లడైంది. ఇంత పెద్ద ఎత్తున గంజాయి దందా జరుగుతున్నా.. నానక్‌రామ్‌గూడ మరో దూల్‌పేటగా తయారైనా.. మామూళ్ల మత్తులో జోగుతున్న అక్కడి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై ఎక్సైజ్, పోలీస్ ఉన్నతాధికారులు తీవ్ర అసహనం వ్యక్తంచేసినట్లు సమాచారం.

నానక్‌రామ్‌గూడకు చెందిన నీతూబాయ్, మధుబాయ్ అత్తాకోడళ్లు. వీరికి దూల్‌పేటలో గంజాయి విక్రయించే కుటుంబాలతో సంబంధాలు ఉన్నాయి. ఈ క్రమంలో అత్తాకోడళ్లు ఇద్దరూ ఇతర ప్రాంతాలకు గంజాయి సరఫరా చేయడం, విక్రయించడం మొదలుపెట్టారు. గంజాయి కేసుల్లో పట్టుబడి నీతూబాయ్ గతంలో రెండు, మూడుసార్లు జైలుకెళ్లినా.. తిరిగొచ్చాక మళ్లీ అదే పని చేసేది. దీంతో 2021లో శేరిలింగంపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు ఆమెపై పీడీ యాక్టు నమోదు చేశారు. 2022 అక్టోబర్‌లో జైలు నుంచి విడుదలైన నీతూబాయ్ మళ్లీ అదే దందాను మొదలుపెట్టింది. ఈసారి పక్కా ప్రణాళిక ప్రకారం తన కుటుంబసభ్యులనూ రంగంలోకి దించింది. ప్లాన్‌లో భాగంగా నానక్‌రామ్‌గూడలో రెండు కిరాణా దుకాణాలను ఏర్పాటు చేసింది. ఒక దుకాణాన్ని ఆమె కొడుకు కళాపతి గౌతమ్ సింగ్ నడుపుతుండగా.. మరొక దుకాణాన్ని ఆమె అత్త మదుబాయ్ నడుపుతోంది. కళాపతిసింగ్ దూల్‌పేటకు వెళ్లి కేజీ రూ.8 వేల చొప్పున 20 కేజీల గంజాయి కొనుగోలు చేసి గుట్టుగా తన కిరాణా దుకాణానికి తరలిస్తాడు. ఆ గంజాయిని పదేసి గ్రాముల చొప్పున చిన్న చిన్న ప్యాకెట్లలో పెట్టి.. ఒక్కో ప్యాకెట్‌నూ రూ.250 చొప్పున వారు తమ దుకాణాల్లో విక్రయించేవారు. అంటే రూ.8 వేలకు కొని.. రూ.25 వేలకు అమ్ముతున్నట్టు! ఒక్కో కిలోపై రూ.17 వేల లాభం. రోజుకు 20 కేజీల గంజాయి అంటే.. దాదాపుగా రూ.3.4 లక్షలు!! ఏడాది క్రితం కళాపతి సింగ్‌ను అరెస్టు చేసిన టీ న్యాబ్ పోలీసులు.. వారి సంపాదనను చూసి అవాక్కయ్యారు. గంజాయి డబ్బులతో గాంధీనగర్‌లో జీ+2 ఇల్లు, లంగర్‌హౌజ్, గచ్చిబౌలిలో రెండు పెద్ద పెద్ద జీ+2 ఇండ్లు, రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసినట్టు గుర్తించారు. వాటితో పాటు.. 16 బ్యాంకు ఖాతాల్లో నిల్వ ఉన్న రూ. 1.53 కోట్లు ఫ్రీజ్ చేశారు. మొత్తం స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ. 5.2 కోట్లు.

### లక్షల్లో మామూళ్లు..


నీతూ సామ్రాజ్య విస్తరణకు ఎక్సైజ్, లా అండ్ ఆర్డర్ పోలీసులు పూర్తి సహకారం అందించినట్లు తెలుస్తోంది. అందుకు ప్రతిఫలంగా ఆమె వద్ద నుంచి ప్రతి నెలా ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు.. లా అండ్ ఆర్డర్ పెట్రోలింగ్ పోలీసులు రూ.లక్షల్లో మామూళ్లు తీసుకుంటున్నట్లు సమాచారం. ఎప్పుడైనా ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి వస్తే నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్న పోలీసులు.. కేవలం అరకిలో, కేజీ గంజాయి మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు రికార్డులో చూపిస్తున్నారు. దాంతో నిందితులు 10-15 రోజుల్లోనే బెయిల్‌పై బయటకు రావడానికి వీలవుతోంది. అంతేకాదు.. దాడులు జరిగే సమయంలో నీతూబాయ్ పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు పెట్రోలింగ్ పోలీసులు ఒక కిలోమీటర్ ముందు నుంచే సైరన్ వేస్తారని, ఆ సిగ్నల్‌తో నీతూబాయ్ కుటుంబం, కస్టమర్లు అప్రమత్తమై అక్కణ్నుంచీ తప్పించుకుంటారని.. పోలీసుల దాడులు, చెకింగ్ పూర్తయిన తర్వాత తిరిగి వారి దందా కొనసాగుతుందని సమాచారం. ఒకవేళ పట్టుబడి జైలుకు వెళ్లినా.. నీతూబాయ్‌ను వీలైనంత తక్కువ సమయంలో బయటకు తీసుకొచ్చేందుకు, జప్తు చేసిన ఆస్తులను విడిపించడానికి ఆమె ఏకంగా ప్రత్యేక లీగల్ టీమ్‌నే ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది.

## సాహితీ ఇన్‌ఫ్రా కేసులో రెండు చోట్ల ఈడీ సోదాలు

» రూ.6.15 కోట్ల విలువైన ఆభరణాలు, నగదు స్వాధీనం
» ఇప్పటి వరకు రూ.167.65 కోట్ల ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ
» ఈడీ నోటీసులకు స్పందించని బిల్డర్ సురేష్ కుమార్ అగర్వాల్

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాహితీ ఇన్‌ఫ్రా మోసాలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు హైదరాబాద్‌లో రెండు చోట్ల సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.6.15 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. సాహితీ ఇన్‌ఫ్రా కంపెనీతో భూముల క్రయవిక్రయాలకు సంబంధించి రూ.20 కోట్ల లావాదేవీలు నిర్వహించిన సీఎస్‌కే రియల్టర్స్, సింగ్ మాన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్లు సురేష్ కుమార్ అగర్వాల్, రక్షిత్ అగర్వాల్‌లకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. బషీర్‌బాగ్, ఆదర్శనగర్‌లో జరిపిన సోదాల్లో రూ.5.42 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు, రూ.72.75లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ అధికారులు తెలిపారు. సాహితీ ఇన్‌ఫ్రాకు చెందిన ఎండీ లక్ష్మీనారాయణను ఇప్పటికే ఈడీ అధికారులు అరెస్టు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ప్రీలాంచ్ ఆఫర్ల ద్వారా వేలాది మంది కొనుగోలుదారుల నుంచి రూ.842.15 కోట్లు సాహితీ ఇన్‌ఫ్రా సేకరించింది. ఇందులో రూ.216.91కోట్లను ఎక్కడా లెక్కల్లో చూపకుండా డైరెక్టర్లు, లక్ష్మీనారాయణ కలిసి సొంతానికి వాడుకున్నట్టు ఈడీ విచారణ లో వెల్లడైంది. ఈ క్రమంలో జరిపిన విచారణలో సురేష్ కుమార్ అగర్వాల్‌కు చెందిన రెండు కంపెనీలతో 20 కోట్ల లావాదేవీలు జరిగినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. దీంతో సురేష్ కుమార్ అగర్వాల్‌కు ఈడీ ఇటీవల నోటీసులు జారీ చేసింది. అయితే ఈ నోటీసులను సురేష్ కుమార్ అగర్వాల్ ఖాతరు చేయకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో సోదాలు నిర్వహించామని, త్వరలో మరోసారి నోటీసులు జారీ చేస్తామని హైదరాబాద్ ఈడీ అధికారులు తెలిపారు. సాహితీ ఇన్‌ఫ్రా కేసులో ఇప్పటి వరకు ఈడీ అధికారులు రూ.161.15కోట్ల ఆస్తులను అటాచ్ చేశారు. తాజా దాడులతో అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.167.65 కోట్లకు చేరిందని ఈడీ అధికారులు తెలిపారు.

## అప్పుల బాధతో నేత కార్మికుడి ఆత్మహత్య



గణేశ్ (ఫైల్)

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ నేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగింది. స్థానిక గాంధీనగర్‌కు చెందిన దూస గణేశ్(50) పవర్‌లూమ్ కార్మికుడిగా పని చేసేవాడు. సిరిసిల్లలో వస్త్రపరిశ్రమ సంక్షోభం కారణంగా ఏడాదిగా పని లేకుండా పోవడంతో జీవనోపాధి కోసం అప్పులు చేశాడు. పనిలేక.. అప్పులు తీర్చే మార్గం కనిపించక మనోవేదనకు గురైన గణేశ్ శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తాను అర్బన్ బ్యాంకు, ఓలా షోరూం, బజాజ్ ఫైనాన్స్‌వారికి రూ. 5 లక్షల వరకు అప్పు ఉన్నానని, వారు చాలా వేధించారని సూసైడ్ నోట్ రాశాడు. వేధింపులు భరించలేక, ఉపాధి లేక ఆత్మహత్య చేసుకుంటున్నానని, తనను క్షమించాలని అందులో పేర్కొన్నాడు. గణేశ్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అమిత్ షాను బర్తరఫ్ చెయ్యాలి

### అట్రాసిటీ కేసు పెట్టి కటకటాల్లోకి పంపాలి.. కాంగ్రెస్, వామపక్ష, దళిత సంఘాల డిమాండ్

» అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలు

కవాడిగూడ, ఇల్లెందు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చెయ్యాలని కాంగ్రెస్, వామపక్ష సంఘాలు, దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అమిత్‌షా అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చెయ్యాలని కోరారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ఆయా నేతలంతా లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసనలు చేశారు. టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు సునీతారావు ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మహిళలు నిరసనలో పాల్గొని అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వీ హనుమంతరావు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు అంబేడ్కర్ విగ్రహం వద్ద తన నిరసన తెలియజేశారు. మరోపక్క,షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు రాజు ఉస్తాద్ ఆధ్వర్యంలోనూ ఆందోళన జరిగింది. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వామపక్ష నేతలు పాలడుగు భాస్కర్, స్కైలాబ్ బాబు, మల్లు లక్ష్మి, ఆర్ శ్రీరాంనాయక్, టి సాగర్, ఎంవీ రమణ తదితరులు డిమాండ్ చేశారు. అమిత్ షా రాజీనామాకు డిమాండ్ చేస్తూ రాష్ట్ర బంద్ చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇల్లెందులో శుక్రవారం జరిగిన సీపీఎం మూడో జిల్లా మహాసభలో పాల్గొన్న తమ్మినేని ఈ వ్యాఖ్యలు చేశారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న మాజీ ఎంపీ వీ హనుమంతరావు, తదితరులు

### అంబేడ్కర్‌ను అవమానించింది కాంగ్రెస్సే : బీజేవైఎం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో అవమానించింది కాంగ్రెస్ పార్టీయేనని బీజేవైం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ అన్నారు. బీజేపీ ఎంపీలపై దాడి చేసిన రాహుల్‌గాంధీ తక్షణమే దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేవైం ఆందోళన చేపట్టింది. ఆందోళనలో భాగంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించింది. పోలీసులు వారిని అడ్డుకోవడంతో తోపులాట జరిగి కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పలువురు బీజేవైఎం నేతలను పోలీసులు అరెస్టు చేశారు.

# పార్శిల్‌లో మృతదేహం డెలివరీ

» పశ్చిమ గోదావరి జిల్లా యండగండిలో కలకలం
» ఇంటి నిర్మాణ సామగ్రి పంపిస్తున్నామంటూ ముందుగా ఫోన్
» సాయంత్రానికి ఆటోలో వచ్చిన చెక్కపెట్టె

ఉండి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'మీరు అడిగిన విధంగా మీ ఇంటి నిర్మాణానికి ఇప్పటికే టైల్స్, పెయింటింగ్ డబ్బాలు పంపించాం. మరి కొంత ఇంటి సామగ్రిని పంపిస్తున్నాం' అంటూ ఆమెకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. చెప్పిన విధంగానే ఆటోలో ఓ చెక్క పెట్టె వచ్చింది. ఆ పెట్టెను ఆమె తెరవగా తీవ్రమైన దుర్వాసనతో కుళ్లిపోయిన ఓ మృతదేహం కనిపించింది. దానిని చూడగానే ఆమె కేకలు వేస్తూ పరుగులు తీశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండి గ్రామంలో జరిగిందీ ఘటన. ఆ మృతదేహం ఎవరిది? దానిని ఎవరు పంపించారు? ఇక్కడికే ఎందుకు పంపించారు? తదితర విషయాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు యండగండికి చెందిన ముదునూరి రంగరాజుకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ వివాహాలయ్యాయి. పెద్ద కుమార్తె తులసిని నిడదవోలుకు చెందిన శ్రీనివాసరాజుకు ఇచ్చి పెళ్లి చేశారు. భర్తతో విభేదాల కారణంగా ఆమె కుమార్తెను తీసుకుని తల్లిదండ్రుల వద్దకు వచ్చేశారు. భీమవరంలోని ఒక ప్రైవేటు కంపెనీలో ఆమె ఉద్యోగం సంపాదించి పాలకోడేరు మండలం గరగపర్రులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. యండగండిలో తులసికి జగనన్న కాలనీలో స్థలం వచ్చింది. ఆమె ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో ఇల్లు కట్టుకునేందుకు సాయం చేయాలని రాజమహేంద్రవరంలోని క్షత్రియ సేవా సమితికి దరఖాస్తు పెట్టుకున్నట్టు చెబుతున్నారు. దీంతో ఇంటికి అవసరమైన టైల్స్, పెయింటింగ్ డబ్బాలు రెండు విడతలుగా వచ్చాయి. ఇదే విషయాన్ని ఆమె వాట్సప్‌కు సమాచారం ఇచ్చారు. గురువారం తులసికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. మరింత సామగ్రిని పంపిస్తున్నట్టు అవతలి వ్యక్తులు తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు ఒక చెక్క పెట్టెను ఆటోలో తీసుకువచ్చి ఇంటి వద్ద దించారు. చెక్క పెట్టెను తెరిచే ప్రయత్నం చేయగా, దానికి తాళం వేసి ఉంది. తాళం చెవితోపాటు ఒక లేఖను పెట్టెకు ఉన్న కవర్‌లో పెట్టారు. 'మీరు కోటీ 30 లక్షలు చెల్లించాలి. లేకపోతే ఇబ్బందులు తప్పవు' అని ఆ లేఖలో రాసి ఉంది. పెట్టె తెరవగానే దుర్వాసన గుప్పుమంది. లోపల పేపర్లు కప్పి ఉన్నాయి. వాటిని తొలగించి చూడగా, కుళ్లిపోయిన మృతదేహం కనిపించింది. తండ్రీకూతురు కేకలు వేస్తూ గ్రామంలోకి పరుగులు తీశారు. స్థానికులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. పోలీసులు భారీ సంఖ్యలో గ్రామంలో మోహరించారు. 45 ఏళ్ల వయసున్న మగ వ్యక్తి మృతదేహంగా తేల్చారు. శుక్రవారం ఉదయం జిల్లా ఎస్పీ నయీం అద్నాన్ అస్మీతోపాటు పోలీసులు గ్రామంలో తనిఖీలు చేపట్టారు. రంగరాజు, తులసిని పోలీసు స్టేషన్‌లోనే ఉంచి విచారిస్తున్నారు. మరోవైపు పార్శిల్ తెచ్చిన ఆటోవాలాను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పెట్టె ఎక్కడి నుంచి తీసుకువచ్చారు? ఎవరు ఇచ్చారు? ఇక్కడికి తీసుకెళ్లమని ఎవరు చెప్పారు? తదితర వివరాలు రాబడుతున్నారు. అలాగే, రంగరాజు చిన్న కుమార్తె భర్త.. మొగల్తూరుకు చెందిన సిద్దార్థవర్మను పోలీసులు హైదరాబాద్‌లో పట్టుకున్నట్లు తెలిసింది. క్షత్రియ సేవా సమితి నుంచి మృతదేహం పార్శిల్ వచ్చినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదంటూ రాజమండ్రికి చెందిన క్షత్రియ సేవా సమితి ఖండించింది. రాజమండ్రిలో క్షత్రియ సేవా సమితి తప్ప క్షత్రియ పరిషత్ అనేది లేదని ఓ ప్రకటనలో పేర్కొంది.

# అప్పుల నుంచి దృష్టి మళ్లించేందుకే!

## ఫార్ములా ఈ-కార్ రేసుపై కేసు అందుకే.. సీఎం రేవంత్.. సర్కస్‌ను నడుపుతున్నటుంది




- ఆర్థిక పరిస్థితిపై మంత్రులకు అవగాహన లేదు
- మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎడాపెడా చేస్తున్న అప్పుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఫార్ములా-ఈ రేసు కేసును ముందుకు తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఫార్ములా -ఈ కార్ రేసు కేసులో అవినీతి జరగలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా వెల్లడించారని పేర్కొంటూ, నిబంధనల మేరకు నిధుల బదిలీ జరగలేదని ఆయన చెప్పారని గుర్తుచేశారు. హైదరాబాద్ నగర ప్రగతికి దోహదపడే ఏ కార్యక్రమానికైనా నిధులు ఖర్చు చేయవచ్చని హెచ్ఎండీఏ చట్టంలోనే ఉందని స్పష్టం చేశారు. హెచ్ఎండీఏ చేపట్టే ప్రతి పనికీ ప్రభుత్వ అనుమతి అవసరం లేదని కేటీఆర్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ చాంబర్‌లో కేటీఆర్ మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కారును కాకుండా సర్కస్ నడుపుతున్నారని మండిపడ్డారు. రూ.50 లక్షలతో రేవంత్ దొరికితే అది ఏసీబీ కేసు అయిదని, ఫార్ములా-ఈ రేసు కేసులో రూపాయి కూడా దొరకలేదని, అలాంటప్పుడు ఈ కేసును ఏసీబీ ఎలా చూస్తుందని ప్రశ్నించారు. ఏ కేసు ఎవరికి ఇవ్వాలో కూడా ఈ ప్రభుత్వానికి తెలియదని ఎద్దేవా చేశారు. "ఓఆర్ఆర్ టోల్‌టాక్స్ టెండర్‌తో వచ్చిన రూ.7 వేల కోట్లను రుణ మాఫీకి వెచ్చించాం. కొవిడ్‌తో అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడంలో భాగంగా వనరుల సమీకరణకు అప్పటి మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో సబ్ కమిటీ ఉండేది. ఆ సబ్ కమిటీ నిర్ణయం మేరకే ఓఆర్ఆర్ టెండర్ నిధులను రుణమాఫీకి ఇచ్చాం" అని కేటీఆర్ వివరించారు. టోల్‌గేట్ కాంట్రాక్టు టెండర్లలో గోల్‌మాల్ జరిగితే.. దానిని రద్దుచేసి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌కు సవాల్ చేశారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) లాగే తాము కూడా ఓఆర్ఆర్ టెండర్ పిలిచి నిధులు సేకరించామని తెలిపారు. ఓఆర్ఆర్ లీజులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ గతంలో రేవంత్ చేసిన ఆరోపణపై హెచ్ఎండీఏ అప్పట్లో పరువు నష్టం దావా వేసిందని గుర్తుచేశారు. ఆ కేసు ఇప్పటికీ అలాగే ఉందని చెప్పారు. అసెంబ్లీలో సభ్యులపై చెప్పులు ఎలా విసరాలో కూడా ఎమ్మెల్యేలకు శిక్షణ ఇచ్చారా? అని ప్రభుత్వంపై కేటీఆర్ మండిపడ్డారు. ఆర్థిక పరిస్థితిపై మంత్రులకు కనీస అవగాహన లేదని విమర్శించారు. పునశ్చరణ తరగతులు నిర్వహించాల్సింది ఎమ్మెల్యేలకే కాదు.. మంత్రులకు కూడా అని వ్యాఖ్యానించారు.

# కేటీఆర్‌పై ఈడీ కేసు

## పీఎంఎల్ఏ, ఫెమా చట్టం కింద నమోదు

- ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈసీఐఆర్
- ఇందులోనూ కేటీఆరే ఏ1.. ఒకటి రెండు రోజుల్లో నోటీసులు
- క్వాష్ పిటిషన్ వేయనున్న మాజీ మంత్రి!

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా కేసు నమోదు చేసింది. కేటీఆర్, అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డిపై ఈడీ అధికారులు కేసు పెట్టారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ), విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) కింద కేటీఆర్ తదితరులపై ఈడీ అధికారులు 'ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్)' నమోదు చేశారు. ఇప్పటికే ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా కేసు పత్రాలను, పురపాలక శాఖ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు ప్రతులను తమకు పంపించాలని ఏసీబీకి ఈడీ అధికారులు శుక్రవారం లేఖ రాశారు. ఏసీబీ కేసు ఫైల్ సాయంత్రానికి ఈడీ కార్యాలయానికి చేరింది. దీంతో ఈసీఐఆర్ నమోదు చేశారు. ఇందులోనూ కేటీఆర్‌ను ఏ1గా పేర్కొన్నారు. అర్వింద్‌కుమార్‌ను ఏ2గా, బీఎల్ఎన్ రెడ్డిని ఏ3గా చూపారు. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించి బ్రిటన్‌కు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ)కు సుమారు రూ.46 కోట్లను డాలర్ల రూపంలో పంపడంపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించనుంది. ఎఫ్ఈఓతో ఒప్పందం జరగడానికి ముందే నిధులను డాలర్ల రూపంలో పంపడం, ఒప్పందంతో ఎలాంటి సంబంధం లేని హెచ్ఎండీఏ ఖాతా నుంచి ఈ డబ్బును పంపడం నిబంధనలకు పూర్తి విరుద్ధమని ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో స్పష్టం చేసింది. వాస్తవానికి డాలర్ల రూపంలో విదేశీ కంపెనీకి డబ్బు పంపించాలంటే భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) నుంచి అనుమతి తీసుకోవాలి. మరోవైపు విదేశీ కంపెనీతో రాష్ట్రం ఏదైనా ఒప్పందం చేసుకుంటే దానికి క్యాబినెట్ అనుమతి ఉండాలి. గవర్నర్ అనుమతి కూడా ఉండాలి. కానీ, ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో నాటి మంత్రి కేటీఆర్ ఆదేశాలతో పూర్తిగా నిబంధనలు ఉల్లంఘించి రూ.46 కోట్లను డాలర్ల రూపంలో పంపడం వల్ల హెచ్ఎండీఏ దాదాపు రూ.8 కోట్లు ఆదాయ పన్ను చెల్లించాల్సి వచ్చిందని ఏసీబీ అధికారులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కాగా, విచారణకు హాజరు కావాలంటూ కేటీఆర్, అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్‌రెడ్డికి ఈడీ అధికారులు ఒకటి రెండు రోజుల్లో నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది.

### ఈడీ కేసుపైనా హైకోర్టుకు..?

ఏసీబీ కేసు విషయంలో కేటీఆర్‌కు హైకోర్టులో కొంత ఊరట లభించగా.. ఆపై గంటల వ్యవధిలోనే ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు. దీంతో ఈ కేసుపైనా కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది. పీఎంఎల్ఏ, ఫెమా చట్టం ప్రకారం ఈడీ కేసు నమోదు చేయడంతో క్వాష్ పిటిషన్‌పై సుదీర్ఘవాదనలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. క్వాష్ పిటిషన్ వేయకుండా, ఈడీ విచారణకు హాజరు కావాలా? వద్దా? అనే విషయంపైనా బీఆర్ఎస్ నేతలు న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

# పదేళ్లలో బంగారమైంది కేసీఆర్ కుటుంబమే

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం బంగారు తెలంగాణ కాకపోయినా కేసీఆర్ కుటుంబం మాత్రం బంగారమైందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఓ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కృషి చేయలేదని, ఒక్కరికి కూడా విద్య అందించలేదని మంత్రి విమర్శించారు. సాగు చేస్తున్న భూమి అంతటికీ తమ ప్రభుత్వం రైతు భరోసా' ఇవ్వనుందని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం అసెంబ్లీలో ప్రకటన చేస్తారని తెలిపారు. వచ్చే సంక్రాంతి నుంచి రైతుభరోసా అమలు జరుగుతుందని చెప్పారు.

# కేటీఆర్‌కు నోటీసులు?

## నేడో రేపో ప్రశ్నించనున్న ఏసీబీ!

- దర్యాప్తు కొనసాగించవచ్చన్న హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చేందుకు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సిద్ధమైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దన్న హైకోర్టు.. దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. దీంతో ఏ1 కేటీఆర్‌తో పాటు అర్వింద్‌కుమార్, సుబ్బారెడ్డిలకు నోటీసులు ఇవ్వడానికి ఏసీబీ అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది. 'ఫార్ములా-ఈ కారు రేసులో మీపై ఎఫ్ఐఆర్ దాఖలైంది. విచారణకు రండి' అని కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వనున్నారు. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు గురువారం సాయంత్రం ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఏసీబీ కోర్టుకు పంపారు. వాస్తవానికి శుక్రవారం ఉదయమే కేటీఆర్ తదితరులకు నోటీసులు ఇవ్వడానికి సిద్ధమవగా.. ఆయన క్వాష్ పిటిషన్ దాఖలు చేయడంతో హైకోర్టు నిర్ణయం కోసం ఎదురుచూశారు. ఈ నెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని, తదుపరి విచారణ కొనసాగించాలని కోర్టు స్పష్టం చేసింది. దీంతో కేటీఆర్ విచారణకు ప్రశ్నావళిని రూపొందించే పనిలో ఏసీబీ బృందం నిమగ్నమైనట్లు సమాచారం. ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో నాటి పురపాలకశాఖ కార్యదర్శి అర్వింద్‌కుమార్ విదేశీ కంపెనీతో ఒప్పందం చేసుకోవడం, డబ్బు చెల్లించడం గురించి ఫైలు పంపితే ఆ వివరాలను క్యాబినెట్ ముందు ఉంచకుండా, ఆర్థిక శాఖ అనుమతి తీసుకోకుండా 46 కోట్ల విడుదలకు ఆదేశాలు ఎందుకు ఇచ్చారు? ఒప్పందం జరగడానికి ముందే నిధుల విడుదల ఎలా జరిగింది? డాలర్లలో చెల్లింపులకు ఆర్బీఐ అనుమతి ఎందుకు తీసుకోలేదు? విదేశీ కంపెనీతో ఒప్పందం జరిగితే ఆ ఫైలును గవర్నర్‌కు ఎందుకు పంపలేదు? వంటి ప్రశ్నలతో ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను విచారించనున్నారు. కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసిన తర్వాత ఆయనను ఏసీబీ ప్రధాన కార్యాలయంలో విచారించనున్నారు.

# 30 వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)



వాయిదా వేసింది. తమది రెగ్యులర్ బెంచ్ కానందున.. రెగ్యులర్ రోస్టర్ కలిగిన ధర్మాసనం ఎదుట లిస్ట్ చేయాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. ప్రజాప్రతినిధుల క్రిమినల్ కేసుల విచారణ రోస్టర్ కలిగిన జస్టిస్ కె.లక్ష్మణ్ సెలవులో ఉండడంతో ఈ పిటిషన్ జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఎదుట శుక్రవారం విచారణకు వచ్చింది. క్వాష్ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని ఉదయం 10.30 గంటలకు కేటీఆర్ తరఫు న్యాయవాదులు ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు కోరారు. లంచ్ మోషన్ రూపంలో అత్యవసర విచారణకు ధర్మాసనం అనుమతించింది. మధ్యాహ్నం 3.30 గంటలకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం కేటీఆర్ తరఫున వాదనలు ప్రారంభించారు. కేవలం రాజకీయ, వ్యక్తిగత కుట్ర కారణంగానే ఈ కేసు పెట్టారని ఆరోపించారు. హైదరాబాద్ ఖ్యాతిని పెంచేందుకు, దేశంలోనే ఫార్ములా-ఈ రేస్ నిర్వహించిన తొలి నగరంగా నిలిపేందుకు అప్పటి ప్రభుత్వం కృషి చేసింది. అందులో భాగంగానే మూడు పక్షాల మధ్య మొదటి ఒప్పందం జరిగింది. ఈ రేసుకు ప్రజల్లో ఆసక్తి ఉంది. రూ.వందల కోట్ల వ్యాపారం జరిగింది. 9వ సీజన్ తర్వాత 10వ సీజన్ నిర్వహించే నాటికి స్పాన్సర్ వెనక్కి తగ్గడంతో రూ.కోట్లు వెచ్చించి చేసిన ఏర్పాట్లు వృథా కారాదని, ఈవెంట్ కుప్పకూలిపోకూడదని, హైదరాబాద్ ఖ్యాతి నిలబడాలని, ఫార్ములా రేస్ నిర్వహించిన అంతర్జాతీయ నగరంగా గుర్తింపు పొందాలనే ఉద్దేశంతో ప్రభుత్వమే స్పాన్సర్‌గా ముందుకొచ్చి రెండో ఒప్పందం చేసుకుంది. పిటిషనర్ వ్యక్తిగతంగా లబ్ధి పొందినట్లు, నిధులు దుర్వినియోగం చేసినట్లు ఎక్కడా లేదు. ఏమైనా విభేదాలు ఉంటే ఒప్పందంలో ఆర్బిట్రేషన్ క్లాజ్ ఉంది. కాబట్టి ఏసీబీ నమోదు చేసిన సెక్షన్లకు కావాల్సిన ముడిసరుకు ఎఫ్ఐఆర్‌లో లేదు. మరోవైపు 14 నెలల కింద జరిగిన వ్యవహారానికి ఇప్పుడు కేసు పెట్టడం ఏంటి? 'లలిత కుమారి' 'చరణ్‌సింగ్' తీర్పుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం తీవ్రమైన కేసు నమోదులో జాప్యం ఉంటే ప్రాథమిక దర్యాప్తు చేయాలి. ఫిర్యాదు చేసిన మరుసటి రోజే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో ప్రాథమిక దర్యాప్తు ఎక్కడ ఉంది. కేసు నమోదు చేసిన అధికారే ప్రాథమిక దర్యాప్తు చేయాలి. కానీ, ఫిర్యాదుదారైన ప్రభుత్వం ప్రాథమిక దర్యాప్తు ముందే పూర్తి చేసిన తర్వాత ఫిర్యాదు చేస్తుందా? ఇదెక్కడి విడ్డూరం? ప్రభుత్వానికి అంత చిత్తశుద్ధి ఉంటే ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ) సంస్థను ఎందుకు నిందితుల జాబితాలో చేర్చలేదు? అంత దమ్ము ప్రభుత్వానికి ఉందా? ఆ సంస్థ అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కోర్టులో కేసు వేసింది. అక్కడ పరువుపోతుందని ప్రభుత్వానికి తెలుసు. ఇది ఒక చట్టబద్ధమైన ఒప్పందం. దీనికి సంబంధించి వ్యక్తులకు క్రిమినల్ లయబిలిటీ అంటగట్టడం సరికాదు. ఈ-రేస్‌పై ప్రజల్లో ఆసక్తి ఉంది. భారీగా వ్యాపారం జరిగింది. రూ.110 కోట్ల లాభం వచ్చింది. లాభం వచ్చిన వ్యాపారాన్ని ఎవరైనా కాదనుకుంటారా? ప్రస్తుత ప్రభుత్వం అత్యంత చెత్త నిర్ణయం తీసుకుంది. డబ్బులు చెల్లించకుండా ఒప్పందాన్ని ఉల్లంఘించింది. కేవలం రాజకీయ కుట్రతో నమోదైన కేసు కాబట్టి ఇది న్యాయసమీక్షకు నిలవదు. కేసును కొట్టేయాలి. అప్పటివరకు కేసులో పిటిషనర్ అరెస్ట్ సహా అన్ని ప్రొసీడింగ్స్‌పై స్టే ఇవ్వాలి' అని పేర్కొన్నారు.

### కేటీఆర్ పాత్ర ఏంటనేది దర్యాప్తులో తేల్చుతాం: ఏజీ

అసలు జరగని ఒప్పందానికి ముందే చెల్లింపులు చేశారని.. ప్రజాధనాన్ని ఇష్టానుసారంగా, బిజినెస్ రూల్స్‌కు విరుద్ధంగా, రెగ్యులేటరీ అనుమతులు లేకుండా చెల్లింపులు చేశారన్న ఆరోపణలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం, ఏసీబీ తరఫున హాజరైన అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 'ప్రాథమిక దర్యాప్తు జరగలేదని పిటిషనర్ చేస్తున్న ఆరోపణ తప్పు. పిటిషనర్‌కు వ్యతిరేకంగా కేసు నమోదుకు గవర్నర్ అనుమతి పొందాం. అక్టోబరు 18న ప్రభుత్వం ఫిర్యాదు చేస్తే, దర్యాప్తు అధికారి ప్రాథమిక దర్యాప్తు చేసిన తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదైంది. ప్రాథమిక కేసు లేదని ఆరోపిస్తున్నారు. అదీ నిజం కాదు. విదేశీ సంస్థకు చెల్లింపులు చేయడంలో తీవ్రమైన ఉల్లంఘనలు జరిగాయి. స్పాన్సర్ వెళ్లిపోయిన తర్వాత రెండో ఒప్పందం జరగడానికి ముందే చెల్లింపులు చేశారు. దీన్నిబట్టి పిటిషనర్‌కు దురుద్దేశం ఉన్నట్లే. రూ.55 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైంది. డబ్బును విదేశీ మారకంలో చెల్లించారు. అది కూడా ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పుడు చెల్లింపులు చేశారు. రెగ్యులేటరీ అనుమతులు లేకుండా, విదేశీ మారకంలో చెల్లించడం వల్ల హెచ్ఎండీఏకు అదనంగా జరిమానాలు పడ్డాయి. దీనికి తోడు మౌలిక సదుపాయాలకు అదనంగా ఖర్చుపెట్టారు. 110 కోట్లు లాభం వచ్చిందని చెబుతున్నారు. అలా వస్తే స్పాన్సర్ సంస్థ ఎందుకు డీఫాల్ట్ చేసి వెళ్లిపోయింది? ఎఫ్ఐఆర్ ఇప్పుడే నమోదైంది. ఎవరు నిందితులు? కేటీఆర్ పాత్ర ఏంటి? ఎవరు లబ్ధిదారులు? అనేది దర్యాప్తులో తేలుతుంది. ఎఫ్ఐఆర్ అనేది ప్రాథమిక రిపోర్ట్ మాత్రమే. అది ఎన్‌సైక్లోపీడియా కాదు. అన్ని విషయాలు చార్జిషీట్‌లో ఉంటాయి. చెల్లింపుల్లో తీవ్రమైన ఉల్లంఘనలు, బిజినెస్ రూల్స్‌కు విరుద్ధంగా జరిగినట్లు ఎఫ్ఐఆర్ నిరూపిస్తోంది. గవర్నర్ అనుమతి సైతం ఉంది. ఈ దశలో జోక్యం చేసుకోవడం వల్ల దర్యాప్తుకు తీవ్ర విఘాతం కలుగుతుంది' అని ఏజీ పేర్కొన్నారు.





## జైలుకు వెళ్తే యోగా చేస్తానన్న కేటీఆర్‌లో

# ఇప్పుడెందుకు భయం?

- తప్పు చేయకపోతే విచారణను ఎదుర్కోవచ్చుగా
- కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర సమస్యగా చిత్రీకరిస్తున్నారు
- గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుపై సభలో చర్చ ఎందుకు: సీతక్క
- కార్ రేసింగ్ అక్రమాలపై ఆధారాలున్నాయి: మహేశ్‌కుమార్
- కేటీఆర్‌పై ప్రజాస్వామ్యబద్ధంగా కేసు నమోదు: మల్లు రవి

హైదరాబాద్, న్యూఢిల్లీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కేసులో జైలుకు వెళితే యోగా చేసుకుంటానన్న కేటీఆర్.. ఇప్పుడెందుకు భయపడుతున్నారని మంత్రి సీతక్క ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టులకు వెళితే తప్పు పట్టిన ఆయనే.. ఇప్పుడు ఎందుకు కోర్టు మెట్లు ఎక్కారని నిలదీశారు. ఫార్ములా-ఈ కేసులో ఆయన తప్పు లేకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటికి రావచ్చు కదా అన్నారు. కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర సమస్యగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ లాబీల్లో శుక్రవారం మీడియాతో ఆమె చిట్‌చాట్‌గా మాట్లాడారు. పార్లమెంటులో అంబేడ్కర్‌కు, అసెంబ్లీలో దళిత స్పీకర్‌కు అవమానం జరిగిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేబినెట్ ఆమోదం తీసుకుని ఫార్ములా ఈ రేస్‌కు కేటీఆర్ డబ్బులు చెల్లించారా? అని ప్రశ్నించారు. ఈ అంశంపైన ఇప్పుడు చర్చకు పట్టుపడుతున్న బీఆర్ఎస్ పార్టీ.. బీఏసీ సమావేశంలో ఎందుకు చర్చ కోరలేదని ప్రశ్నించారు. గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుపై సభలో చర్చ అవసరం లేదన్నారు. కాగా కేటీఆర్‌లో అహంకారం పరాకాష్ఠకు చేరిందని, ఆయనపై నమోదైన కేసు సక్రమేనని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అక్రమాలు జరిగినట్లుగా పలు ఆధారాలు స్పష్టంగా ఉన్నప్పటికీ కడిగిన ముత్యాన్ని.. స్వాతిముత్యాన్ని అంటూ కేటీఆర్ తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. శుక్రవారం శాసనమండలి మీడియా పాయింట్‌లో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కేటీఆర్‌పై చట్టపరంగా కేసు నమోదవడంతో ఈవిషయంపై ఇక కోర్టులో తేల్చుకోవాలని సూచించారు. కేసుకు సంబంధించి ప్రభుత్వం పంపిన ఆధారాలపై గవర్నర్ న్యాయనిపుణుల సలహా తీసుకొని కేసుకు అనుమతించారని, అలాంటప్పుడు అక్రమకేసు ఎలా అవుతుంది? అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ-కారు రేసు పేరుతో నిధులు గోల్‌మాల్ చేసి.. ఇప్పుడు సుద్దపూసలా కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

### గవర్నర్ అనుమతి తర్వాతే కేసు: మల్లురవి

ఫార్ములా రేస్ కేసులో కేటీఆర్‌పై ప్రజాస్వామ్య బద్ధంగా కేసు నమోదు చేసినట్టు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ రాష్ట్ర కన్వీనర్, ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు. కేసు నమోదులో ఎక్కడా తొందర పడలేదని, గవర్నర్ అనుమతి తర్వాతే ఏసీబీ కేసు నమోదు చేసిందన్నారు. కేటీఆర్ ఏం చెప్పాలని అనుకుంటున్నారో విచారణ అధికారులకు చెప్పొచ్చునని సూచించారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి మల్లు రవి మీడియాతో మాట్లాడారు. తమకు అసెంబ్లీలో కొంత బలం ఉందనే ధైర్యంతో సభను నడవకుండా బీఆర్ఎస్ అడ్డుకోవడం సరికాదన్నారు. తెలంగాణలో రక్తపాతంలేని విప్లవాత్మక పాలనను అందిస్తున్నామని తెలిపారు. బీజేపీకి ప్రజల సమస్యలపై చర్చించే ఉద్దేశమే లేదని, పార్లమెంట్ సమావేశాల్లో ప్రజల కోసం ఎటువంటి నిర్ణయం తీసుకున్నారో కేంద్రం చెప్పాలని డిమాండ్ చేశారు.

# రాహుల్‌గాంధీ దేవుడిని మొక్కినా.. ప్రచారం చేసుకోరు

## మోదీ, అమిత్‌షాలు పబ్లిసిటీ చేసుకుంటారు.. రాహుల్‌కు, వారికి ఉన్న తేడాను గమనించాలి

- రాజ్యాంగాన్ని నిర్మించే బాధ్యతను అంబేడ్కర్‌కు ఇచ్చింది నెహ్రూనే
- బీజేపీ నేతలు చరిత్ర తెలియకుండా మాట్లాడుతున్నారు
- ఆ రాజ్యాంగమే.. ప్రజలకు రక్షణ కవచం
- దాని వల్లే మోదీ,షాలకు పదవులు దక్కాయి
- అలాంటి రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది
- నెహ్రూ ముని మనవడిగా రాహుల్.. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత తీసుకున్నారు
- అమిత్‌షా క్షమాపణ చెప్పే వరకూ పోరాటం ఆగదు
- ఆయన ఏ పిలుపు ఇచ్చినా అమలు చేసేందుకు మేము సిద్ధం
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రతి రోజూ ఇంట్లో దేవుడికి మొక్కినా.. ఫొటోలు తీయించుకుని ప్రచారం చేసుకోరు. మోదీ, అమిత్‌షాలు మాత్రం దేవుడిని మొక్కినప్పుడు ఫొటోలు తీయించుకుని మరీ ప్రచారం చేసుకుంటారు. రాహుల్‌కు, వారికి ఉన్న తేడా ఇదే. ప్రజలు దీన్ని గమనించాలి" అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. భగవంతుడు, రాజ్యాంగం వేర్వేరు అంశాలని, ఈ మాత్రం జ్ఞానం అమిత్‌షా, బీజేపీకి లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. దేవుడిని ఎవరి మనసులో వారు మొక్కుకుంటారని, పార్లమెంటులో ప్రజా సమస్యలపై మాట్లాడాలని హితవు పలికారు. దేవుడి పేరు చెప్పుకుని బతికే బీజేపీ నేతలకు ఈ ఆలోచన లేక పోవడం బాధాకరమన్నారు. గాంధీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తూర్పు జగ్గారెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానించడంపై రాహుల్‌గాంధీ గళం ఎత్తితే, ఆయనపై బీజేపీ ఎంపీలు దాడికి పాల్పడడాన్ని టీపీసీసీ తరఫున ఖండించారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశ ప్రజలకు ఒక ధైర్యం.. రక్షణ కవచమన్నారు. దాని వల్లే దేశంలోని ప్రజలకు హక్కులు అమలవుతున్నాయని, న్యాయం అందుతుందని, కులం-మతం అనే తేడాలు లేకుండా ప్రశాంతంగా జీవించగలుగుతున్నారని చెప్పారు. మోదీ ప్రధాని అయ్యారన్నా.. అమిత్‌షా కేంద్ర హోం మంత్రి అయ్యారన్నా ఆ రాజ్యాంగం వల్లేనని చెప్పారు. న్యాయశాఖ మంత్రిగా ఉన్న అంబేడ్కర్‌కు రాజ్యాంగాన్ని నిర్మించే బాధ్యత ఇచ్చింది.. నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూనే అని జగ్గారెడ్డి గుర్తు చేశారు. నిన్న, మొన్న పుట్టిన బీజేపీ నేతలు.. చరిత్ర తెలుసుకోకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తుంటే.. నెహ్రూ మునిమనుమడిగా కాపాడే బాధ్యతను రాహుల్‌గాంధీ తీసుకున్నారన్నారు. ప్రజా సమస్యలపై పార్లమెంటులో మాట్లాడే రాహుల్‌గాంధీని.. రాజకీయ కుట్రతో గత ఏడాదంతా పార్లమెంటుకు రాకుండా చేశారని, ఇప్పుడు కూడా ఆయన పార్లమెంటుకు రాకుండా దాడి చేసి అడ్డుకుంటున్నారన్నారు. అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానించారని, ఆయన క్షమాపణలు చెప్పేదాకా రాహుల్‌గాంధీ పోరాటం ఆగదని అన్నారు. ఈ యుద్ధంలో రాహుల్‌గాంధీ ఏ పిలుపు ఇచ్చినా అమలు చేయడానికి తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలుగా తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

# రేవంత్ పెట్టింది డొల్లకేసు

- హైకోర్టు ఉత్తర్వులతో ఆ విషయం తేటతెల్లం
- తొలి అడుగులోనే కేటీఆర్ నైతిక విజయం
- ఫార్ములా రేస్ రద్దుతో రాష్ట్రానికి చెడ్డపేరు
- బయటపడ్డ కాంగ్రెస్, బీజేపీ దోస్తానా: హరీశ్



హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి పెట్టించింది డొల్ల కేసు అనే విషయం హైకోర్టు ఉత్తర్వులతో తేటతెల్లమైందని.. మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ వ్యవహారంలో అవినీతే లేనప్పుడు ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) పరిధిలో కేసు ఎలాపెడతారని ఆయన ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబం చేస్తున్న అరాచకాలు, అవినీతిని కేటీఆర్ బహిర్గతం చేసినందుకే.. కుట్రతో ఆయనపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ఈ కేసు విషయంలో కేటీఆర్ తొలి అడుగులోనే నైతిక విజయం సాధించారని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని.. ఫార్ములా ఈరేస్‌కు సంబంధించి రాష్ట్రానికి రూ.500 కోట్లు నష్టం కలగకుండా చూశానని ఆయన చెప్పడం సత్యదూరమని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి తుగ్లక్ నిర్ణయాల కారణంగా.. ఫార్ములా ఈ రేస్ ద్వారా రాష్ట్రానికి రావాల్సిన రూ.600 కోట్ల ఆదాయం రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాక.. రేస్ నిర్వహించకుండా తెలంగాణ ప్రభుత్వానికి ప్రపంచస్థాయిలో చెడ్డపేరు తెచ్చిపెట్టారని ఆయన విమర్శించారు. ఫార్ములా ఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చించాలని కోరితే బీఆర్ఎస్ సభ్యులను బయటకు పంపి చర్చించారని.. తమకు అవకాశమిస్తే ప్రజలకు వాస్తవాలు తెలిసేవని అన్నారు. ఈ రేస్ నిధుల చెల్లింపుల్లో క్రమరాహిత్యం ఉంది తప్ప.. చట్టవిరుద్ధంగా ఏం జరగలేదని ఆయన పేర్కొన్నారు. ఇదే విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం అంగీకరించారని చెప్పారు.

### రాష్ట్రానికి ఆదాయం..

హైదరాబాద్‌లో 2020లో జరిగిన రేస్‌ను ప్రపంచవ్యాప్తంగా 55 కోట్ల మంది ప్రసారమాధ్యమాల ద్వారా వీక్షించారని హరీశ్ తెలిపారు. ఈ ఈవెంట్ నిర్వహణ వల్ల రాష్ట్రానికి రూ.700కోట్ల ఆదాయం వచ్చినట్లు నీల్సన్ సంస్థ అధ్యయనంలో తేలిందని చెప్పారు. తమ హయాంలో ఈ ఈవెంట్‌కు 30 కోట్లు ఖర్చుపెడితే జీఎస్టీ రూపంలో రాష్ట్ర ఖజానాకు రూ.71 కోట్లు వచ్చిందని.. కాంగ్రెస్ సర్కార్ 45కోట్లు చెల్లించి ఈవెంట్ జరిపి ఉంటే రాష్ట్రానికి 600 కోట్ల లాభం వచ్చేదని పేర్కొన్నారు. రేవంత్ చర్యల వల్ల రాష్ట్ర పరపతి, హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతింటున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. "ఫార్ములా ఈ రేస్ కేసు వివరాలు ఈడీ అడిగిందని వార్తల్లో చూశా. 18న సాయంత్రం దానకిశోర్ కేసు పెడితే.. 24గంటల్లోపు ఎఫ్ఐఆర్ నమోదుచేసి ఏసీబీకి కేసు అప్పగిస్తారా? ప్రాథమిక విచారణ జరగక ముందే ఈడీ వివరాలు అడిగిందా? ఇదంతా చూస్తే ఢిల్లీలో బడే భాయ్.. రాష్ట్రంలో ఛోటే భాయ్ కుట్రపన్ని కేటీఆర్‌ను ఇరికిస్తున్నట్లు కనబడుతోంది" అని హరీశ్ ఆరోపించారు. "నిన్న నమోదయిన కేసులో వెంటనే ఈడీ జోక్యం వెనుక మతలబు ఏంటి? కాంగ్రెస్, బీజేపీ దోస్తానా బయటపడుతోంది" అని మండిపడ్డారు.

# హెచ్ఎండీఏ అధికారుల్లో గుబులు

- ఒకవైపు ఫార్ములా ఈ రేస్‌పై ఏసీబీ దర్యాప్తు
- మరోవైపు ఔటర్ రింగ్‌రోడ్డుపై సిట్ విచారణ
- సంబంధిత విభాగాల అధికారుల్లో హైరానా!

హైదరాబాద్ సిటీ, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ రేస్‌పై ఏసీబీ దర్యాప్తు.. ఓఆర్ఆర్‌ను ప్రైవేటుకు అప్పగించడంపై సిట్ ఏర్పాటుతో హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) అధికార వర్గాల్లో పరేషాన్ మొదలైంది. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న ఏసీబీ.. ఇప్పటికే హెచ్ఎండీఏ ఇన్‌చార్జి కమిషనర్ అర్వింద్ కుమార్ (ఏ2), ఇంజనీరింగ్ విభాగం చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి (ఏ3) పేర్లను చేర్చింది. దీంట్లో ఇంకా ఎవరెవరి పేర్లు చేర్చుతారనే అంశంపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఏసీబీ అధికారులు విచారణకు వీరినే పిలుస్తారా? లేక రేస్ నిర్వహణలో భాగమైన ఇతర అధికారులను కూడా పిలుస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డబ్బును బదిలీ చేయడంలో హెచ్ఎండీఏ అకౌంట్ విభాగం కూడా కీలకంగా పని చేసిన నేపథ్యంలో.. అందులోని సీఏఓ, ఏఓ, డీఏఓలు కూడా ఆందోళనకు గురవుతున్నారు. తాము కూడా దర్యాప్తునకు హాజరవ్వాల్సి ఉంటుందా? అని ఆరా తీస్తున్నారు. ఇక.. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు సంస్థకు 30 ఏళ్లకు లీజుకివ్వడంపై సిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లుగా సీఎం రేవంత్ ప్రకటించడంతో హెచ్ఎండీఏలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. సిట్ విచారణకు హెచ్ఎండీఏ కమిషనర్‌తో పాటు హెచ్‌జీసీఎల్‌లోని అప్పటి ఎండీ, ప్రాజెక్టు డైరెక్టర్, సీజీఎం, డీజీఎం హాజరయ్యే అవకాశాలున్నాయి. దీనికి సంబంధించి టెండర్ టెక్నికల్ బిడ్ పరిశీలన, అనుమతిలో పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఐదుగురు చీఫ్ ఇంజనీర్లు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. టెండర్ ప్రైస్ బిడ్‌ను.. అప్పటి మునిసిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఫైనాన్స్ కార్యదర్శి ఇలా సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటీయే ఖరారు చేసి 'ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా'ను ఎంపిక చేసినట్లు తెలిసింది. వీరంతా సిట్ విచారణకు హాజరవుతారా? లేదా? అనేది త్వరలో తెలిసే అవకాశాలున్నాయి.

## లోకం తీరు



## గత ప్రభుత్వానిది 'కచరా' పాలన


- పదేళ్లలో ఏడు తరాలకు సరిపడా సంపాదించారు
- ఒక్క కుటుంబం కోసమే ధరణిని తీసుకొచ్చారు
- అందులో అక్రమాలు ముమ్మాటికీ నిజం: అక్బరుద్దీన్



హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిది 'కచరా' పాలన అని.. పదేళ్లపాటు ఎంజాయ్ చేయడంతో పాటు రాష్ట్రాన్ని లూటీ చేశారని, ఏడు తరాలకు సరిపడా సంపాదించారని ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ మండిపడ్డారు. ధరణిని ఒక కుటుంబం కోసం.. ఒక పార్టీ కోసమే తెచ్చారని ఆయన ఆరోపించారు. ధరణిని విఫల ప్రాజెక్టుగా అభివర్ణించారు. భూభారతి బిల్లుపై శుక్రవారం అసెంబ్లీలో చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్‌ఎస్ నేతలు ఆందోళన చేశారు. స్పీకర్ పోడియం ఎదుట నిలబడి ఫార్ములా ఈ రేసు కేసుపై చర్చకు పట్టుబడుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. వారి వైఖరిపై ఘాటుగా స్పందించిన అక్బరుద్దీన్.. సభలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చేసిన నిరసన ప్రదర్శన వారి సంస్కృతికి నిదర్శనమన్నారు. నిరసన సందర్భంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చించివేసిన కాగితాలను చూపిస్తూ ఆపార్టీ సభ్యులకు కేసీఆర్ నేర్పిన సంస్కారం ఇదేనా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రజల కోసం పోరాటం చేస్తున్నారా, లేక ఒక కుటుంబం కోసం, కుటుంబంలోని ఒక వ్యక్తి కోసం పోరాటం చేస్తున్నారా అని నిలదీశారు. సభ సజావుగా సాగేందుకు.. అవసరమైతే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణిలో అక్రమాలు జరిగాయని.. అది ముమ్మాటికీ నిజమని.. ధరణితో కోట్ల రూపాయలు కొల్లగొట్టారని అక్బరుద్దీన్ ఆరోపించారు. దేవాదాయ, ప్రభుత్వ, వక్ఫ్ భూములు వేలాది ఎకరాలు కబ్జాకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూముల ఆడిటింగ్ చేయాలని, మళ్లీ భూముల సర్వే చేపట్టాలని, కొత్త బౌండరీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో భూరికార్డులకు సంబంధించి ఎలాంటి విధానాలున్నాయో అధ్యయనం చేసి.. ఆమేరకు భూభారతి చట్టంలో మార్పులు చేర్పులు చేయాలని కోరారు.

### పదేళ్లు తెలంగాణ గొంతు నొక్కారు

- ప్రతిపక్షంలోనూ అంతే వ్యవహరిస్తారా: కూనంనేని



హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు పదేళ్ల తెలంగాణతో పాటు రాష్ట్ర ప్రజల గొంతు నొక్కేశారని, మళ్లీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా అలాగే వ్యవహరిస్తారా అంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ భారతి 2024 చట్టంపై చర్చజరుగుతున్న సమయంలో ఫార్ములా ఈ కేసుపై చర్చ జరపాలని పట్టుబడుతూ బీఆర్‌ఎస్ సభ్యులు ప్లకార్డులు నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో భూ భారతి చట్టంపై మాట్లాడాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును స్పీకర్ సూచించారు. కూనంనేని మాట్లాడుతూ.. దేశంలో వివిధ అంశాలపై చాలా మందిపై కేసులు పెడతారని, మీ ఒక్కరి మీదే కేసు పెట్టారా అంటూ బీఆర్‌ఎస్ సభ్యులని ప్రశ్నించారు. గడిచిన పదేళ్ల ప్రజలతో పాటు విపక్షాల గొంతును కూడా నొక్కారని, రేవంత్‌రెడ్డిని కూడా 5 నిమిషాల కంటే ఎక్కువ సభలో మాట్లాడనివ్వలేదన్నారు. ఇప్పుడూ మీరు చెప్పిందే జరగాలంటే ఎలా అంటూ కూనంనేని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను నిలదీశారు. సభలో బీఆర్‌ఎస్ సభ్యులు నిరసన చేస్తుండగా వారి చేతికి అందిన కాగితాన్ని అందినట్టు చించివేస్తున్నారని కూనంనేని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే మాట్లాడేందుకు సిద్ధం చేసుకున్న కాగితాలను చించివేశారని చెప్పారు. అదే తరహాలో తన ప్రసంగానికి సంబంధించిన కాగితాలను కూడా చించుతారేమోనని అనుమానంతో తన స్థానాన్ని మార్చుకుని కూర్చున్నానని చెప్పారు.

# తండ్రీకొడుకులు నేరగాళ్లు

(మొదటిపేజీ తరువాయి)

కనిపెట్టింది కాదని, 2010లోనే ఒడిసాలో ఈ-ధరణి పేరుతో 'ఐఎల్ అండ్ ఎఫ్ఎస్' కంపెనీకి అప్పగించారని సీఎం రేవంత్ తెలిపారు. అనుభవం, నైపుణ్యం లేని సంస్థకు ఒడిసా ప్రభుత్వం ఈ-ధరణి పోర్టల్‌ను ఇవ్వడాన్ని 2014లో కాగ్ తప్పుబట్టిందని పేర్కొన్నారు. అక్కడ దీనిని ప్రవేశపెట్టిన తర్వాత భూ సమస్యలు మరింతగా పెరిగాయని కాగ్ చెప్పినట్లు వెల్లడించారు. "2018లో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌తోపాటు కేటీఆర్ మిత్రుడు గాదె శ్రీధర్‌కు చెందిన ఈ-సెంట్రిక్, విసెన్ ఇన్ఫోటెక్ సంయుక్తంగా ధరణి కాంట్రాక్టు సాధించుకున్నాయి. భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి అన్ని రకాల బాధ్యతలు ఆ కంపెనీకి అప్పగించారు. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీపై గతంలోనే క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. కంపెనీ యజమానులు రమేశ్, హరి, రాంచంద్ రూ.వేల కోట్ల కుంభకోణంలో జైలుకు వెళ్లివచ్చారు. అలాంటి నేర నేపథ్యం ఉన్న కంపెనీలను టెండర్లలోనే అనుమతించకూడదు. అయినా కేసీఆర్ వారికే కట్టబెట్టారు. ధరణి కాంట్రాక్టును దక్కించుకున్నాక ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీ టెరాసిస్ టెక్నాలజీస్‌గా పేరు మార్చుకుంది. ఇందులో 99 శాతం షేర్లు ఫిలిప్పైన్స్ దేశానికి చెందిన ఫాల్కన్ ఎస్‌జీ అనే సంస్థ 2021లో రెండు దఫాలుగా కొనుగోలు చేసింది. మిగిలిన ఒక్క శాతం వాటా మాత్రం కేటీఆర్ మిత్రుడు గాదె శ్రీధర్‌రాజు కొనుగోలు చేశారు. ఆ ఒక్క శాతం షేర్‌తో శ్రీధర్‌రాజు టెరాసిస్‌కు సీఈవోగా అవతారం ఎత్తారు" అని సీఎం వివరించారు.

### కంపెనీ మూలాలు కేమాన్స్ ఐలాండ్‌లో..

మళ్లీ ఫాల్కన్ ఎస్‌జీ (ఫిలిప్పైన్స్) సంస్థలోని 100 శాతం షేర్లను సింగపూర్‌కు చెందిన ఫాల్కన్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనే మరో సంస్థ కొనుగోలు చేసిందని రేవంత్ తెలిపారు. ఆ తర్వాత ఈ సింగపూర్‌కు చెందిన కంపెనీలో 100 శాతం వాటాను ఐదు కంపెనీలు కొనుగోలు చేశాయన్నారు. ఇందులో స్కారో ఇన్వెస్ట్‌మెంట్స్, జీడబ్ల్యూ స్కై, హిల్ బ్రూక్స్ ఇన్వెస్ట్‌మెంట్స్, పారాడిగ్మే ఇన్నోవేషన్స్, క్వాంటెలా ఐఎన్‌సీ, ఫాల్కన్ ఇన్వెస్ట్‌మెంట్స్ (సింగపూర్) ఉన్నాయని వివరించారు. మళ్లీ ఇందులో స్కారో ఇన్వెస్ట్‌మెంట్స్ అనే సంస్థలో 100 శాతం వాటాలను గేట్‌వే ఫండ్-2 అనేక కంపెనీ చేతుల్లోకి వెళ్లాయన్నారు. ఆ కంపెనీ మూలాలు.. పన్ను ఎగవేతలకు, ఆర్థిక నేరాలకు స్వర్గధామంగా పేరుగాంచిన కేమాన్స్ ఐలాండ్ అనే దీవిలో ఉన్నాయని పేర్కొన్నారు. "ఐదింటిలో మరో కంపెనీ అయిన హిల్ బ్రూక్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ మూలాలు కూడా పన్ను ఎగవేత, ఆర్థిక నేరాలకు స్వర్గధామంగా భావించే బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్‌లో ఉన్నాయి. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న వారిలో ఎవరూ ఈ దేశానికి చెందిన వ్యక్తులు కాదు. అలాంటి వ్యక్తుల చేతుల్లోకి తెలంగాణ రైతుల భూముల వివరాలు పెట్టారు. రెవెన్యూ శాఖ, భూ యజమానికి మధ్య ఉండాల్సిన డేటాను డిజిటల్ పోర్టల్ నెపంతో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టారు. ఇతర దేశాల్లో ఆర్థిక నేరాల్లో ఇరుక్కు



పోయిన సంస్థలకు అప్పగించారు. పౌరుల ఆధార్ సమాచారాన్ని అడగటాన్నే సుప్రీంకోర్టు తీవ్రమైన నేరంగా పరిగణిస్తుంది. అలాంటిది రైతులు, వారి భూములకు సంబంధించిన సమాచారాన్నంతా విదేశీయులకు అప్పగించారు. ఇది చాలా తీవ్రమైన నేరం. ప్రజలకు ద్రోహం చేసి సమస్త సమాచారాన్ని విదేశీ కంపెనీలకు అప్పగించారంటే.. దీనిపై ఎలాంటి విచారణ చేయాలో తెలంగాణ ప్రజలు ఆలోచించాలి" ముఖ్యమంత్రి అన్నారు.

### సీసీఎల్ఏలో ఉండాల్సిన కార్యాలయం విదేశాల్లో

ధరణి బాధ్యతలు అప్పగించే సమయంలో ప్రైవేటు సంస్థకు ప్రత్యేక నిబంధన పెట్టారని సీఎం తెలిపారు. భూ సంబంధిత కార్యకలాపాలన్నీ సీసీఎల్ఏ లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండి నిర్వహించాలని, కానీ.. విదేశీ సంస్థ తన కార్యాలయాలను విజయవాడ, బెంగళూరు, గుర్గావ్‌తోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో పెట్టిందని వెల్లడించారు. ఇది నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని గత ప్రభుత్వానికి తెలిసినా కిమ్మనలేదని ఆరోపించారు. "అగ్రిమెంట్ ప్రకారం కంపెనీ పేరు, యజమానిని మార్చాలంటే ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. ఇవేమీ తీసుకోకుండా అనేక కంపెనీలు చేతులు మారాయి. విదేశీ కంపెనీకి ప్రభుత్వం నగదును ఆర్బీఐ అనుమతి లేకుండా పౌండ్ల రూపంలో చెల్లించింది. నిబంధనలు ఉల్లంఘించారంటూ ఆర్బీఐ రూ.8 కోట్లు జరిమానా విధించింది. అడుగడుగునా ఉల్లంఘనలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోలేదు. యువరాజు (కేటీఆర్) వెనక ఉండి అంతా తన మిత్రుడితో నడిపించాడు. ఎంసీహెచ్ఆర్డీలో అద్భుతమైన సాంకేతికత ఉంది, జాతీయస్థాయిలో ఎన్ఐసీ ఉంది. అత్యంత కీలకమైన ధరణిని రాష్ట్ర, జాతీయ సంస్థలకు అప్పగించకుండా విదేశీ కంపెనీలకు అప్పగించారు. ఈ లోపాలను మేం గుర్తించి ధరణి బాధ్యతలను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ)కి అప్పగించాం. అయినా తన గుప్పిట్లో ఉన్న సమాచారాన్ని ఎన్ఐసీకి ఇచ్చేందుకు యువరాజు మిత్రుడు ఇప్పటికీ సిద్ధంగా లేడు. రాష్ట్రంలోని రైతులందరి సమాచారాన్ని మార్చే, ధ్వంసం చేసే అధికారం యువరాజు మిత్రుడి వద్ద ఉంది. ధరణిలో ఎన్నో ఎకరాల భూదాన్ భూములు, ప్రైవేటు భూముల యజమానుల పేర్లు మారాయి. రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల్లో వేల ఎకరాల భూములను బదిలీ చేశారు. ధరణిలో పగలు జరగాల్సిన రిజిస్ట్రేషన్‌లు అర్ధరాత్రి కూడా జరిగాయి. కిషన్‌రెడ్డి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడే ఆయన స్వగ్రామం తిమ్మాపూర్‌లో 100 ఎకరాల భూదాన్ భూములనూ ధరణిలో మార్చి ప్రైవేటుకు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా నాకు చెప్పడంతో విచారణ జరిపించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాను. కేంద్ర మంత్రికే ఇలాంటి పరిస్థితి నేను నమ్మలేకపోయాను" అని ముఖ్యమంత్రి తెలిపారు. ఇలా ధరణి పేరుతో గత ప్రభుత్వం చేసిన బండారమంతా బయటపడుతుందనే ఇవాళ చర్చ జరగకుండా ప్రయత్నించి బయటికి వెళ్లిపోయారన్నారు.

### కేటీఆర్‌తో చీకటి ఒప్పందం జరిగిందన్నాడు..

ఫార్ములా-ఈ రేస్‌కు చెందిన వ్యక్తితో తన ఫొటోలను చూపిస్తున్నారని సీఎం రేవంత్ తెలిపారు. తాను ఇంటి వద్ద, సచివాలయంలో రోజూ వందల మందిని కలుస్తానని చెప్పారు. అపాయింట్‌మెంట్ అడిగితే తానే ఇచ్చానన్నారు. "రూ.600 కోట్లకు కేటీఆర్‌తో చీకటి ఒప్పందం కుదిరిందని, మీరు ఊ.. అంటే మిగతా సొమ్ము వచ్చేస్తుందని అతడు చెప్పాడు. ఆయన చెప్పాకే వ్యవహారం ఏంటనేది అధికారులతో తెలుసుకున్నా. ముందు అనుకున్నట్టుగా ఇది రూ.55 కోట్ల కుంభకోణం కాదు.. రూ.600 కోట్ల కుంభకోణం. నేను తెలుసుకున్నాను కాబట్టే దీనిని ఆపగలిగా. లేకుంటే ఈ సొమ్మంతా పోయేది. ఏసీబీ విచారణ నడుస్తున్నందున ఇంతకంటే ఎక్కువ చెప్పలేను. 2023 డిసెంబరు నుంచి 2024 డిసెంబరు వరకు జరిగిన అన్ని వివరాలను త్వరలో ప్రజలకు అందిస్తా. ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి ఎప్పుడు పిలిచినా ఎక్కడికైనా వెళ్తా.. అసెంబ్లీలో కష్టం అనిపిస్తే బీఆర్‌ఎస్ పార్టీ ఆఫీసుకు వెళ్లి వివరించేందుకూ నేను సిద్ధం. డ్రగ్స్‌తో పట్టుబడితే.. దీపావళికి ఇంట్లో పార్టీ చేసుకోవద్దా అని కేటీఆర్ దబాయిస్తున్నాడు. ఇంట్లో ఫంక్షన్ ఉంటే కొకైన్ కూడా వాడొద్దా? అని ప్రశ్నిస్తున్నారు. దీపావళి ఉంటే చిచ్చుబుడ్లు కాల్చాలి.. కొకైన్ వాడుతామా? ఔటర్ రింగ్ రోడ్డు అమ్ముకున్నా మాట్లాడొద్దంటున్నారు. హెచ్ఎండీఏ ఖాతాల నుంచి రూ.కోట్లు బదిలీ చేసినా ఏమీ అనొద్దన్నట్లుగా, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తామన్నట్లుగా బీఆర్‌ఎస్ తీరు ఉంది. దీనిని ప్రభుత్వం ఏ మాత్రం సహించదు" అని సీఎం స్పష్టం చేశారు.




### రైతు భరోసాపై నేడు అసెంబ్లీలో చర్చ

రైతు భరోసా విధివిధానాలకు సంబంధించిన అంశంపై శాసనసభలో శుక్రవారం చర్చ జరగనుంది. రోజంతా ఈ అంశంపైనే చర్చకు కేటాయించారు. రైతు భరోసాను ఆదాయపు పన్ను చెల్లించే రైతులకు, సాగుకు యోగ్యం కాని గుట్టలు, రాళ్ల రప్పలున్న భూములకు, లే అవుట్లుగా మారిన భూములకు, సాగు చేయకుండా బీడుగా వదిలేసిన భూములకూ ఇవ్వకూడదని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై ఇప్పటికే గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో అభిప్రాయ సేకరణ పూర్తి చేశారు. ఇప్పుడు అసెంబ్లీలో కూడా అన్ని రాజకీయపక్షాల వైఖరిని తెలుసుకోనున్నారు. అనంతరం అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించనుంది. గరిష్ఠ సీలింగ్ పెట్టాలన్న అంశంపైనా చర్చ జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విపక్ష నేతలు ఈ చర్చలో పాల్గొనే అవకాశాలున్నాయి. మరోవైపు సంక్రాంతి అనంతరం రైతు భరోసా అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు.

### కొరడా ఝుళిపించాల్సిన సమయం వచ్చింది



అర్హులైన ప్రతి భూ యజమాని హక్కులను కాపాడేందుకు చట్టాన్ని సభలో ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చర్చ జరగడం ద్వారా తెలంగాణ రైతులకు ఉపయోగపడే చట్టాన్ని తీసుకురావాలని భావించామన్నారు. "ప్రతిపక్ష పార్టీ అహంభావం, అహంకారంతో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించింది. సహనం కోల్పోయేలా రెచ్చగొట్టి చర్చను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసినా మీరు (స్పీకర్) ఆ అవకాశం వారికి ఇవ్వలేదు. ఓపిక నశించి వాళ్లే వెళ్లిపోయినా చర్చకు అవకాశం కల్పించిన మీకు అభినందనలు. ఇలాంటి వారిపై మీరు సభలో మరింత కఠినంగా వ్యవహరించాలి. కొరడా ఝుళిపించాల్సిన సమయం వచ్చింది అధ్యక్షా! హరీశ్‌రావు పరిస్థితి మాకు అర్థమైంది. అసెంబ్లీలో చొక్కాలు చించుకోకపోతే ఇంటి దగ్గర కొరడా దెబ్బలు ఉంటాయి. ప్రజల కోసం కొన్ని కొరడా దెబ్బలు తినాలి. మరీ మామకు అంత విశ్వాసం చూపాల్సిన అవసరం లేదు" అని రేవంత్ వ్యాఖ్యానించారు. పేదల భూ హక్కులను కాపాడేందుకే భూ భారతి-2024 తీసుకువచ్చామని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లేందుకు చాలా సమావేశాలు నిర్వహించి భూ భారతి చట్టాన్ని సభ ముందుకు తీసుకొచ్చిందని తెలిపారు. అనంతరం భూ భారతి బిల్లును సభ ఆమోదించింది.

# కాపలా కుక్కలు కాదు.. వేటకుక్కలు!

## గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆస్తులను యథేచ్ఛగా కొల్లగొట్టారు

- ధరణితోపాటు ఆర్థిక అవకతవకలపై ఫోరెన్సిక్ ఆడిట్
- భూ భారతి చట్టం.. ప్రజల నిజమైన చుట్టం
- స్పీకర్‌పై, నాపై, కాంగ్రెస్ సభ్యులపై కాగితాలు విసిరారు
- ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా మారలేదు: పొంగులేటి
- భూ భారతి బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి.. సభ ఆమోదం



హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని కాపలాకుక్కలా కాపాడుతానని చెప్పుకొన్న కేసీఆర్, బీఆర్‌ఎస్ నేతలు.. వేటకుక్కల్లా ప్రజల సొమ్మును కొల్లగొట్టారని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ధరణితోపాటు, గత ప్రభుత్వం తీసుకున్న పలు ఆర్థికపరమైన నిర్ణయాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని చెప్పారు. శుక్రవారం సభ ప్రారంభమైన అనంతరం 'భూ భారతి-2024' చట్టంపై చర్చను మంత్రి పొంగులేటి ప్రారంభించారు. భూభారతి చట్టం ప్రజల చట్టమని, భూమి ఉన్న ప్రతి ఒక్కరి చుట్టమని అభివర్ణించారు. 'విస్తృత స్థాయి ప్రజాభిప్రాయ సేకరణతో రూపొందించిన భూ భారతి చట్టం-2024 అక్షరాలా భూ యజమానులకు చుట్టం. ఇటు రాష్ట్రంలో అటు దేశంలో 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకువచ్చిన రెవెన్యూ చట్టాలు, సంస్కరణలు రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేశాయి. అదే నిబద్ధతతో భూ భారతి చట్టం తెచ్చాం' అని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం రైతులు, కూలీలు పాల్గొన్న తెలంగాణ సాయుధ పోరాటం ఓ చారిత్రాత్మక ఘట్టమని, ఈ ఉద్యమానికి ప్రధాన కారణం నిజాం కాలంనాటి భూ సమస్యలేనని పొంగులేటి తెలిపారు. 80 వేలకుపైగా పుస్తకాలు చదివానని చెప్పుకొన్న గత ప్రభుత్వ పెద్ద, ధరణి సృష్టికర్త కూడా ఇదే విధంగా వ్యవహరించారని మాజీ సీఎం కేసీఆర్‌పై పొంగులేటి విమర్శలు గుప్పించారు. నాడు బ్రిటిష్ దొరలు జమీందారులు, భూస్వాముల వంటి దళారులను సృష్టించి శిస్తుల రూపంలో దోపిడీ చేస్తే ఈనాటి దొరలు భూముల డిజిటలైజేషన్ పేరుతో ధరణిని సృష్టించి భూదోపిడీకి పాల్పడ్డారన్నారు. ధరణిలో నా భూమి నేను చూసుకొనే వీల్లేదు.. ఆనాడు అంతా రహస్యమే.. కానీ, ఇందిరమ్మ ప్రభుత్వంలో దొరలు, సామాన్యులకు ఒకటే విధానం.. భూ భారతిలో అంతా పారదర్శకమేనని మంత్రి చెప్పారు.

### ఆ అన్యాయం మరొకరికి జరగకుండా

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన మద్దెల కృష్ణయ్య అనే దళిత రైతు ఆత్మహత్యను పొంగులేటి ప్రస్తావించారు. విజేందర్ రెడ్డి అనే వ్యక్తి నుంచి 35 ఏళ్ల క్రితం కృష్ణయ్య 7 ఎకరాల భూమిని కొనుగోలు చేశారని, ధరణి వచ్చిన తర్వాత ఆ భూమి వేరే వాళ్ల పేరుపై పట్టాకావడంతో మనస్తాపం చెంది గతేడాది జనవరిలో ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఇటువంటి సంఘటనలు ఎన్నో జరిగాయి.. ఈ అన్యాయాలను అరికట్టటానికే భూ భారతి చట్టం రూపొందించామని పొంగులేటి చెప్పారు. ముఖం పగిలిపోయేలా ప్రజలు శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో తీర్పు ఇచ్చినా విపక్ష నేతల బుద్ధి మారడం లేదన్నారు. భూభారతి చట్టాన్ని సభలో ప్రవేశపెడుతుంటే సీనియర్లమని చెప్పుకొనే కొంతమంది విపక్ష సభ్యులు స్పీకర్‌తో పాటు తన మీద, ఇతర కాంగ్రెస్ సభ్యుల మీద కాగితాలు విసరడం దురదృష్టకరమన్నారు.

### మూడేళ్లకే... నూరేళ్లు నిండిన చట్టం

ప్రముఖ న్యాయకోవిదులు పడాల రామిరెడ్డి భూ సంస్కరణలపై రాసిన పుస్తకం ఎప్పుడూ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ టేబుల్‌పై కనిపించేదని తన సెల్‌ఫోన్‌లోని ఫోటోను మంత్రి పొంగులేటి సభలో ప్రదర్శించారు. 80 వేలకు పైగా పుస్తకాలు చదివానని చెప్పుకున్న కేసీఆర్ నేతృత్వంలో ఉన్నతస్థాయి రెవెన్యూ చట్టం వస్తుందని భావించానని, అయితే నాలుగు గోడల నడుమ రూపొందించిన 2020 రెవెన్యూ చట్టం ప్రజా కంటకంగా మారిందన్నారు. మూడేళ్లకే ఈ చట్టానికి నూరేళ్లు నిండిపోయాయని ఎద్దేవా చేశారు. భూభారతిపై సలహాలు, సూచనల కోసం బిల్లును బహిరంగంగా అందరికీ అందుబాటులో ఉంచామని తెలిపారు.

### ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తాం

బిల్లుపై చర్చ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో వేలాది ఎకరాలు పక్కదారి పట్టాయని, దాదాపు రూ.2 లక్షల కోట్ల మేర కుంభకోణాలు జరిగాయన్నారు. అయినప్పటికీ, ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. సీబీఐతో దర్యాప్తు జరిపించటంతో పాటు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. దీనిపై మంత్రి పొంగులేటి స్పందిస్తూ.. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రభుత్వ పెద్దలు ధరణితో పాటు పలు తప్పులు చేశారని, వాటన్నింటినీ కూలంకషంగా, శాస్త్రీయంగా విచారించిన తరువాత చర్యలు తీసుకోవాలని సీఎంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు భావిస్తున్నారని చెప్పారు. తాము హామీ ఇచ్చినట్లుగానే ధరణిని బంగాళాఖాతంలో పడేశామని, దాని స్థానంలో భూ భారతి తీసుకువచ్చామన్నారు. మహేశ్వరరెడ్డి కోరిక మేరకు.. ధరణి అవకతవకలతో పాటు, పేదల ఆస్తులను కొల్లగొట్టిన గత ప్రభుత్వ అవినీతిపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ధరణి సహ ఆర్థిక కుంభకోణాలు, భూములకు సంబంధించిన అంశాలపై ప్రజాప్రతినిధుల దగ్గర వివరాలుంటే లేఖల రూపంలో తనకు అందజేయాలని పొంగులేటి కోరారు.

### నన్ను మంత్రిగా గుర్తించడం లేదు: పొంగులేటి

'ప్రతిపక్షం నన్ను మంత్రిగా గుర్తించడం లేదు' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. సభ ప్రారంభ సమయంలో ఒక్క మంత్రి కూడా లేరంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన విమర్శపై మంత్రి స్పందించారు. ఆ సమయంలో తాను సభలోనే ఉన్నానని, అయినా తనను ప్రతిపక్ష సభ్యులు మంత్రిగా గుర్తించడం లేదన్నారు.

### సినిమా సన్నివేశాన్ని ప్రస్తావించిన ఏలేటి

చర్చ సమయంలో ఏలేటి లక్కీ భాస్కర్ సినిమాలోని ఓ సన్నివేశం గురించి ప్రస్తావించారు. హీరో కుమారుడు తన స్నేహితుడు చాక్లెట్ దొంగిలించడం చూసి టీచర్‌కు చెప్పకుండా ఉండేందుకు అతని నుంచి సగం చాక్లెట్ తీసుకుంటాడన్నారు. అలా ఎందుకు చేశావని తల్లి అడిగితే టీచర్‌కు చెబితే నాకేం వస్తుంది.. చెప్పకుండా ఉంటే సగం చాక్లెట్ వచ్చింది అని అంటాడని.. కాంగ్రెస్ కూడా ఇదే మాదిరిగా విషయాన్ని సెటిల్ చేస్తుందా అని ప్రశ్నించారు. కాగా, భూ భారతి బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఆయన చాంబర్‌లో మంత్రి పొంగులేటి సన్మానించారు.

### మరింత మెరుగ్గా రెవెన్యూ సేవలు అందిస్తాం: ట్రెసా

రైతులు, రెవెన్యూ ఉద్యోగులు ఎంతగానో ఎదురు చూసిన తెలంగాణ భూభారతి చట్టం-2024ను శాసన సభ ఆమోదించడంపై డిప్యూటీ కలెక్టర్ల సంఘం హర్షం వ్యక్తం చేసింది. రెవెన్యూ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు చట్టాన్ని తీసుకొచ్చిన సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సంఘం తరఫున అధ్యక్షుడు కె. చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కొత్త రెవెన్యూ చట్టం సభలో ఆమోదం పొందిన రోజు చారిత్రాత్మకమైన రోజు అని ట్రెసా రాష్ట్ర కార్యవర్గం పేర్కొంది. మరింత మెరుగ్గా సేవలందిస్తామని పేర్కొంది.

# 'ఫార్ములా ఈ'పై అసెంబ్లీలో రగడ

## చర్చ జరగాల్సిందేనని పట్టుబట్టిన విపక్షం.. స్పీకర్ వైపుగా కాగితాలు, పుస్తకాలు విసిరివేత

- ఖండించిన కాంగ్రెస్ సభ్యులు
- విపక్ష ఎమ్మెల్యేలపై కాగితాలు విసిరి, చెప్పు చూపించిన ఎమ్మెల్యే శంకర్
- చూసుకుందాం! బయటకు రా అంటూ ఎమ్మెల్యేల సవాళ్లు, ప్రతిసవాళ్లు
- గందరగోళం మధ్యే భూ భారతి బిల్లుపై చర్చ
- రెండుసార్లు సభ వాయిదా.. బీఆర్‌ఎస్ సభ్యుల వాకౌట్

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేసు వ్యవహారం అసెంబ్లీని కుదిపేసింది. ఈ అంశంపై సభలో చర్చించాల్సిందేనని పట్టుబట్టిన బీఆర్‌ఎస్ సభ్యులు స్పీకర్‌పై కాగితాలు విసిరారు. దీనికి ప్రతిగా వారిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ కాగితాలు విసిరారు. అంతేగాక, తన కాలికి ఉన్న చెప్పు చూపించారు. శంకర్ తమవైపు చెప్పు విసిరే ప్రయత్నం చేశారని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపించారు. మొత్తమ్మీద, ఫార్ములా ఈ రేసుపై చర్చకు విపక్ష సభ్యుల పట్టుబట్టడంతో సభ రెండుసార్లు వాయిదా పడింది. శుక్రవారం ఉదయం సభ ప్రారంభం కాగానే అధికారపక్షం భూ భారతి బిల్లుపై చర్చను ప్రారంభించింది. అయితే, విపక్ష బీఆర్‌ఎస్ సభ్యులు ఫార్ములా ఈ కారు అంశంపై చర్చించాలని పట్టుబట్టారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు.. 'ప్రభుత్వానికి నిజాయితీ, దమ్ము, చిత్తశుద్ధి ఉంటే సభలో చర్చ పెట్టాలి' అని స్పీకర్‌ను కోరారు. అయితే, అది ఒక వ్యక్తికి సంబంధించిన విషయమని, రాష్ట్రానికి సంబంధించింది కాదని.. స్పీకర్ గడ్డం ప్రసాద్ చెప్పినా విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. ఈ కారు రేస్ అక్రమ కేసు అంటు బీఆర్‌ఎస్ సభ్యులు తమ వెంట తెచ్చుకున్న ప్లకార్డులు ప్రదర్శించారు. అదే అంశంపై చర్చ జరపాలన్న వారి డిమాండ్‌ను స్పీకర్ తిరస్కరించారు. దీంతో బీఆర్‌ఎస్ సభ్యులు స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ప్లకార్డులు చింపి స్పీకర్‌పై విసిరారు. అసెంబ్లీ సిబ్బంది వద్ద ఉన్న పుస్తకాలు లాక్కొని స్పీకర్‌పైకి విసిరేశారు. మార్షల్స్ విపక్ష నేతల్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో అధికార, విపక్ష ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు కాగితాలు విసురుకున్నారు. తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో స్పీకర్ సభను 15 నిమిషాలు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన కొద్దిసేపటికే మరోసారి వాయిదా పడింది.

### చూసుకుందాం రా!

విపక్ష సభ్యులపై కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ పేపర్లు విసిరారు. అంతేకాదు తన కాలు చెప్పు చూపించారు. ఆయన తీరును బీఆర్‌ఎస్ సభ్యులు తీవ్రంగా తప్పుబట్టారు. ఆ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి.. బయటకు రా చూసుకుందాం అని అనటంతో.. అధికార, విపక్ష సభ్యులు ఒకరిపై ఒకరు 'రా... చూసుకుందాం' అని సవాళ్లు విసురుకున్నారు. దళిత స్పీకర్‌ను అవమానించిన వారిని సస్పెండ్ చేయాలని అధికార పార్టీ సభ్యులు డిమాండ్ చేశారు. దొర (కేసీఆర్) కోసం విపక్ష సభ్యులు ఇదంతా చేస్తున్నారన్నారు. అధికార, విపక్ష సభ్యులు ఒకరికి వ్యతిరేకంగా మరొకరు గట్టిగా నినాదాలు చేశారు. వాయిదా అనంతరం 11 గంటలకు సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా విపక్ష సభ్యులు ఈ కారు రేస్ కేసు అంశంపై చర్చ జరపాలని పట్టుబట్టారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలకు ఉపయోగకరమైన భూ భారతి బిల్లు ముఖ్యమైనదని, ఆ బిల్లు ఆమోదం పొందిన తర్వాత బీఆర్‌ఎస్ సభ్యుల్ని తన ఛాంబర్‌కు పిలిచి మాట్లాడుతానని చెప్పారు. అయినా... బీఆర్‌ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. హరీశ్‌రావును ఉద్దేశించి స్పీకర్ మాట్లాడుతూ.. హరీశ్! మీరు సీనియర్‌సభ్యులు. ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారు. కావాలని సభాసమయం వృథా చేస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల్ని అడ్డుకునేందుకు విరామం తర్వాత మార్షల్స్‌ను మోహరించారు. దీంతో అధికారపక్షం వైపు నుంచి హరీశ్ రావు స్పీకర్ పోడియం వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆయన్ను అడ్డుకున్నారు. ఈ గందరగోళం మధ్యే మంత్రి పొంగులేటి భూ భారతి బిల్లుపై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పదే పదే సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. మార్షల్స్‌ను తోసుకుని పోడియం వైపు వెళ్లే ప్రయత్నం చేశారు. దీనిపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. 'కౌశిక్! జాగ్రత్త. ఒక సంవత్సరం సస్పెండ్ చేస్తా' అని హెచ్చరించారు. బీజేపీ సభ్యుడు మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతున్న సమయంలో 'బడే భాయ్... చోటే భాయ్' అంటూ కౌశిక్ రెడ్డి నినాదాలు చేశారు. విరామం అనంతరం మధ్యాహ్నం 1.30 నిమిషాలకు సభ తిరిగి ప్రారంభమైంది. మళ్లీ బీఆర్‌ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. 'తానాషాహీ నహీ చలేగా' (నియంతృత్వం చెల్లదు) అంటూ నినాదాలు చేశారు. 40 నిమిషాలపాటు నిరసన కొనసాగించిన విపక్ష సభ్యులు ఆ తర్వాత సభ నుంచి వాకౌట్ చేశారు.



### మండలిలో వాయిదాల పర్వం

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి సమావేశాలు మరోసారి వాడీవేడిగా జరిగాయి. ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్‌పై నమోదు చేసిన కేసును ఉపసంహరించుకోవాలంటూ ఆ పార్టీ సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. చైర్మన్ సర్దిచెప్పినా వినకుండా వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన కొనసాగించారు. దీంతో శుక్రవారం శాసన మండలి పలుమార్లు వాయిదా పడింది. సభను శనివారానికి వాయిదా వేసినట్టు ప్రకటించారు.

### నేను కిందపడ్డ పేపర్‌ను తీశానంతే: వీర్లపల్లి శంకర్

తనపై బీఆర్‌ఎస్ నేతలు కుట్ర పన్నారని, అసెంబ్లీలో తాను చెప్పు తీయలేదని, కిందపడ్డ పేపర్‌నే తీశానని కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్ పేర్కొన్నారు. శాసనసభలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పేపర్లు చింపుతూ మంత్రి పొంగులేటి వద్దకు వచ్చారని, ఆయన్ను డిస్టర్బ్ చేసే ప్రయత్నం చేశారని, దీంతో కౌశిక్‌ను ఆపేందుకే తాను పేపర్‌ను విసిరానని వివరించారు. సభలో జరిగిన గొడవపై అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ ఈ మేరకు వెల్లడించారు. బీఆర్‌ఎస్ వాళ్లు ఆరోపిస్తున్నట్లుగా తానేమీ చెప్పు తీయలేదని, కింద పడ్డ పేపర్‌ను తీశానన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే వివేకానంద విసిరిన పుస్తకం స్పీకర్‌కు తగిలిందన్నారు.

### వారి సభ్యత్వం రద్దుచేయాలి: కాంగ్రెస్

అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రవర్తించిన తీరుచూస్తే ఇది తెలంగాణకు చీకటిరోజుగా భావిస్తున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, ఆదిశ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్, వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు దళిత సామాజికవర్గానికి చెందిన స్పీకర్‌పై అవమానకరంగా కాగితాలు వేస్తూ.. అగ్రకుల దురహంకారం చూపించారన్నారు. ఈ మేరకు హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి, కౌశిక్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, వెల్‌లోకి వచ్చి స్పీకర్‌ను అవమానించిన వారి సభ్యత్వాలను తక్షణం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో హరీశ్‌రావు రౌడీలాగా ప్రవర్తించారని.. సభలో ఏ అంశంపై చర్చ పెట్టినా బీఆర్‌ఎస్‌కు నష్టం కలిగించడమే లక్ష్యంగా ఆయన ప్లాన్ చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. కేటీఆర్‌ను భ్రష్టుపట్టించి, పార్టీ పగ్గాలు చేపట్టాలని హరీశ్ భావిస్తున్నారన్నారు.

### దమ్ముంటే గలాటా వీడియో విడుదల చేయాలి: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

సభ జరుగుతున్నంతసేపు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రవర్తించిన తీరు బాధాకరమని, తమపైకి పేపర్లు, బాటిల్స్ విసరడంతోపాటు చెప్పు చూపించారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, వివేకానంద, జి.జగదీష్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. దమ్ముంటే అసెంబ్లీలో జరిగిన గలాటా వీడియోలు బయట పెట్టాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను, ప్రజా సమస్యలను పక్కదోవ పట్టించేందుకే అక్రమ కేసులు పెడుతున్నారని, ఇటువంటి డొల్ల కేసులు తమను ఏమీ చేయలేవన్నారు.

## భరణం అంటే భర్తను దోచుకోవడం కాదు

న్యూఢిల్లీ, డిసెంబరు 20: విడాకుల అనంతరం భరణానికి సంబంధించిన నిబంధనలు భార్య సంక్షేమానికి ఉద్దేశించినవే తప్ప భర్తను భయపెట్టేందుకో, బెదిరించేందుకో, శిక్షించేందుకో, దోపిడీ చేసేందుకో ఉద్దేశించినవి కావని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆమె అవసరాలకు తగ్గట్టుగానే మనోవర్తి ఉంటుందని తెలిపింది. భర్తకు సంపద ఉంది కాబట్టి అందుకు తగ్గట్టుగా మనోవర్తి ఇవ్వాలని అడగలేరని తెలిపింది. "విడాకుల అనంతరం భర్త హోదా పెరిగి ఉండవచ్చు. అంతమాత్రాన జీవితకాలమంతా అదే పరిస్థితి ఉంటుందని చెప్పలేం. అందువల్ల ఆయన హోదా పెరిగింది కాబట్టి భరణం కూడా పెంచాలని అడగలేరు. ఆయన వ్యక్తిగత అభివృద్ధిపై భారం మోపలేరు" అని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ పంకజ్ మిత్తల్‌ల ధర్మాసనం అభిప్రాయపడింది. సరిదిద్దలేని పరిస్థితికి చేరుకోవడంతో ఓ జంటకు విడాకులు మంజూరు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. పెళ్లయిన కొద్ది కాలానికే ఆ జంట మధ్య విభేదాలు తలెత్తాయి. భార్యకు శాశ్వత మనోవర్తి కింద రూ.12 కోట్లు ఇవ్వాలని, నెల రోజుల్లో చెల్లింపులు పూర్తి చేయాలని భర్తను ఆదేశించింది. మొదటి భార్యకు రూ.500 కోట్లు మనోవర్తి కింద ఇచ్చారని, అందువల్ల ఆయన సంపదకు తగ్గట్టుగా తనకూ భరణం ఇవ్వాలంటూ ఆ భార్య చేసిన వినతిని తిరస్కరించింది. తన భర్తకు రూ.5,000 కోట్ల ఆస్తి ఉందని చెప్పిన విషయాన్నీ ధర్మాసనం పరిగణనలోకి తీసుకోలేదు. ఈ సందర్భంగా కుటుంబ వ్యవస్థపై కీలక వ్యాఖ్యలు చేసింది. హిందూ వివాహ వ్యవస్థ పవిత్రమైనదని, కుటుంబానికి పునాది అని తెలిపింది. ఇదేమీ వ్యాపార సంస్థ కాదని పేర్కొంది. కుటుంబ కలహాలు తలెత్తినప్పుడు అత్యాచారం, క్రిమినల్ వేధింపులు, క్రూరత్వం తదితర ఆరోపణలతో 'కంబైన్డ్ ప్యాకేజీ' రూపంలో కేసులు పెడుతుండడాన్ని పలుమార్లు సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టిన విషయాన్ని గుర్తుచేసింది. కఠినమైన ఈ నిబంధనలన్నీ వివాహితల సంరక్షణకు ఉద్దేశించినవే తప్ప భర్తను వేధించడానికి కాదని మహిళలు గుర్తుంచుకోవాలని తెలిపింది. భర్త, అత్తింటివారి నుంచి సొమ్ములు వసూలు చేయాలన్న లక్ష్యంతోనే తీవ్రమైన ఆరోపణలతో క్రిమినల్ కేసులు పెడుతున్నారని పేర్కొంది. భర్త హోదాకు తగ్గట్టుగా తన జీవన శైలి కూడా ఉండాలని కోరుకోవడం తగదని పేర్కొంది. ఒకవేళ విడాకులు తీసుకున్న తరువాత భర్త పేదగా మారితే అప్పుడేమైనా బాధ్యత తీసుకుంటారా? అని ప్రశ్నించింది. భర్తపై ఆమె పెట్టిన అన్ని క్రిమినల్ కేసులను కొట్టివేసింది.

## బెయిల్ వచ్చిన వెంటనే మంత్రి పదవి ఇవ్వడం భయంకరమైన తప్పు

న్యూఢిల్లీ, డిసెంబరు 20: బెయిల్ లభించిన మరుక్షణమే డీఎంకే నాయకుడు వి.సెంథిల్ బాలాజీని మళ్లీ తమిళనాడు మంత్రిగా తీసుకోవడం భయంకరమైన తప్పు అని శుక్రవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రవాణా మంత్రిగా పనిచేసినప్పుడు డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇచ్చారన్న ఆరోపణలతో ఆయనపై మనీలాండరింగ్ కేసు నమోదయింది. ఇందులో సాక్షులుగా ప్రభుత్వ ఉద్యోగులే ఉన్నారని, అందువల్ల మంత్రి పదవి ఇవ్వడం ప్రశ్నించదగ్గ అంశమని ధర్మాసనం తెలిపింది. ఆయనపై ఉన్న పెండింగ్ కేసుల వివరాలను, విచారించాల్సిన సాక్షుల సమాచారాన్ని సమర్పించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ ఆదేశాలు ఇచ్చింది. ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ సెంథిల్ బాలాజీ జైల్లో ఉన్నప్పుడు కూడా శాఖలేని మంత్రిగా కొనసాగారని చెప్పారు.

## 'ధారావి' ప్రాజెక్టు అదానీలకు కేటాయింపు సబబే

ముంబై, డిసెంబరు 20: ముంబైలోని ధారావి మురికివాడ పునర్నిర్మాణ ప్రాజెక్టును అదానీ గ్రూపునకు కేటాయించడం సబబేనని శుక్రవారం బాంబే హైకోర్టు తీర్పు చెప్పింది. కాంట్రాక్టు మంజూరులో ఏకపక్ష ధోరణి, అహేతుకత, దుర్బుద్ధి వంటివి లేవని ధర్మాసనం స్పష్టం చేసింది. 259 హెక్టార్లలో ఉన్న మురికివాడలో రూ.5,069 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అదానీ గ్రూపు టెండరు వేసింది. అదానీ గ్రూపునకు ఈ కాంట్రాక్టు దక్కడాన్ని సవాలు చేస్తూ యూఏఈకి చెందిన సెక్‌లింక్ టెక్నాలజీస్ సంస్థ హైకోర్టులో పిటిషన్ వేసింది. నిజానికి 2018లో తామే అతిపెద్ద బిడ్డర్‌గా నిలిచామని, కానీ ప్రభుత్వం దాన్ని రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిచిందని తెలిపింది. అదానీ గ్రూపునకు టెండరు దక్కేలా చూసేందుకు నిబంధనలు సడలించిందని ఆరోపించింది.

# రాహుల్‌పై విచారణ

శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటాలతో ఇండియా కూటమి ఎంపీల నిరసన ప్రదర్శన

### పార్లమెంటు ఆవరణలో బాహాబాహీ ఘటనపై పోలీసులు ప్రశ్నించే అవకాశం

- 'అంబేడ్కర్‌కు అవమానం' అంశం నుంచి దృష్టి మరల్చేందుకే: ప్రియాంక



న్యూఢిల్లీ, డిసెంబరు 20: పార్లమెంటు ఆవరణలో అధికార, ప్రతిపక్ష ఎంపీల మధ్య చోటుచేసుకున్న బాహాబాహీ ఘటనకు సంబంధించి.. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ప్రశ్నించనున్నట్లుగా ఢిల్లీ పోలీసు వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఎంపీల మధ్య తోపులాట కారణంగా ఇద్దరు బీజేపీ ఎంపీలు గాయపడటం, రాహుల్‌గాంధీపై పార్లమెంటు స్ట్రీట్‌లోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు చేయటం తెలిసిన విషయమే. దీనిపై రాహుల్ మీద పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా దాఖలు చేశారు. దీంట్లో భాగంగానే ప్రతిపక్షనేతను ప్రశ్నించనున్నట్లు సమాచారం. కాగా, రాహుల్‌పై నమోదైన కేసు ఢిల్లీ క్రైం బ్రాంచ్‌కు బదిలీ అయింది. ఇదే ఘటనలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే గాయపడటంపై ఆ పార్టీ నేతలు బీజేపీ ఎంపీలపై ఆరోపణలు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తోపులాట ఘటనకు సంబంధించిన సీసీటీవీ రికార్డులను పరిశీలించటానికి అనుమతించాలని పార్లమెంటు సెక్రటేరియట్‌ను పోలీసులు కోరే అవకాశం ఉందని తెలిసింది. కాగా, పార్లమెంటు ఘటన సందర్భంగా రాహుల్ తనతో అనుచితంగా ప్రవర్తించారంటూ బీజేపీ మహిళా ఎంపీ ఫాంగ్‌నాన్ కొన్యాక్ ఆరోపించిన నేపథ్యంలో మహిళా కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరింది.

### రాహుల్ ఎన్నడూ అలా చేయరు

రాహుల్‌పై ఎఫ్ఐఆర్ దాఖలు కావటంపై ఆయన సోదరి, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ స్పందిస్తూ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. అమిత్‌షా వ్యాఖ్యల వల్ల అంబేడ్కర్‌కు జరిగిన అవమానాన్ని భారతదేశం సహించదన్న విషయం బీజేపీకి తెలుసు కాబట్టే.. ఈ తరహాలో దృష్టి మరల్చే పనులకు పాల్పడుతోందన్నారు. అంబేడ్కర్ పట్ల బీజేపీకి ఉండే అసలు అభిప్రాయాలు ఇప్పుడు బయటపడ్డాయని, దీనివల్లే ఆ పార్టీ భయపడుతోందని విమర్శించారు. కేంద్రానికి చర్చలంటే భయమని, అందుకనే అదానీతో పాటు ఏ అంశంపైనా పార్లమెంటులో చర్చకు ముందుకు రావటం లేదన్నారు. రాహుల్ ఎలాంటి వాడో ఆయన సోదరిగా తనకు తెలుసునని ప్రియాంక పేర్కొన్నారు. 'రాహుల్ ఎవరినీ నెట్టివేయరు. అటువంటి పని ఆయన ఎన్నడూ చేయరు. ప్రభుత్వం పూర్తి నిరాశలో కూరుకుపోయింది. అందువల్లే రాహుల్‌పై పలు తప్పుడు కేసులు నమోదు చేస్తోంది' అని ఆరోపించారు.

### ప్రియాంకకు '1984' బ్యాగును బహూకరించిన బీజేపీ ఎంపీ

ప్రియాంకా గాంధీకి శుక్రవారం పార్లమెంటులో అనూహ్య పరిణామం ఎదురైంది. బీజేపీ మహిళా ఎంపీ అపరాజిత సారంగి.. ప్రియాంకకు '1984' అని ఎరుపు రంగుతో రాసి ఉన్న బ్యాగును బహుమతిగా ఇచ్చారు. 1984లో ఇందిరా గాంధీ హత్య తర్వాత జరిగిన సిక్కుల ఊచకోతను గుర్తుచేసే విధంగా బ్యాగును రూపొందించారు. అయితే ప్రియాంక మాత్రం తొలుత బ్యాగును తీసుకోవడానికి నిరాకరించినా... కొద్దిసేపటికి తీసుకొని పక్కన పడేసి వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను సోషల్ మీడియాలో బీజేపీ ఎంపీ పోస్టు చేశారు.

## జమిలి ఎన్నికలను తీవ్రంగా వ్యతిరేకిస్తాం

### కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్


న్యూఢిల్లీ, డిసెంబరు 20: 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అనేది రాజ్యాంగ మూల స్వరూపానికి విరుద్ధమని, ఈ ఆలోచనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ శుక్రవారం స్పష్టం చేసింది. ఒకే దేశం, ఒకే ఎన్నిక ఆలోచన అనేది ప్రజాస్వామ్య వ్యతిరేకమే కాకుండా సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. జమిలి ఎన్నికలు నిర్వహించేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసే బిల్లులను ప్రవేశపెట్టే సమయంలో 272 మంది ఎంపీలను కూడబెట్టలేకపోయిన ప్రభుత్వం.. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని ఎలా సమకూర్చుకుంటుందని జైరామ్ రమేష్ ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌పై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం నోటీసు కేవలం ట్రైలర్ మాత్రమేనని జైరామ్ రమేష్ అన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఛైర్మన్‌పై మళ్లీ విపక్షాలు అభిశంసన నోటీసు ఇచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## పార్లమెంట్ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: అధికార, విపక్ష సభ్యుల మధ్య తోపులాటలు, వాగ్వాదాల మధ్య పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగిశాయి. రాజ్యాంగంపై చర్చ, జమిలి ఎన్నికలపై బిల్లును జేపీసీకి పంపడం మినహా ఈ సమావేశాల్లో పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించారంటూ విపక్షాలు ఆరోపించడం, అధికార పక్ష సభ్యులు అడ్డుకోవడంతో ఉభయసభలు అట్టుడికాయి. చివరి రోజు కూడా ఇదే విషయంపై విపక్షాల నిరసనలు కొనసాగడంతో ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. చివరి రోజు లోక్‌సభ ప్రారంభమైన 3 నిమిషాలకే స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదా వేశారు. అంతకు ముందు తేనీటి విందుకు రావాలని స్పీకర్ ఆహ్వానించినా విపక్ష సభ్యులు రాలేదు. నవంబరు 25న శీతాకాల సమావేశాలు ప్రారంభం కాగా మొత్తం 3 సెషన్లలో 70 పనిగంటలను లోక్‌సభ కోల్పోయింది. తద్వారా 57.87 శాతం మాత్రమే పనిచేసింది. రాజ్యసభలోనూ విపక్షాల ఆందోళనతో కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. చివరి రోజు ఆయిల్ ఫీల్డ్స్ సవరణ బిల్లు, 2024 బాయిలర్స్ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. శీతాకాల సమావేశాల్లో రాజ్యసభ మొత్తం 43 గంటల 27 నిమిషాలు పనిచేసింది. 40.03 శాతం మాత్రమే పనిచేసింది. కాగా, దేశవ్యాప్తంగా లోక్‌సభకు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును అధ్యయనం చేసేందుకు కేంద్రం జేపీసీలో మొత్తం 39కి చోటు కల్పించింది. సభ్యుల్లో 27 మంది లోక్‌సభకు, 12 మంది రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న 12 మందిలో తెలంగాణ నుంచి కె.లక్ష్మణ్, ఏపీ నుంచి విజయసాయిరెడ్డికి స్థానం కల్పించారు. బీజేపీ ఎంపీ పీపీ చౌదరి జేపీసీకి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

## మసీదు-మందిరాల రగడ వద్దు

### ఆర్ఎస్ఎస్ చీఫ్ భగవత్ వ్యాఖ్యలు



పుణే, డిసెంబరు 20: 'సామరస్యంతో కూడిన సమ్మిళిత సమాజమే ముద్దు. మసీదు-ఆలయాల రగడ వద్దు' అని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఆలయాలు, మసీదుల వ్యవహారంపై జరుగుతున్న వివాదాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయితే.. ఏ వివాదాన్నీ నేరుగా ఆయన ప్రస్తావించలేదు. 'అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత.. పలు ప్రాంతాల్లో కొందరు ఇలాంటి వివాదాలనే తెరమీదికి తెస్తూ.. హిందువులకు నాయకులుగా ఎదగాలని భావిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలోని పుణేలో జరిగిన ఓ కార్యక్రమంలో 'భారత్ విశ్వగురు' అనే అంశంపై భగవత్ ప్రసంగించారు. సమ్మిళిత సమాజం దేశానికి అవసరమని పేర్కొన్నారు. 'దేశం సామరస్యంతో కలిసి జీవించగలదని ఈ ప్రపంచానికి చూపించాల్సిన అవసరం ఉంది. రామకృష్ణ మఠంలో క్రిస్మస్‌ను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. హిందువులుగా ఇలాంటివి మనకే సాధ్యం. చాలా కాలంగా ఈ దేశ ప్రజలు సామరస్యంగా జీవిస్తున్నారు. ఈ సామరస్యాన్ని ప్రపంచానికి చూపేందుకు.. మనం ఒక నమూనాగా మారాల్సి ఉంది' అని వ్యాఖ్యానించారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత చాలా మంది కొత్త కొత్త ప్రదేశాల్లో ఇలాంటి అంశాలనే తెరమీదికి తెస్తున్నారని, కానీ.. ఇది ఆమోదయోగ్యం కాదని తెలిపారు. 'ఎవరు మైనారిటీ.. ఎవరు మెజారిటీ? ఇక్కడ ప్రతి ఒక్కరూ సమానులే. ఎవరి విశ్వాసాలను వారు అనుసరించవచ్చు' అని భగవత్ అన్నారు. భగవత్ వ్యాఖ్యలపై అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. పెట్టాల్సిన చిచ్చు పెట్టి.. ఇప్పుడు ఏమీ తెలియనట్టు ముచ్చట్లు చెబుతున్నారని, ఇకపై తవ్వకాలు వద్దని పిలుపునిస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## జీవిత, వైద్య బీమా ప్రీమియంపై తగ్గనున్న జీఎస్టీ!

జైసల్మేర్, డిసెంబరు 21: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఆధ్వర్యంలో జీఎస్టీ కౌన్సిల్ శనివారం సమావేశం కానుంది. ఈ భేటీలో జీవిత బీమా, వైద్య బీమా ప్రీమియంల మీద జీఎస్టీ రేటును తగ్గించే అవకాశాలున్నాయి. ఆరోగ్యానికి హాని కలిగించే ఆహారపదార్థాలు (సిన్ ఫుడ్స్)పై జీఎస్టీ రేటును హేతుబద్ధీకరించే అవకాశాలున్నాయి. ఫుడ్ డెలివరీ సంస్థలు స్విగ్గీ, జొమాటోలపై జీఎస్టీ రేటును 5శాతం తగ్గించే అవకాశాలున్నాయి. ఈవీ వాహనాలు.. పెట్రోలు, డీజిల్‌తో నడిచే చిన్నస్థాయి వాహనాలపై జీఎస్టీని 12శాతం నుంచి 18శాతానికి పెంచాలని ఫిట్‌మెంట్ కమిటీ సిఫారసు చేసే అవకాశాలున్నాయి. కాగా జీఎస్టీ 55వ కౌన్సిల్ సమావేశంలో వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు పాల్గొంటారు. మొత్తంగా 148 వస్తువులపై జీఎస్టీని హేతుబద్ధీకరించడానికి ప్రతిపాదనలు వచ్చాయి.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.